సంపుటి : 9
సంచిక : 5
పుటలు : 52
రు. 25లు
ISSN NO:
2582-8738
యు.జి.సి. గుర్తింపు పొందినది

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

జులై 2023

విజ్ఞాన సర్వస్వ నిర్మాణ ప్రచురణలో దక్షిణ భారతీయ భాషలలో తెలుగును మొదటి స్థానంలో నిలబెట్టినవాడు. స్వభాషలో స్వదేశ చరిత్రను రాసినవారిలోనూ దక్షిణ భారతంలో ఆయనదే తొలి స్థానం. గ్రంథాలయ స్థాపన, శాసన సేకరణ ప్రచురణ, శాస్త్రీయ పద్ధతిలో చరిత్ర పరిశోధన, ప్రాచీన గ్రంథ పరిష్కరణ, శాస్త్ర సాహిత్య పరికల్పన, పరిభాషా కల్పన, పాఠ్యగ్రంథ రచనలలో తెలుగువారికి మార్గదర్శకుడు. వ్యవహారిక భాషోద్యమాన్ని కాదని, ఆయన సరళగ్రాంథికాన్ని చేపట్టారు.



## కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు

పరిశోధకాగ్రేసరుడు,
'తెలుగు భాషాతత్త్వము' రచయిత,
తెలుగుజాతి వైతాళికుడు.
2023, జులై 13 నాటికి
కనుమరుగై నూరేళ్లైంది.



విజ్ఞాన చంద్రికా మండలి సంస్థాపకుడు

కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు, రాజా నాయుని వేంకట రంగారావు, రావిచెట్టు రంగారావు, అయ్యదేవర కాళేశ్వరరావు, డా.ఆచంట లక్ష్మీపతి

భాషాపరంగా తెలంగాణ ఉన్నత న్యాయస్థానం నూతన వరవడి

### తెలుగుజాతి వైతాళికుడు

# కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావుగారి శత వర్ధంతి సభ

### (13 జులై 2023, గురువారం)

# అందరికీ ఆహ్వానం



జీవితంలో అనుక్షణం పరిశోధనే ప్రాణంగా, భాషాచరిత్ర, సాహిత్యాలను మథించి, సజాతీయ విజాతీయ భాషా సాహిత్యాల లోతులను చూసి, సాదృశ్య వైదృశ్యాలను సమ్యక్ దృష్టితో తెలుగుజాతికి అందించిన, తెలుగువారిని ఆధునికయుగం వైపు నడిపించిన మహనీయుడు, తెలుగువారు విస్మరించిన వైతాళికుడు కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు గారు (1875–1923).

చరిత్ర, శాసన పరిశోధనను మల్లంపల్లి సోమశేఖరశర్మ, చిలుకూరి వీరభద్రరావు వంటి తొలితరం చరిత్రకారులకు నేర్పడం, 'శివతత్త్వసారం' వంటి తొలి తెలుగు శతకాన్ని పరిష్కరించి, ప్రచురించి ప్రాచీన గ్రంథపరిష్కరణలో కొత్తబాటలు వేయడం, తెలుగులో విజ్ఞానసర్వస్వ నిర్మాణానికి పూనుకొని స్వీయమార్గంలో కొత్తబాటలు వేయడం, 'విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి'ని స్థాపించి చరిత్ర, వైజ్ఞానిక శాస్త్రాలను అందించి తెలుగువారిని జాగృతపరిచారు. ఆయన జీవిత చరమాంకంలో 1922లో అనారోగ్యంగా వుండికూడా 'తెలుగుభాషాతత్త్వం' (తెలుగు ఫిలాసఫీ) అను ప్రామాణిక గ్రంథాన్ని తెలుగుజాతికి ఇచ్చారు. తెలుగుభాషా చరిత్రలోనే ఇదొక విశిష్టాంశం. తన నలభైఆరు సంవత్సరాల జీవితాన్ని సార్థకం చేసుకొని తెలుగు సమాజంపై చెరిగిపోని ముద్రవేసిన ఆ మహనీయుడు, మరణించి 13జులై 2023 నాటికి వంద సంవత్సరాలు. కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు గారిని స్మరించుకొంటూ వారు దివాన్‌గా పనిచేసిన మునగాల రాజా నాయుని వేంకట రంగారావుగారి కోటలో లక్ష్మణరావుగారి 100వ వర్ధంతి సంస్మరణ సభను నిర్వహించుకొందాం. 13 జులై 2023న జరుగబోయే శతవర్ధంతి కార్యక్రమానికి ఆసక్తిగల వారందరూ ఆహ్వానితులే. ఈ సభలో ప్రముఖ చరిత్ర పరిశోధకులు, సాహితీవేత్తలు, భాషావేత్తలు పాల్గొననున్నారు.

**ఈ సభలో**

- **కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు శత వర్ధంతి సందర్భంగా చిరస్మరణీయమైన సంస్మరణ సంచికనూ**
- **మల్లికార్జున పండితుని 'శివతత్త్వసారం' (100 ఏళ్ల తర్వాత పునర్ముద్రణ) గ్రంథాన్నీ**
- **కొమఱ్ఱాజుగారి చివరి విశిష్ట రచన– తెలుగుభాషాతత్త్వము (TELUGU PHILOSOPHY) పునర్ముద్రణ (విపులమైన ముందుమాటతో)నూ వెలువరిస్తున్నాం.**

అరుదుగా జరిగే ఈ ప్రత్యేక కార్యక్రమం 2023, జులై 13 గురువారం
ఉదయం 10 గం. నుండి సాయంత్రం 5 గం. వరకు జరుగుతుంది.

**వేదిక:**

**దక్కన్ ఆర్కీవ్స్ అండ్ కల్చరల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్, మునగాల రాజా నాయుని వేంకట రంగారావు భవనం, నడిగూడెం (విజయవాడ–హైదరాబాదు జాతీయ రహదారిలో బారాఖత్ గూడెం నుంచి 4 కి.మీ లోపలికి), కోదాడ–సూర్యాపేట మధ్య.**

అందరూ పాల్గొని ఈ సభను విజయవంతం చేయగోరుతున్నాం.

దూర ప్రాంతాల నుండి వచ్చేవారికి – సభకు ముందు రాత్రికి గాని, సభ తర్వాత రాత్రికిగాని ఉండేందుకు ఏర్పాటు కలదు. మీ రాకను దయచేసి ముందుగా తెలుపగోరుతున్నాం.

కె.జితేంద్రబాబు, అధ్యక్షులు
కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు సాహితీ సాంస్కృతిక సమాఖ్య
నడిగూడెం మునగాల – 98488 82600 / 90691 63333(వాట్సాప్)

**తెలుగు భాషోద్యమ సమాఖ్య, అమ్మనుడి అభినందనలతో...**

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు *9848016136*

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి





జులై 2023


## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట – ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు, కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4. <u>హామీపత్రం తప్పనిసరి:</u> రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. హామీ పత్రంలేని రచనలను, ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం 1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.**

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **ఇవీ సంగతులు** | ...................... | | **05** |
| **సంపాదక హృదయం** | తెలంగాణ న్యాయస్థానం... | | **07** |
| **కీలకోపన్యాసం** | భాషాశాస్త్రంలో .... | **గారపాటి ఉమామహేశ్వరరావు** | **09** |
| **భాషా పరిరక్షణ** | భాషా పరిరక్షణ ఎందుకు? | **రహ్మానుద్దీన్ షేక్** | **12** |
| **ప్రజా చైతన్య సభ** | సమాఖ్యకు తోడ్పాటు ,...... | **సి.మధు** | **14** |
| **ప్రజా చైతన్య సభ** | తెలుగులోనే పరిపాలన... | **డా.గుంటుపల్లి శ్రీనివాస్** | **15** |
| **ప్రజా చైతన్య సభ** | కోట్లాది ప్రజల భాష.... | **నందిని సిధారెడ్డి** | **16** |
| **కర్నాటక ఎన్నికలు** | కర్నాటక ఎన్నికలలో....... | **స.వెం.రమేశ్** | **20** |
| **ముఖచిత్ర కథనం** | శ్రీ కొమఱ్ఱాజు వేంకట.... | **కీ.శే.తిరుమల రామచంద్ర** | **23** |
| **భాషారమ్యత** | రాఘవ పాండవీయము... | **భమిడిపాటి గౌరీశంకర్** | **33** |
| **అనువాదం** | ఆధ్యాత్మిక రచనలు.... | **టి.షర్మిలా ప్రతిమ** | **35** |
| **చంద్రిక కథ** | సుబ్రహ్మణ్యభారతి రచన | **బంగోరె ముందుమాటలు** | **37** |
| **సాహిత్య రంగం** | అద్దంకి పద్యశాసనం.... | **మధురాంతకం నరేంద్ర** | **40** |
| **వారసత్వ సంపద** | ఉద్యోగ పర్వాలు | **పి.శివరామకృష్ణ 'శక్తి'** | **42** |
| **పుస్తక సమీక్ష** | నగ్నముని బహిరంగ ప్రకటన... | **డా. సుంకర గోపాలయ్య** | **46** |
| **పుస్తక పరిచయం** | రామసింహకవి ఆత్మకథ | **సంకేపల్లి నాగేంద్రశర్మ** | **47** |
| **వెలిసిపోతున్న పదాలు:** | ఎమ్డెన్ | **జి.వి.పూర్ణచంద్** | **48** |
| **..................** | ఆలోచన అంటే.... | **సి.వి.కృష్ణయ్య** | **50** |
| **ధారావాహిక** | అడుగుజాడలు-ఆనవాళ్ళు-24 | **ఈమని శివనాగిరెడ్డి** | **43** |



| ముఖచిత్రం, | కార్టూన్లు | కంప్యూటర్ |
|---|---|---|
| **చిదంబరం రావు** | **సరసి** | **యన్.రాజారావు** |


ammanudi.org వలగూటిలో **అమ్మనుడి పాత సంచికలను చదువగలరు**

**రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు:** 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్స్‌యాప్(WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
నుడి నాడు నెనరు మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000
4 సం॥: రూ.1000, 1 సం॥ :రూ.300
ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

### బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**
అక్కౌంట్ నెం. **914020020387880**
**IFSC Code : UTIB0000556**

Telugu Jaathi
+91 94929 80244
9492980244@okbizaxis

ఈ **QR**కోడ్‌ను స్కాన్ చేసి లేదా **QR**కోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.
**94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94404 48244, 94929 80244,
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

### గమనిక

పత్రికకు చందాదారులుగా చేరినవారి రచనలను తప్పనిసరిగా ప్రచురిస్తామనే హామీ ఏమీలేదు. ఏ రచనలను ప్రచురించాలో ఎంపిక చేసే బాధ్యత కేవలం పత్రిక సంపాదకుడిదే. దయచేసి ఎవ్వరూ వత్తిడి తేవద్దు. -ప్రచురణకర్త

### ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

## తెలుగుజాతి(ట్రస్టు) ప్రచురణ

# ఇవీ సంగతులు...

## గిరిజనులకు వారి అమ్మనుడులలోనే విద్యాబోధన

ఆక్స్‌ఫామ్ ఇండియా వారు అంజెలా తనేజా నేతృత్వంలో భారతదేశంలో గిరిజనులకు అందే విద్యలో మాతృభాష పరిస్థితిని, గిరిజన ప్రాంతాల్లో మాతృభాష ఆధారిత విద్యను హక్కుగా అందిస్తున్న పరిస్థితిని పరిశోధిస్తూ ఒక పత్రాన్ని సమర్పించారు. ఈ పత్రంలో కొన్ని గణాంకాలు ఆసక్తికరమైనవి ఇక్కడ చదువరుల కోసం:

భారతదేశం భాషావైవిధ్యంలో ప్రపంచంలో నాలుగవ స్థానంలో ఉంది. 19,569 భాషలు లేదా యాసలు/మాండలికాలు భారతదేశ ప్రజలు మాట్లాడుతారు. ఇందులో కేవలం 121 భాషలకు మాత్రమే 10,000 మించిన జనాభా మాతృభాషగా కలిగి ఉన్నారు. అంటే 19,448 భాషలను 10వేలకన్నా తక్కువ జనాభా మాట్లాడుతున్నారు. భారతదేశ రాజ్యాంగం గుర్తించిన 22 భాషల్లో కేవలం మూడు మాత్రమే గిరిజనులు మాట్లాడే భాషలు. 2015-16 సంవత్సరంలో భారతదేశంలో మాట్లాడే వేల భాషల్లో కేవలం 28 భాషల్లో మాధ్యమభాషగా విద్యాబోధన జరిగింది. దాదాపు 80 భాషల్లో బోధనాభాషగా (మాధ్యమం కాదు) విద్యాబోధన జరిగింది. అంటే అన్ని భాషల్లో కేవలం 0.14% భాషలు బోధనమాధ్యమ భాషగా, 0.35% భాషకలకు బోధన భాషగా అమలవుతున్నాయి. ఇది బోధన జరగని భాషలకు చాలా అపాయకరమైన పరిస్థితి. బోధన జరగని భాషల పిల్లలు ముఖ్యంగా గిరిజన పిల్లలు తమది కాని, తమకు అర్థం కాని పరాయి భాషలో చదువులు కొనసాగిస్తున్నారు. వీరి తరువాతి తరానికి మాట్లాడే భాషగా ఆయా భాషల మనుగడ ప్రశ్నార్థకమే. 10.4 కోట్ల జనాభా ఉన్న గిరిజనులు ఈ విధంగా పరాయి భాషల్లో చదవడం వలన తరగతి గదుల్లో ఆత్మన్యూనతను అనుభవిస్తున్నారని, అందువలన బడి మానేస్తున్నారని, చదువులకు దూరమవుతున్నారని తెలుస్తోంది. ఇది మన రాజ్యాంగంలోని ప్రకరణ 350(ఎ) ప్రకారం ప్రభుత్వాల తప్పిదమే.

⦿**వికిటంగ్స్ - ప్రపంచంలోని భాషలన్నిటినీ డాక్యుమెంట్ చేసేందుకు,** ఆయా భాషల వనరులను ఒక చోట చేర్చేందుకు రూపొందించిన ఒక అమెరికా దేశపు ప్రాజెక్టు. జూన్ నెలలో ముంబై లో జరిగిన టెడ్-ఎక్స్ సమావేశంలో వికిటంగ్స్ ఇడి డేనియల్ బొగ్రె ఉడెల్ మాట్లాడుతూ (wikipongues.org) లో ఈ ప్రాజెక్టు ఉంటుందని, ప్రపంచ భాషల వారు తమ భాషా వనరులను భద్రపరుచుకునే ఉద్దేశ్యంతో ఈ ప్రాజెక్టును స్థాపించామని చెప్పాడు. ప్రాంతీయ భాషలు ఆ ప్రాంతపు సాంస్కృతిక, చారిత్రక, మరియు వాతావరణ పరమైన అంశాలను నిక్షిప్తం చేసుకుంటాయని, అందువలన ఆ భాషలను కాపాడుకోవటం అవసరమని అన్నాడు.

⦿**అరుణాచల్‌ప్రదేశ్ లో ప్రమాదంలో ఉన్న భాషల పరిరక్షణ, పరిశోధనకు (RIWATCHV జన కేంద్రం ప్రారంభం**
అరుణాచల్ ప్రదేశ్ లోని కింది దిబాంగ్ లోయ జిల్లాలోని ఖింజిలి పట్టణంలో అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి టోమో రిబా ప్రారంభించారు. ఈ పరిశోధనా కేంద్రం ద్వారా అరుణాచల్ ప్రదేశ్ లోని లిపి ఉన్న, లిపి లేని భాషల వివరాలు సేకరించి, భాషలను నేర్చుకునే వనరులను నిక్షిప్తం చేయడమే కాకుండా, ప్రతి వ్యక్తి చేత వారి మాతృభాషల్లో మాట్లాడించి, మాతృభాషలో మాట్లాడటం గురించిన బిడియాన్ని నామోషీని తగ్గించేలా చర్యలు తీసుకుంటామని ప్రారంభోత్సవ సభలో ఉపకులపతి అన్నారు.

⦿**మహారాష్ట్ర, అస్సాం, ఝార్ఖండ్, గుజరాత్** రాష్ట్రాల విద్యా కార్యదర్శుల సమావేశంలో **మాతృభాషా మాధ్యమ బోధన**పై చర్చ. పూణేలో జూన్ నెలలో నాలుగు రాష్ట్రాప్రభుత్వాల విద్యాశాఖ కార్యదర్శులు రెండు రోజులు సమావేశమై జాతీయ విద్యా విధాన అమలుపై, ముఖ్యంగా మాతృభాషా మాధ్యమ బోధనపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా మాతృభాష మాధ్యమ విద్య లేని పక్షంలో విద్యార్థికి, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మధ్య సమన్వయం ఉండదని, తద్వారా విద్యార్థి చదువు కుంటుపడుతుందని ఆహూతులు అభిప్రాయపడ్డారు.

⦿**నేను నా మాతృభాషలో కవితలు రాయాలనుకుంటున్నాను,** నా ప్రాంతపు సంస్కృతి నా భాషా పదాల్లో ప్రతిబింబిస్తుంది: లహౌల్-స్పిటి ప్రాంతపు కవి ఆవేదన. లహౌల్ - స్పిటి ప్రాంతంలో మాట్లాడే పట్ని భాష మాట్లాడే కవి అజేయ్, హిమ్బుమెయిల్(హిమాలయ ప్రాంతాల విశేష పత్రిక) లో తమ అభిప్రాయాన్ని చెబుతూ, హిమాలయాల సంస్కృతిని, శోభను కేవలం అక్కడి ప్రాంత భాషలే చక్కగా వివరించగలవని, అక్కడి జరిగే ప్రకృతిలోని క్రియలకు, అక్కడి జనం దినచర్యకు సరిపోయే పదాలు పెద్ద భాషల్లో ఉండవని, ప్రాంతీయ భాషల్లోనే ఉంటాయని, అయితే ఆంగ్లం-హిందీ లాంటి పెద్ద భాషల అతిక్రమణ వలన ప్రాంతీయ భాషలు కనుమరుగవుతున్నాయని ఆయన ఆవేదన చెందారు.

⦿**కొచ్చిలో ఒడియా బడులు ప్రారంభం**
ఒడిశా నుంచి వలస వచ్చిన కూలీలు, పనిమంతుల కోసం కొచ్చి లో ఒడియా మాధ్యమ బడులు ఏర్పాటయ్యాయి. ప్రాంతీయ ఒడియా సంఘాల సహాయంతో వారాంతాలలో కొచ్చిలోని కొన్ని ప్రైవేట్ బడులలో వినూత్నంగా ఈ ప్రయోగం చేస్తున్నారు. పిల్లలు కూడా ఆసక్తిగా తమ మాతృభాష మాధ్యమంలో చదువులను చూసి అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు..

⦿**బెంగుళూరులో నివసిస్తున్న కన్నడేతరులు కన్నడ భాషను నేర్చుకోవటంలో ఆసక్తిని ఎందుకు చూపరు?** ఈ అంశమై 'హిందుస్తాన్ టైంస్'లో శోభా నారాయణ్ ఆసక్తికరమైన విషయాలను పంచుకుంటున్నారు. అక్కడ చర్చించిన అంశాల వలెనే మన రాష్ట్రాల్లో హైదరాబాదు, విశాఖపట్నం నగరాలలో కూడా తెలుగేతరులు తెలుగు

నేర్చుకోకుండానే మనగలుగుతున్నారు. భాష నేర్చుకోకపోతే మనగలగడం అనేది ఆ నగరానికి ఉన్న విశిష్టతగా కొందరు చూడవచ్చు గానీ, ఆ ప్రాంతపు సంస్కృతిని, సామాజికాంశాలను **అక్కడి భాష నేర్చుకుంటే ఇంకా బాగా అర్థం చేసుకోవచ్చు.** ఇరుగుపొరుగుతో ఇట్టే కలిసిపోవచ్చు.

⦿ **జమ్మూ కాశ్మీర్‌లో మూడు మాతృభాషల్లో విద్యాబోధన** అందుబాటులో ఉన్నా కేవలం ఉర్దూలోనే బోధనకు అక్కడి విద్యార్థులుఇష్టపడుతున్నారు. కాశ్మీర్ ప్రాంత మాతృభాషలు కశ్మీరి,డోగ్రి. ఆ భాషల్లో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం మాతృభాషా మాధ్యమ బోధనను, ఒక విషయంగా(రెండవ భాషగా) ఆ భాషలను అందిస్తోంది. కానీ అక్కడి విద్యార్థులు ఉర్దూలో అత్యధికంగా, ఆ తరువాత హిందీలో, ఆ తరువాత అరబ్బీలో, ఆపై పెర్షియన్ లో రెండవ భాష పరీక్షలు రాశారు. పన్నెండవ తరగతి పరీక్షకు హాజరైన 1,27,522 విద్యార్థులలో 30% ఉర్దూ, 8% హిందీలో, 1.5% అరబ్బీలో, 1.3% పారాశీకంలో పరీక్షలు రాసారు.

⦿ **మనీలాలో 50% విద్యార్థులు తమకు తెలియని భాషలో విద్యనభ్యసిస్తున్నారు.** మనీలా దేశపు విద్యాశాఖ మంత్రి ఒక వ్యాఖ్య చేస్తూ ఆవేదన వ్యక్తం చేసారు. వారి దేశంలో మాతృభాషా విద్యాబోధనకు చట్టాలున్నప్పటికీ, వనరులున్నా, 50% విద్యార్థులకు మాతృభాషా విద్యాబోధన అందడం లేదు

⦿ హైదరాబాదులోని **రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వారి జాలస్థలం తెలుగులో కూడా అందుబాటులోకి వచ్చింది.** విమానాల రాకపోకల సమాచారం, విమానాశ్రయ సమాచారం ఇకపై ఇంగ్లీష్ తో పాటుగా తెలుగులో కూడా అందుబాటులో ఉంటుంది.

⦿ **కడప జిల్లా వాసులకు కేంద్ర సాహిత్య అకాదమీ పురస్కారాలు:** కడప జిల్లాకు చెందిన డి కె చదువులబాబు కు 2023 సంవత్సరపు కేంద్ర సాహిత్య అకాడమీ బాలల సాహిత్య పురస్కారం ప్రకటించారు. తక్కెడశిల జానీ బాషా చరణ్ కు, అతని విమర్శనా రచన వివేచని పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడెమీ యువ పురస్కారం దక్కింది.

⦿ **అమెరికా కాన్సులేట్ తెలుగు పాత్రికేయులకు** ప్రపంచ స్థాయిలో జరుగుతున్న వాతావరణ మార్పులపై వార్తలు ఎలా రాయాలనే అంశంపై తెలుగులో కార్యశాల ఏర్పాటు చేసింది.

⦿ **అమెరికా కాన్సులేట్ తెలుగు పాత్రికేయులకు శిక్షణ:** ప్రపంచ స్థాయిలో జరుగుతున్న వాతావరణ మార్పులపై వార్తలు ఎలా రాయాలనే అంశంపై తెలుగు కాన్సులేట్ తెలుగు పాత్రికేయులకు తెలుగులో కార్యశాల ఏర్పాటు చేసింది.

⦿ **ఫోన్‌పే నిర్ధారణ సూచనలు ఇక తెలుగులో...**మనం ఏదైనా దుకాణంలో యూపీఐ ద్వారా డబ్బులు చెల్లించినపుడు వినిపించే సూచనలను ఫోన్ పే సంస్థకు సంబంధించిన యంత్రాలలో ఇకపై తెలుగులో వినవచ్చు. ఆ విధంగా సాంకేతిక ఏర్పాటును ఫోన్‌పే తయారు చేసింది.

⦿ **వికీపీడియా 333 భాషల్లో** అంతర్జాల విజ్ఞాన సర్వస్వం వికీపీడియా ఇంగ్లిష్ లోనే కాక ప్రపంచంలోని 333 భాషల్లో అందుబాటులో ఉంది. భారతీయ భాషల్లో అత్యధిక వ్యాసాలు కలిగిన భాష హిందీ కాగా తరువాతి వరుసలో తమిళం, బాంగ్లా ఉన్నాయి. ఈ భాషల్లో లక్షన్నరకి దగ్గరగా వ్యాసాల సంఖ్య ఉంది. అయితే తెలుగులో మాత్రం 83 వేల వ్యాసాలే ఉన్నాయి.



సంపుటి : 9 సంచిక: 5
**అమ్మనుడి**
జులై, 2023



**రాష్ట్ర చరిత్రలో తొలిసారి.. తెలుగులో తీర్పిచ్చిన హైకోర్టు**

TS హైకోర్టు కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర చరిత్రలో తొలిసారి తెలుగులో తీర్పిచ్చింది. ఓ భూవివాదం కేసుకు సంబంధించి జస్టిస్ పి.నవీన్‌రావు, జస్టిస్ నగేశ్‌తో కూడిన ధర్మాసనం 45 పేజీల తీర్పును మాతృభాషలో వెలువరించింది. అప్పీల్ కోసం ఇంగ్లిష్‌లోనూ తీర్పు చెప్పి.. దాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించింది. హైకోర్టు తెలుగులో తీర్పు ఇవ్వడంపై భాషాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంపాదక హృదయం

# భాషాపరంగా తెలంగాణ ఉన్నత న్యాయస్థానం నూతన వరవడి

ఇటీవల తెలంగాణ ఉన్నత న్యాయస్థానం తెలుగులో వెలువరించిన తీర్పు కొత్త వరవడికి దారితీస్తుందని ఆశించవచ్చు. ఎందుకంటే న్యాయస్థాన ఆచారాల ప్రకారం ఇద్దరు న్యాయమూర్తులు తీర్పు యిచ్చినా దానిని న్యాయస్థాన తీర్పుగానే పరిగణిస్తారు. రాజ్యాంగబద్ధతని పాటిస్తూనే, తెలుగుభాషలో తర్జుమా ప్రతిని కూడా వెలువరించడం తెలంగాణ న్యాయస్థాన చరిత్రలో మొదటిసారి. ఇప్పుడు సుప్రీంకోర్టు చేపట్టిన తర్జుమా సంప్రదాయ వరవడిలో జరిగిందే కానీ, కొన్ని పత్రికల్లో వచ్చినట్లు తెలుగులో మొదటితీర్పుగా పరిగణించకూడదు.

రాజ్యాంగంలోని 348వ అధికరణం ఇలా వుంటుంది:

1. ఈ విభాగంలో ఏవిధంగా ఉన్నప్పటికీ, పార్లమెంటు చట్టంద్వారా వేరే విధంగా ఏర్పాటుచేసే వరకూ

(ఎ) సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో అన్ని వ్యవహారాలు

(బి) అధికారప్రతులు

(i) పార్లమెంటు ఉభయసభల్లో, శాసన సభ ఉభయసభల్లో ప్రతిపాదించాకే బిల్లులు,దాని సవరణలు

(ii) పార్లమెంటు, శాసనసభలు చేసే చట్టాలు, రాష్ట్రపతి, గవర్నర్లు జారీ చేసే ఆర్డినెన్స్‌లు

(iii) రాజ్యాంగం కిందకాని, పార్లమెంటు, శాసనసభ చేసిన చట్టాల కింద కాని జారీచేసే ఉత్తర్వులు, రూల్స్, రెగ్యులేషన్స్, బైలాలు

(2) ఉపకరణం (1)(ఎ)లో పైవిధంగా ఉన్నప్పటికీ, ఒక రాష్ట్రంలోని గవర్నరు, రాష్ట్రపతి ముందస్తు అనుమతితో, హిందీ కాని, ఏ ఇతర భాష కాని ఆ రాష్ట్రంలో అధికార భాషగా వినియోగించబడినప్పుడు, ఆ రాష్ట్రంలో ఉన్నహైకోర్టులో, ఆ భాషను వినియోగించడానికి అనుమతినివ్వవచ్చు.కాని ఇది హైకోర్టు ఇచ్చే తీర్పులకు, ఆర్డర్లకు, డిక్రీలకు వర్తించదు.

2018–19 సుప్రీంకోర్టు వార్షిక నివేదిక ప్రకారం కొన్ని రకాల కేసుల్లో తీర్పుల్ని తర్జుమాచేయాలని భావించడం జరిగింది. ఎందుకంటే ఆ కేసుల్లో కక్షిదారులు సమాజంలోని క్రింది, మధ్య తరగతులకు చెందినవారు కాబట్టి వారికి ఆంగ్లంలో ప్రావీణ్యత ఉండదని, రాజ్యాంగంలోని 348వ అధికరణం దానికి అవరోధంగా నిలుస్తుందని భావించారు. 14విషయాలకు సంబంధించి తీర్పుల తర్జుమా ఆవశ్యకతను

గుర్తించారు. ప్రస్తుతం కృత్రిమ మేథోపర సాఫ్ట్‌వేర్ (ఎ.ఐ)ను ఉపయోగించి తర్జుమాలు చేయడం జరుగుతోంది. 37శాతం తర్జుమాలు క్రిమినల్ కేసులకు సంబంధించి జరుగుతున్నాయి. సివిల్ తగాదాల్లో ఎక్కువ తీర్పులు ఉద్యోగ సంబంధ విషయాల్లో చేయడం జరుగుతుంది. ఈ సంవత్సరం రిపబ్లిక్ డే సందర్భంగా ప్రధానన్యాయమూర్తి, 1269 తీర్పుల్ని 13 భారతీయభాషల్లో విడుదల చేస్తామని చెప్పారు. అప్పటివరకు 1091 తీర్పులను హిందీలోనూ, 21 ఒరియాలోనూ, 14 మరాఠీలోనూ, 4 అస్సామీలోనూ, 1 గారోలోనూ, 17 కన్నడంలోనూ, 1 ఖాసీలోనూ, 29 మలయాళంలోనూ, 3 నేపాలీలోనూ, 4 పంజాబీలోనూ, 52 తమిళంలోనూ, 28 తెలుగులోనూ, 3 ఉర్దూలోనూ, తర్జుమా చేయబడ్డాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రధానన్యాయమూర్తి చేస్తున్నకృషిని అభినందించారు. ప్రధాన న్యాయమూర్తి 'ఆంగ్లభాష 99.99 శాతం పౌరులకు అర్థం కాని భాష' అని పేర్కొనడం మనం గమనించాలి. 25-1-2023 హిందుస్తాన్ టైమ్స్).

పై రాజ్యాంగాధికరణ ప్రకారం పార్లమెంటు చట్టం చేసేవరకు సుప్రీంకోర్టు, హైకోర్టులలో తీర్పులు ఆంగ్లంలో వుండవలసివుంటుంది. తర్జుమా పత్రాలు ఆయా ప్రాంతీయభాషలలో ఉండవచ్చు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు ప్రధాన తీర్పుపాఠం ఆంగ్లంలో వెలువరించిందా, తెలుగులో వివరించిందా అన్నదానిపై స్పష్టత లేదు. ప్రధాన తీర్పు మాత్రం ఆంగ్లంలో ఉండాలన్నది స్పష్టం. పత్రికలు ప్రచారం చేస్తున్నట్టు తెలుగులో 'తొలితీర్పు' అన్నది సరైనదీ కాదు, సక్రమమూ కాదు.

ఏదిఏమైనా తెలుగు ప్రభుత్వాలనుండి ఆదరణ కోల్పోతున్న తెలుగుకు న్యాయమూర్తులు ఇచ్చిన గౌరవం హర్షించతగ్గది. భాషోద్యమపరంగా మనం చూస్తే తీర్పు పూర్వాపరాల జోలికిగాని, ఉపయోగించిన తర్జుమాభాష గురించి గాని చర్చించవలసిన అవసరం లేదు. సాధ్యాసాధ్యతలను మాత్రమే పరిశీలించాలి.

తేదీ:1 జులై 2023

సామల రమేష్‌బాబు



కీలకోపన్యాసం

గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846

# భాషాశాస్త్రంలో ఓ సరికొత్త విప్లవం సంగణక భాషాశాస్త్రం

'సంగణక భాషాశాస్త్రం-భాషాతంత్రంతో భాషాశాస్త్రంలో ఓ సరికొత్త విప్లవం అనే అంశంపై భారతీయ భాషల సమాచార సమితి, భారతీయ భాషా కేంద్రం, మైసూరు, 19 జూన్ 2023న నిర్వహించిన సంగణక భాషాశాస్త్రంపై వేసవి శిబిరం ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు కీలకోపన్యాసం (సంగ్రహంగా).

**పరిచయం:** ఆధునిక భాషాశాస్త్రంలో సంగణన (కాంప్యుటేషన్) పద్ధతిలో భాషలకు వ్యాకరణ వర్ణన ఒక నూతన అధ్యాయనానికి నాంది పలికింది. ఇప్పటివరకూ ఉన్న వ్యాకరణాలు మానవ భాషల గురించిన సైద్ధాంతిక వర్ణనలే. ఇవి పూర్తిగా మానవ నిర్మితాలే. అంటే, వ్యవహర్తల మస్తిష్కంలో అంతర్లీనంగా అవ్యక్తంగా ఉన్న వ్యాకరణాన్ని కొన్ని సైద్ధాంతిక ప్రక్రియల ద్వారా వ్యక్త పరచడమే వ్యాకరణ రచన. అయితే ఆధునిక సంగణక యంత్రాల ఆవిష్కరణతో మానవ భాషల వ్యాకరణ వర్ణనలకు సరికొత్త పద్ధతులకు మార్గం ఏర్పడింది. ఈ పద్ధతుల గురించిన చర్చే ఈ వ్యాస లక్ష్యం.

**ప్రేరణ**: సంగణక భాషాశాస్త్రానికి ప్రేరణ ఈనాటిది కాదు. వేల ఏండ్ల నాడే అంటే సుమారు ఐదు వేల ఏండ్ల కిందటే భాషలకు లిపి ఏర్పడిననాడే మొదలయింది. అంటే, లిపి నిర్మాణమే భాషలలో వచ్చిన మొదటి భాషాసాంకేతికత. దీనికి ప్రేరణ మాటల క్షణికత్వం. అంటే మాటలలోని ధ్వనులు మాటలాడిన వెనువెంటనే గాలిలో కలిసిపోతాయి. మాటల ఈ దుర్బలత్వమే భాషలలో లిపి ఆవిష్కరణకు ప్రేరణ కలిగించింది. వివిధ లిపుల ద్వారా భాషలలోని శబ్దార్థాల ప్రాతినిధ్యంతో వర్ణమాల నిర్మాణం జరిగింది. ఈ లిపులతో లేఖనం భాషలకు కాల పరిమితిని అధిగమించటానికి తోడ్పడింది.

మధ్యయుగాలలో సమాచార వ్యాప్తికి సంబంధించిన అచ్చువేతలూ, ముద్రణాయంత్రాల ఆవిష్కరణతో ఒకేసారి ఆయా భాషాసమూహాలలో అందరికీ సమాచార ప్రసార ప్రక్రియ అందుబాటులోకి వచ్చింది. ఆధునిక యుగంలో సమాచార బదిలీ అంతర్జాల సాంకేతికతతో భాషా సాంకేతికత తోడై, మాటా, రాతా రెండూ ఒకే సమయంలో పంచుకోవడానికి వీలు కల్పించింది. లిపి నిర్మాణమూ, రాయటమూ, అచ్చుయంత్రమూ సహజ భాషా ప్రక్రియలలో విప్లవానికి దోహదం చేశాయి. అయితే ఎవరి భాషలలో వారు మాట్లాడుకోవడమూ, రాసుకోవడమూ, అదే సమయంలో ఖండఖండాంతరాలలో ఉన్న మరొకరితో పంచుకోవడమూ సాధ్యపడినా వేలాదిగా ఉన్న మానవ భాషలే ప్రస్తుతం సమాచార ప్రసారానికి అడ్డంకిగా కనిపిస్తున్నాయి. అంటే, ఈ ఆధునిక యుగంలో, ఏ భాషలైతే ఒకప్పుడు సమాచార ప్రసారానికి అనువుగా ఉండేవో అవే ఇప్పుడు అడ్డంకిగా మారాయని చెప్పాలి. ఎలాంటి అడ్డంకీ లేని సమాచార ప్రసారానికి ఈ భాషల అవరోధాన్ని తటస్థీకరించడం అవసరం. భాషల తటస్థీకరణ భాషల నిర్మూలనతో గాక భాషల అవరోధాన్ని



ప్రసంగిస్తున్న ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, కూర్చున్న వారు (కుడివైపు): ఆచార్య శైలేంద్ర మోహన్, సంచాలకుడు భారతీయ భాషా కేంద్రం, మైసూరు (ఎడమవైపు):డా. నారాయణ్ చౌధరి,సహాయ సంచాలకులు, భారతీయ భాషాకేంద్రం,మైసూరు.

తటస్థీకరించటంతో జరగాలి. ఇది సంగణక భాషాశాస్త్ర పరిధిలో సంగణక వ్యాకరణ (కాంప్యుటేషనల్ గ్రామర్) నిర్మాణమూ దానిద్వారా, వివిధ భాషా సాంకేతిక ఉపకరణాల (లాంగ్వేజ్ టెక్నాలజీ టూల్స్) నిర్మాణమూ జరగాలి.

ఇక కొత్తగా వచ్చిన భాషాసంగణనానికి మరో ప్రేరణ మానవ భాషల మధ్య వైవిధ్యమే. మానవ భాషలు వివిధ రకాల వైవిధ్యంతో విభిన్నంగా ఉంటాయి. అనువదించినప్పుడు ఈ తేడాలు స్పష్టంగా కనిపిస్తాయి. మూలభాష లక్ష్యభాషల మధ్య దూరం రెండు భాషల మధ్య అనువాద వైవిధ్యానికి కొలమానం. అనువాద వైవిధ్యమే రెండు భాషల మధ్య దూరానికి కొలమానం. ఈ వైవిధ్యాన్ని అధిగమించినప్పుడే గుణాత్మకమైన యంత్రానువాద వ్యవస్థల నిర్మాణం సాకారం అవుతుంది.

**సహజ భాషతో సమస్యలు:** భాషలు ఒకే విధమైన సమాచారాన్ని ఒకే రకంగా సంకేతించవు. ఉదాహరణకు, తెలుగు వాక్యాలలో నామ విభక్తులు చేసే పనిని ఇంగ్లీషు పదాల స్థానబలిమితో సమకూర్చుకొంటుంది. తెలుగులో ప్రశ్నార్థక వాక్యాలు పదాంతంలోని -ఆ కారంతో ఒనగూడితే అదే ఇంగ్లీషులో ప్రశ్నవాచక సర్వనామాలను వాక్యాదికి జరపటం ద్వారా సిద్ధిస్తుంది. ఇంగ్లీషులో నకారాత్మక పదాలైన నన్, నెవర్, నైదర్, నోవేర్, నథింగ్ మొదలైనవాటికి తెలుగులో ఎవరూ...లేరు, ఎప్పుడూ...లేదు, ఏదీ...కాదు, ఎక్కడా...లేదు,

ఏమీ...లేదు అంటూ చెప్పుకోవాలి.

ఇలా భాషలలో ఉన్న వేలాది వ్యాకరణాంశాలు వందలాది చరాంశ రాసులతో కలిసి లక్షలాదిగా ఆంశిక భిన్నత్వాన్ని పొందుతాయి. సహజ భాషలలోని ఈ భిన్నత్వాన్ని పరిమాణీకరణ (క్వాంటిఫికేషన్) చేయడం అసాధ్యం కాదు గానీ అతి సంక్లిష్టమైనదే. ఏదేనీ ఒక జత భాషల మధ్య వ్యత్యాసాన్నిఒక వర్ణపటలంగా (స్పెక్ట్రమ్) ప్రదర్శించవచ్చు, అనగా, ఒక జత భాషల మధ్యనున్న భాషా లక్షణాలలో విస్తృతమైన శ్రేణి వైవిధ్యాన్ని చూపవచ్చు. ఇలాంటి అపసరణ వర్ణపటలం (డైవర్జెన్స్ స్పెక్ట్రమ్) భాషలను నేర్చుకోవడం, నేర్పడంలో దేనిపై దృష్టి పెట్టాలో సులభంగా వెల్లడిస్తుంది.

**అనువాద వ్యవస్థల నిర్మాణం:** భాషలలో సమానత్వం: సైద్ధాంతికంగా, అన్ని భాషలూ సమానమైనవే. కొన్ని సంక్లిష్టమైనవీ, మరికొన్ని సాధారణమైనవీ కాదు. ప్రసారసామర్థ్యంలోనూ సమానంగా శక్తివంతమైనవే. ఏ భాషలోనైనా ఎలాంటి సమాచారాన్నైనా అందించేందుకు అవి సర్వదా సన్నద్ధమైనవే వాటిని ఉపయోగించాలనుకుంటున్నంత మేరకూ అవి ఎదుగుతూనే ఉంటాయి. వాటికివాడుకే బలం. అన్ని రకాల వాడుకలకూ అవి అనువైనవే అయినప్పటికీ, భాషలలోని ఈ సౌలభ్యం అంటే వాటి సంక్లిష్టత, సౌష్టవం, సామర్థ్యం మొదలైనవాటి పరిధిని స్థానిక వ్యవహర్తలూ లేక వాటిని వాడేవారి చేతలలో స్వయంనిర్ణయాధికారంలో ఉంటుంది.

సహజ భాషా స్వభావం: భాషలకుస్థిరమైన నిఘంటువులు అంటూ ఏవీ ఉండవు. పైపెచ్చు అవి అనంతం కావచ్చు. భాషలకు స్థిరమైన నిర్మాణం లేదు.ఇక పదజాలానికి స్థిరమైన అర్థాలూఉండవు. భాషలలోని నియమాలూ, సూత్రాలూ తరచుగా అపవాద, నిషేధ, బాధకాల మినహాయింపులతో నడపబడతాయి.విధివిధానాలు అనిశ్చితంగా ఉంటాయి.అయినప్పటికీ వాటి విస్తృతి అనూహ్యం. భాషలలో సమాచార వివరణ దాని ప్రసార పరిధి సంభాషణకర్తలపై ఆధారపడి ఉంటుంది. పదాలూ, వాక్యాల నిర్మాణ ప్రక్రియలు అత్యంత వ్యక్తిగతమైనవి. ఇక వాక్యాలలోని పదాల అర్థాలను వాటి వ్యవహర్తా రచయితేగాక వినేవారూ మరియు చదివేవారూ కూడా నిర్ణయిస్తారు. అయినప్పటికీ, ఆయా భాషాసమూహాలలోని సభ్యులు ఒకరినొకరితో మాట్లాడుకోవడంలోనూ అర్థం చేసుకోవడంలోనూ ఎలాంటి అడ్డంకులూ ఉండవు.

**మానవ భాషల సంగణక వర్ణనకు ప్రేరణ:** పాలన, ప్రజాస్వామ్యం అయినప్పుడు మాతృభాషలేవాడుకలో ఉంటాయి. అమ్మనుడుల వాడుకే ప్రజాస్వామ్యం ఉందనేదానికి ధృవపత్రం. ప్రజాస్వామ్యంలో తమది కాని భాషను నేర్చుకోమని బలవంతంగా రుద్దడం కుదరదు. విద్య యొక్క సార్వత్రీకరణం, అంతర్జాల యుగం, సంగణక యంత్రాల (కంప్యూటింగ్) సాంకేతిక శక్తి, కృత్రిమ మేధో ధోరణుల పెరుగుదలతో ఒక వ్యక్తి తాను ఎంచుకున్న భాషలో మాట్లాడటానికీ రాయడానికీ వీలు కల్పిస్తాయి.పైపెచ్చు, వినేవారూ చదివేవారలలో అతని లేదా ఆమె ఇష్టపడే భాషలో వినగలగటం చదవగలగటమూ సాధ్యమవుతోంది.

**భాషా సాంకేతికతకు ప్రేరణ:** వైశ్విక భాషలూ (గ్లోబల్ లాంగ్వేజెస్), అంతర్జాతీయ భాషలూ, సంధాన భాషలూ, వైజ్ఞానిక భాషలూ, సాంకేతిక భాషలూ, వాణిజ్య భాషలంటూ కొందరు వాడే భాషల గుణవాచకాలు అర్థంలేనివి .అలాంటి పేర్లు భాషల నాణ్యత ఏమాత్రంకారణం కాదు. అవి, ఈ భాషల వ్యవహర్తల సమూహాల ఆర్థికాభివృద్ధి కారణంగా గానీ లేక గతంలో కొన్ని భాషా సమూహాల దూకుడు విధానాలూ, వారు నిర్వహించిన యుద్ధాలూ, నిరూపితమైన ఆధిపత్య వైఖరులూ, వ్యవస్థీకృత దండయాత్రలతో ప్రజలను చంపడం, వారి భూములను ఆక్రమించడం వైరి వర్గాలను లొంగదీసుకోవడం చివరకు ఆయా వర్గాల భాషల వినియోగ రంగాలను ఆక్రమించడం ద్వారా అప్రజాస్వామిక నిరంకుశ భూస్వామ్య వ్యవస్థ విధానాల ద్వారాసంక్రమింపజేసుకున్న బిరుదులే.

పూర్తిగా స్వయంచాలితంగా వెన్వెంటనే ఒక భాష నుంచి మరో భాషకు యంత్రానువాద వ్యవస్థలు(ఆటోమేటిక్ రియల్-టైమ్ స్పీచ్ టు స్పీచ్ మషీన్ ట్రాన్స్‌లేషన్ సిస్టమ్‌లు) వలసవాద మనస్సుల నుండి కొన్ని భాషలు మాత్రమే, ఉత్తమమైన లేదా శాస్త్రీయమైన, భాషలు అనే భావనను దూరం చేస్తాయి. మానవ భాషల సంగణక వ్యాకరణ వర్ణనల ద్వారా భూగోళంపైన ఉన్న ఏ భాషనుంచైనా మరో భాషకు యంత్రానువాద వ్యవస్థల నిర్మాణం సాధ్యమవుతుంది.

**మానవ భాషలకు సంగణక అనుకరణల సాధన (కంప్యూటేషనల్ మోడలింగ్):** సంగణక భాషాశాస్త్ర (కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్) ఆగమనం సహజ భాషా విశ్లేషణలోనూ సంశ్లేషణలోనూ కొత్త పుంతలకు దారితీసింది. ఇప్పటివరకూ, భాషల వ్యాకరణ వర్ణనలు చాలా సంక్లిష్టమైనవిగానూ, ఎంతో సమయం తీసుకునేవిగానూ, ఇంకా ఖర్చుతోకూడుకున్నవిగానూ, ప్రయాసతో కూడినవిగానూ నిరూపించబడినై. వేలాది నియమాల సూత్రీకరణలలోఎదుర్కొంటున్న దుర్బలత్వాన్ని పరిహరిస్తూ సహజ భాషల సంగణకఅనుకరణం (నాచురల్ ల్యాంగ్వేజ్ కాంప్యుటేషనల్ మోడలింగ్) ప్రస్తుత వర్ణనాత్మక వ్యాకరణాలలో ఇది ఒక విప్లవాత్మక ధోరణిగా ముందుకువచ్చింది. ఇది ఎలా సాధ్యమనేది ముందు చర్చిస్తాను.

నేర్చుకొనే తత్త్వం (లెర్నబిలిటీ క్రైటీరియన్) ప్రాణులన్నింటికీ ఉన్న ఉమ్మడి సహజ గుణం. అయితే భాషలను నేర్చుకోగలిగిన సామర్థ్యం ప్రాణులన్నింటికీ లేదు. దీనికి ప్రధాన కారణం భాషా నిర్మాణం అత్యంత సంక్లిష్టమైనదిగా ఉండటమేగాక, జీవ పరిణామంలో మానవులకు మాత్రమే జన్యుపరంగా అబ్బిన లక్షణం. ఈ నేర్చుకొనే తత్త్వం లేనివి కాబట్టే, సంగణక యంత్రాలు ఇప్పటివరకూ సహజ భాషా ప్రక్రియల లక్ష్య సాధనకు దూరంగా ఉన్నాయి. సంగణక యంత్రాలు ఈ అభ్యాస ప్రమాణాన్ని (లెర్నబిలిటీ క్రైటీరియన్) అధిగమించడానికి యాంత్రిక అభ్యాస మర్మాల(మెషిన్ లెర్నింగ్ టెక్నిక్స్) ఆవిష్కరణతో భాషా సాంకేతిక భావన విప్లవాత్మక మార్పులకు గురైంది. దీనికి ఆధారం పిల్లలు భాషలను నేర్చే పద్ధతితోబాటు సంగణక యంత్రాలు వాడే నాడీజాలాల ప్రకార్యాల (న్యూరల్ నెట్‌వర్క్ ఆల్గారిదమ్స్) ప్రక్రియలే ప్రధానం.

యాంత్రిక అభ్యాస మర్మాలూ, కృత్రిమబౌద్ధికత (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కలగలిసిన భాషా సాంకేతికతో ప్రధాన లక్ష్యమైన యంత్రానువాదానికి చేరువ అయింది. భాషా సాంకేతికత యాంత్రిక

అభ్యాస మర్మాలూ (మెషిన్ లెర్నింగ్ టెక్నిక్స్), కృత్రిమబౌద్ధికత (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సహాయంతో భాషా సాంకేతికతలో కొనసాగుతున్న ప్రయత్నాలు భాషా అవరోధాన్ని అధిగమించడానికి చాలావరకు మార్గాన్ని సుగమం చేశాయి. అయితే ఇంతకు మునుపు చెప్పుకున్నట్లు నిపిల్లలు భాషలను నేర్చే పద్ధతిలో అంటే తల్లిదండ్రులనుండీ, ఇతర కుటుంబ సభ్యులనుండీ, తన తోటివాళ్లనుండీ పది పన్నెండు ఏండ్లుగా వింటున్న, విన్న సంభాషణలన్నింటిద్వారా సంగ్రహించిన భాషానిధి (కార్పస్) ఆధారంగా చేసిన విశ్లేషణే వాళ్ల మెదళ్లలో అంతర్గతంగామనో వ్యాకరణ నిర్మాణం జరుగుతుంది. అంటే, సూత్రప్రాయమైన వ్యాకరణాలకు ఉన్న పరిధులను దాటి లక్షలూ కోట్లాది పుటల నిడివిగల భాషానిధుల విశ్లేషణల నుండీ యాంత్రిక అభ్యాస మర్మాలూ, కృత్రిమబౌద్ధికతల ఆధారంగాభాషను వ్యాకరించటంతో సంగణక భాషాశాస్త్రమూ దానిద్వారా నిర్మితమైన ఉపకరణాలూ, గుణాత్మకమైన యంత్రానువాద వ్యవస్థల నిర్మాణాలు ఈ దశాబ్దాంతానికి అందరికీ అందుబాటులోకి రావచ్చు.

ఒక కృత్రిమ నాడీ జాలాల ప్రక్రియ (ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్) అనేది ఒక రకమైన యాంత్రిక అభ్యాస ప్రకార్యం (మెషీన్ లెర్నింగ్ అల్గోరిథం). ఇది మానవ మెదడులోని నాడుల నిర్మాణం దాని పనితీరు ఆధారంగా రూపొందించబడింది. ఇది అంతర్లీనంగా అనుసంధించిన అనేక ప్రకార్యాల నాడులతో (ప్రాసెసింగ్ నోడ్‌లతో) రూపొందించబడిన సంగణన ప్రయోగం.ఇది పలు పొరలు పొరలుగా నిర్వహించబడుతుంది.

చిత్రాలనూ సంభాషణలనూ గుర్తించటంలోనూ (స్పీచ్ రికగ్నిషన్), సహజ భాషా ప్రక్రియల (నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్) ఇంకామందస్తు సూచనలతో (ప్రిడిక్షన్ టాస్క్‌లతో) సహా అనేక రకాల ప్రయోగాల (అప్లికేషన్‌ల) కోసం కృత్రిమ నాడీ జాలాల ప్రక్రియలు ఉపయోగపడతాయి. ఇవి పెద్ద మొత్తంలో భాషానిధి నుండినేర్చుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. సాంప్రదాయ పద్ధతులను ఉపయోగించి ప్రకార్యాలు (ప్రోగ్రామ్) చేయడం కష్టంగా ఉండే క్లిష్టమైన పనులకు వీటిని వాడుకొనేందుకు వీలుగలిగిస్తుంది. కృత్రిమ నాడీ జాలాల ప్రక్రియలు లోతైన అభ్యాస (డీప్ లర్నింగ్) అవసరాల కోసం కూడా ఉపయోగించబడతాయి. ఇది యాంత్రిక అభ్యాసంలో (మెషిన్ లెర్నింగ్)ఒక ఉపవిభాగం. ఇది పెద్ద సమాచార నిధులలోని (డేటాసెట్) నమూనాలను గుర్తించడానికి బహుళ పొరల నాడీ జాలాలకు (మల్టీ లేయర్‌డ్ న్యూరల్ నెట్‌వర్క్) శిక్షణనిస్తుంది.

సాంప్రదాయకంగా వివిధ వ్యాకరణ విభాగాలను (మాడ్యూళ్లను) విశ్లేషించి సంశ్లేషించే పలు భాషా ప్రక్రియల సాధనాలైన పదవిశ్లేషిణి (మోర్ఫోలాజికల్ ఎనలైజర్), భాషాభాగ నిర్ణాయకం (పార్ట్స్ ఆఫ్ స్పీచ్ ట్యాగర్), వాక్యవిశ్లేషిణి(పార్సర్),అర్థసందిగ్ధతనివారణ (వర్డ్‌సెన్స్ డిసాంబిగ్యుఏషన్), పదజనకం (మోర్ఫోలాజికల్ జనరేటర్) మొదలైనవి ప్రధానంగా సంగణక యంత్రాల ద్వారా మానవ భాషా ప్రక్రియలను అనుకరించడం ప్రారంభించాయి. కానీ ఇవన్నీ సూత్ర ఆధారితాలో లేక సాంఖ్యిక పద్ధతులద్వారా నిర్మాణమైనవో అయివుండటంచేత భాషా విశ్లేషణలోనో సంశ్లేషణలోనో విఫలం కావడం సాధారణం. అయితే, పైన పేర్కొన్న యాంత్రిక అభ్యాస మర్మాలూ, కృత్రిమబౌద్ధికత అనుసంధానించిన లక్షలూ కోట్లాది పుటల నిడివిగల భాషానిధుల విశ్లేషణల ద్వారా భాషలోని అత్యంత సూక్ష్మ వ్యాప్తిగల సూత్రాలనూ నియమాలనూ సందర్భోచితంగా విశ్లేషించగల సామర్థ్యం వాటి సొంతం కావడంతో సంగణక భాషాశాస్త్ర పరిధిలో భాషాతంత్ర ఆధారంగా వివిధ భాషోపకరణాల నిర్మాణం సుసాధ్యమవుతోంది. ఇది భాషాశాస్త్రంలో మరో సరికొత్త విప్లవానికి తెరతీస్తోంది.

ప్రస్తుత ప్రపంచం జ్ఞానాధారిత ప్రపంచం, సకల రంగాలూ జ్ఞాన నియంత్రణే ప్రధాన వ్యాపకంగా పనిచేస్తున్నాయి. వివిధ ఆర్థిక రంగాలలోనూ, వాణిజ్య వ్యాపారాలలోనూ, రాజకీయ అధికార సాధనలోనూ ప్రాథమిక రంగాలైన వ్యవసాయం, ఆహారోత్పత్తి రంగాలలోనూ, వివిధ పారిశ్రామిక రంగాలలోనూ, విద్యా, వైజ్ఞానిక వినోద రంగాలలోనూ ఈనాడు జ్ఞాన నియంత్రణే ఆధారంగా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాయి. ఈ జ్ఞాన నియంత్రణకు మూలం బృహద్ భాషానిధులే (లార్జ్ ల్యాంగ్వేజ్ కార్పోరా). ఈ బృహత్ భాషా నిధులను సంగణక యంత్రాలతో శ్రేణియుత అభ్యాసాలతో (డీప్-లెర్నింగ్ మోడల్) ప్రతి భాషాంశాన్ని (పదం,వాక్యం, అర్థం మొదలైనవి) వాటి వాటి సందర్భానుసారంగా వ్యాప్తిని గుర్తించి ఒక స్మృతి నమూనాను తయారుచేస్తే, ఇలాంటి బృహద్ భాషానుకరణలు మానవ భాషలపై పని చేయడానికి శ్రేణియుత అభ్యాస నమూనాల నిర్మాణంలో ఇటీవల ఎంతో పురోగతి సాధించినవి. వీటి ఉపయోగం లేని రంగం అంటూ లేదు. బృహద్ భాషానుకరణలు మానవ తరహాలో పాఠాలను (టెక్స్టను) అర్థం చేసుకోగలగటమేగాక పాఠోత్పత్తి చేయగలవు. ఈ వరుసలో వచ్చినవే ఓపన్‌ఏఐ నుండి జిపిటి-3 మరియు జిపిటి-4,గూగుల్ నుండి పామ్2 మొదలైనవి. ఇవి భాషను అర్థం చేసుకోగలిగి పాఠాన్ని రూపొందించగలవు. అ

## పెరుగుతున్న తెలుగు యూట్యూబ్ ఛానళ్ళ సంఖ్య

యూట్యూబ్‌లో ముఖ్యంగా ఆంగ్లంలో సమాచారం ఉంటుందనుకుంటాం. కానీ తెలుగులో అత్యధిక వృద్ధి రేటుతో తెలుగు సమాచారం వచ్చి చేరుతోందట. ముఖ్యంగా వినోద సంబంధ వీడియోలు, పలు అంశాలపై అవగాహన కలిగించే వీడియోలు తెలుగులో ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. దేశంలో అత్యధికంగా సమాచారం తెలుగు భాష నుంచి అందుతోందని, అదే స్థాయిలో తెలుగు వీడియోలు ఇంగ్లిష్ తరువాత అత్యధిక వీక్షణలు కలిగి ఉన్నవని తెలుస్తోంది.

## యూట్యూబ్‌లో పాత తెలుగు సినిమా పాటలు

జూన్ 21న ప్రపంచ సంగీత దినోత్సవాచరణలో భాగంగా విశాఖపట్నంలో యూట్యూబ్ లో తెలుగు పాత సినిమా పాటలు పాడే యూట్యూబ్ చానల్ నిర్వాహకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలుగు భాషా పరిరక్షణకు, పాత సినిమా పాటలు కూడా దోహదం చేస్తాయని. పదే పదే పాత పాటలు వింటూ తెలుగును మర్చిపోకుండా కొనసాగించే అవకాశముందని నిర్వాహకులు అన్నారు.

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

# భాషా పరిరక్షణ ఎందుకు?

మానవజీవితంలోని ప్రతి సందర్భాన్ని భాష ప్రభావితం చేస్తుంది. దినచర్యలో భాగంగా జరిపే సంభాషణల నుంచి లోతైన క్లిష్టమైన మానవ అనుభవాలను వ్యక్తీకరించేందుకు భాష కావాలి.

భాష వ్యక్తికి అస్తిత్వాన్ని ఇస్తుంది. తను అనుభవించే భావాలను ఎదుటివారితో పంచుకునే సాధనంగా పని చేస్తుంది. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గమనించి, అర్థం చేసుకునే శక్తిని ఇస్తుంది.

ఒక ప్రాంతంలో వికసితమైన భాష ఆ ప్రాంతపు ప్రత్యేకతలను, ప్రకృతిని, సంస్కృతిని, వాతావరణాన్ని తనలో నింపుకుంటుంది. ఆ ప్రాంతానిది కాని పరాయి భాషలో బహుశా ఆ ప్రాంతపు సంస్కృతి-ప్రకృతి-వాతావరణం తెలిపే పదాలు కానీ, ఆ ప్రాంతపు ప్రజలు ఎదుర్కొనే అనుభవాలను ప్రతిబింబించే పదాలు కానీ ఉండకపోవచ్చు. అంటే ఒక ప్రాంతపు విజ్ఞానాన్ని మనం పదిల పరుచుకోవాలంటే ఆ ప్రాంత భాషను రక్షించుకోవటం ముఖ్యమైన పని, అన్నిటికన్నా ముందు చేయాల్సిన పని.

భాష పరిరక్షణ ద్వారా భాష మనుగడ పదిలమవడమే కాదు, ఈ కింద చెప్పిన విషయాలు కూడా అధిక శ్రమ లేకుండా అయిపోతాయి:

1. కదు పేదరికం, ఆకలి సమస్యలు పరిష్కృతమవుతాయి.
2. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి చిన్నారికీ ప్రాథమిక విద్య అందించవచ్చు.
3. స్త్రీ-పురుష అసమానతను అధిగమించి, మహిళా సాధికారత సాధించవచ్చు.
4. శిశు మరణాలను తగ్గించవచ్చు.
5. బాలింతల ఆరోగ్యం మెరుగవుతుంది.
6. హెచ్ఐవి/ఎయిడ్స్, మలేరియా మరియు ఇతర మహమ్మారి రోగాల నుంచి రక్షణ.
7. పర్యావరణ సమతుల్యతను మెరుగుపరచవచ్చు.
8. అభివృద్ధికి కావాల్సిన ప్రపంచస్థాయి భాగస్వామ్యాల పరికల్పన

ప్రస్తుత ప్రపంచం సమాచారమే ఇంధనంగా నడుస్తోంది. సమాచారం ఏ ఏ భాషల్లో పుష్కలంగా ఉందో ఆ భాషల సముదాయాలు సహజంగానే అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్నాయి. అభివృద్ధి అంటే కేవలం సంపన్నంగా ఉండటమే కాదు. విద్య, వైద్యం, తిండి, బట్ట, పని, పాటు, సంస్కృతి, మానవవనరులు, సృజనాత్మకత, వ్యక్తిత్వం, కుటుంబవ్యవస్థ, భాష, ఉదారత, సామాజిక భద్రత, పర్యావరణం, కలుపుగోలుతనం, న్యాయం - ఇలా అన్ని అంశాలలో పరిపుష్టంగా ఉండాలి. సమాచారం ఆయా భాషల్లో అందుబాటులో ఉంటే, ఆ భాషను మాట్లాడే సముదాయాలకు పైన చెప్పుకున్న అంశాలలో తమని తాము ఎలా అభివృద్ధి చేసుకోవాలో తెలుస్తుంది. ఆ విధంగా మనుగడను మెరుగుచేసే/మార్చివేసే అంశాలకు సంబంధించిన సమాచారం అంటే ఉదాహరణకు వ్యవసాయం మెరుగు పరిచే సాధనాలు, ఎరువులు, పనిముట్లు మొదలగు అంశాలున్న సమాచారం ఏదైనా, వెనుకబడిన సముదాయానికి వారి భాషలో అందిస్తే వారు వ్యవసాయ రాబడిని మెరుగు చేసుకొని పేదరికం నుంచి ఆకలి నుంచి బయటపడగలరు. ఏ ఆహారం తీసుకుంటే సమతుల్యంగా పోషకాలు అందుతాయో, అందుకు కావాల్సిన ధాన్యాన్ని ఎలా పండించాలి అన్నది సూటిగా ఆ సముదాయాలకు అందించగలం. ఆదాయాన్ని ఏ విధంగా వినియోగిస్తే పేదరికం నుండి బయటపడవచ్చో, ఆ విషయాలన్నీ మనం ఆ భాషా సముదాయాలకు వారి భాషలో అందిస్తే కదు పేదరికం, ఆకలి సమస్యలను పెద్ద శ్రమ లేకుండా నివారించవచ్చు. అందుకని ప్రపంచంలోని ప్రతి భాషలో ఆకలిని/బీదరికాన్ని నిర్మూలించటానికి అవసరమైన సమాచారాన్ని అందించాలి.

**పెద్ద భాషలకు విద్య పరిమితమవటం వలన, చిన్న భాషలలో, గిరిజనుల భాషలలో విద్యా వనరుల లేమి వలన ప్రపంచవ్యాప్తంగా ప్రతి చిన్నారి ప్రాథమిక విద్యలో నమోదు కావాలని పెట్టుకున్న లక్ష్యం సాధించలేకపోతున్నాం. పిల్లలకు వారి వారి మాతృభాషల్లో విద్యను తొలినాళ్ళలో అందిస్తే అది వారికి గట్టి పునాదై, భవిష్యత్తులో వారు పెద్ద భాషల్లో చదువుకోవాలనుకున్నా సరే, అది సాధ్యమయ్యేలా చేస్తుంది. చదువుకున్న సముదాయాలు చదువుకోని సముదాయాలకన్నా బయటి ప్రపంచంతో కలవడంలో మెరుగ్గా ఉంటాయి. అందుకని చిన్న భాషలను పరిరక్షించి ఆ భాషల్లో విద్యా వనరులు రూపొందించాలి.**

అమెరికా యూరప్ లాంటి అత్యధిక అభివృద్ధి చెందినవని చెప్పుకునే దేశాల నుండి బాగా వెనుకబడిన ఆఫ్రికా దేశాల వరకూ ఉన్న ఒక సారూప్యత ఏంటంటే మహిళల పట్ల వివక్ష. పురుషులకు సమానంగా మహిళలకు అవకాశాలు లేకపోవడం, ఒకే పనికి పురుషులకు ఎక్కువ జీతం, మహిళలకు తక్కువ జీతం. ఈ వివక్ష చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని సమాజాల్లో కనిపిస్తుంది. ఇలా ప్రపంచ జనాభాలో సగం వివక్షకు గురై అభివృద్ధి ఫలాలను అందిపుచ్చుకోలేకపోతోంది. ఒక స్త్రీ చదువుకుంటే, తన కుటుంబాన్నంతటినీ చక్కపెట్టుకోగలదు. ఇలాంటి మెరుగైన కుటుంబాలు కలిసి మెరుగైన సమాజాలను, అలాంటి మెరుగైన సమాజాలు అభివృద్ధి చెందిన దేశాలను తయారు చేస్తాయి. అంటే మహిళలు చదువుకుంటే దేశాలు అభివృద్ధి చెందటం సులువు అన్నమాట. మరొక విషయం - ఇన్నేళ్ళ సామాజిక పరిస్థితుల వలన అబ్బాయిలు బయట తిరుగుతూ భాషావైవిధ్య అవగాహనతో ఏ భాషలోనైనా సంభాషించే స్థోమతను పొందారు కానీ అమ్మాయిలు ఇంటిపట్టునే ఉండటం వలన వారికి ఇతరత్రా భాషలకన్నా ఇంటి భాష మీద పట్టు ఎక్కువ. వారికి వారి ఇంటిభాషలో చదువులు జరిపిస్తే

వారు చదువులో కొనసాగి పై స్థాయికి వెళ్ళగలరు. అందువలన అన్ని భాషల్లో విద్యా వనరులు తయారు చేయటం వలన మహిళల వెనుకబాటుతనాన్ని నిర్మూలించి మహిళా సాధికారత వైపుకు అడుగులు వేయవచ్చు.

ఆరోగ్యం విషయంలో చాలా సార్లు జరిగేదేంటంటే మందుల సమాచారం, వైద్య సమాచారం ప్రాంతీయ భాషలో లేని కారణంగా చాలా విషయాలు అపార్థాలకు దారి తీసి ప్రాణాల మీదకు తెస్తాయి. ఉదాహరణకు మనం చిన్నప్పుడు చెప్పుకునే Shake Well Before Use" సూచనపై ఉన్న హాస్యకథ. ఔషధం ఉన్న సీసాని బాగా ఊపి కలపడం ద్వారా విడిపడిన ఔషధ పదార్థాలు మళ్ళీ కలిసి ఔషధం గుణం చేస్తుందని అర్థం, కానీ ఆ సూచనను చదివి అపార్థం చేసుకున్న రోగి పక్కనున్న మందు అందించాల్సిన వ్యక్తి ఆ రోగిని కుదిపేస్తాడట. అలా ఆ కుదుపుకు రోగి మందు అందక మరణిస్తాడట. ఈ కథ ద్వారా మనకు తెలిసేదేంటి? – వైద్యపరమైన సూచనలు ఆంగ్లంలో లేదా మనకు తెలియని, కొంచెమే తెలిసిన భాషల్లో ఉంటే అపార్థాలకు దారి తీసి ప్రాణాపాయ స్థితి వైపు పరిస్థితులు మారతాయి. అలా కాకుండా ఉండాలంటే ముఖ్యమైన వైద్య సూచనలు, ఔషధాలకు సంబంధించిన పరిభాష అన్ని ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉండాలి. ముఖ్యంగా ప్రసవమయ్యాక శిశువుకు అందించాల్సిన మందులు, టీకాలు, ఆహారం, వైద్యం వివరాలు బాలింతరాలి మాతృభాషలో ఉంటే శిశుమరణాలను అరికట్టవచ్చు. అలా శిశు మరణాల సంఖ్యను తగ్గించుకుంటూ నిర్లక్ష్యం వలనో, లేదా సమాచార లేమి వలనో పిల్లలు చనిపోకుండా చూడవచ్చు. బాలింతరాలి ఆరోగ్యం కూడా చాలా సున్నితంగా ఉంటుంది. ఏ పరిస్థితుల్లో ఎలాంటి వైద్యం తీసుకోవాలి? ఏ ఆహారం తినాలి, ఏ ఆహారం తినకూడదు? ఏం మందులు వాడాలి? శరీరంలో ఏదైనా విపరీత లక్షణం కనిపిస్తే ఏం చేయాలి? – ఈ సమాచారం బాలింతరాలి భాషలో ఉంటే ఆమె సరైన వైద్యం చేయించుకుని ఆరోగ్యంగా ఉండగలదు. అందుకని వైద్యం, ఔషధులు, మందులు, ఆరోగ్యం సంబంధించిన సమాచారమంతా అన్ని భాషల్లో అందుబాటులోకి తేవాలి.

సమాచారం లేని ప్రాంతాలలోని సముదాయాల్లో హెచ్ఐవి/ ఎయిడ్స్, మలేరియా లాంటి మహమ్మారిల పట్ల పాటించాల్సిన జాగ్రత్తలు అందుబాటులో ఉండవు. అందువలన రోగాలను సంక్రమించుకునే, వ్యాప్తి చేసే పనులకు దూరంగా ఉండాలని ఆ సముదాయ ప్రజలకు తెలియదు. అలా ఆ రోగాలు ఆ సముదాయంలోని వారికి సంక్రమించి వారు ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంది. సమాచారం అందుబాటులో లేని చాలా చోట్ల ఇదే జరుగుతోంది. అందువలన మహమ్మారుల గురించిన సమాచారం, ఆ మహమ్మారుల నివారణకు, వ్యాప్తి తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించిన సమాచారం ప్రాంతీయ భాషల్లో తప్పకుండా తయారు చేసుకోవాలి. అన్ని భాషల్లో ఈ సమాచారం అందించాలి.

పర్యావరణాన్ని కాపాడటం మనకు నేడు అత్యావశ్యకం. చిన్న చిన్న మానవ చర్యలు పర్యావరణాన్ని చాలా పెద్దగా ప్రభావితం చేసి భూమిపై ఉన్న ఉష్ణోగ్రతను మనం తట్టుకోలేని స్థాయికి పెంచేస్తున్నాయి. భూమి ఉపరితల ఉష్ణోగ్రత పెరిగి ధ్రువ ప్రాంతాల మంచు కరిగి తీరప్రాంతాలు మునిగిపోయే ప్రమాదం ఉంది. కాలుష్యం వలన మనం ఇంతకు ముందు వినని రోగాలు మనల్ని పట్టి పీడిస్తున్నాయి. ఇందుకు మనం చేసే రోజువారీ పనుల్లో కొన్ని దోహదం చేస్తున్నాయి, ప్రపంచాన్ని నాశనం చేస్తున్నాయి. గదిని చల్లబరుచుకునేందుకు ఏసీని వాడతాం, అది గది బయట వాతావరణాన్ని వేడి చేస్తుంది. నీటి సీసాలు ప్లాస్టిక్ వి వాడతాం అవి తరువాత చెత్తగా పేరుకుపోయి నదుల ప్రవాహాన్ని, మురుగునీటి ప్రవాహాన్ని ఆపేసి రోగకారక క్రిముల తయారీకి అనుకూలమైన పరిస్థితులను తయారు చేస్తున్నాయి. నగరీకరణకు దూరంగా ఉన్న గ్రామాలలో, అడవుల్లో ఉండే సముదాయాలు కూడా పర్యావరణ కాలుష్యానికి దోహదం చేసే పనులు చాలా చేస్తారు. కోత తరువాత మిగిలిన చేనును కాల్చేయడం ద్వారా శుభ్రం చేసుకోవడం, పోడు వ్యవసాయం కోసం చెట్లను నరికి అడవులను కాల్చడం, ఇలాంటివి. ఇలా చేయకూడదు, ఇలా చేస్తే మన ప్రపంచానికి, మనకు హాని అని మనం ఆయా సముదాయాల భాషల్లో సమాచారం అందిస్తే కాస్తైనా పర్యావరణానికి హాని తలపెట్టే వారి చర్యలను తగ్గించవచ్చు. అందువలన పర్యావరణ పరిరక్షణ సంబంధిత సమాచారం అన్ని భాషల్లో అందుబాటులోకి రావాలి.

మాతృభాషలను పరిరక్షించి, ఆ భాషల్లో వివిధ వనరులను, సమాచారాన్ని సమకూర్చటం ద్వారా భాషలకు పునరుజ్జీవనం ఇచ్చిన వాళ్ళమవుతాం. పునరుజ్జీవిత భాషలు ఆ భాషలను మాట్లాడే సముదాయాలను అభివృద్ధి వైపు, జీవన మెరుగుదల వైపు, నడిపిస్తాయి. అలా తమ జీవిత లక్ష్యాలను ఆయా భాషా సముదాయాలు పెద్దవి చేసుకుంటాయి. తమ జీవిత ప్రమాణాలను మెరుగుపరుచుకునేందుకు భాషా సముదాయాలు తమ ఇరుగు పొరుగు సముదాయాలతో మైత్రిని పెంచుకుని సమాచార లావాదేవీలు జరుపుకుంటాయి. వర్షాభావ పరిస్థితుల్లో భారతదేశంలో వ్యవసాయానికి నోచుకోని ప్రాంతాలు ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల వ్యవసాయ పద్ధతులను అమలు చేసుకుని మంచి పంటలను పండించగలుగుతున్నాయి. కోవిడ్ టీకాను ఆశించిన ఎన్నో ఆఫ్రికా దేశాలు భారతదేశం నుంచి టీకాలు పొందాయి. భారతదేశానికి కావాల్సిన పప్పు దినుసులు, నూనె గింజలు ఆఫ్రికా దేశాల్లో పండి భారతదేశానికి దిగుమతి అవుతున్నాయి. ప్రపంచ భాషలలో సమాచారాన్ని రూపొందించుకొని సముదాయాల మధ్య పరస్పర అవగాహన పెంచుకోవడం ద్వారా ప్రపంచస్థాయి భాగస్వామ్యాలు ఏర్పడి వ్యక్తులకు మంచి చేకూరుతుంది. అందుకని సమాచారం మన అన్ని మానవ భాషల్లో అందుబాటులో ఉండేలా చేసుకుందాం.

**ఈ సమాచారాన్ని ఎలా అన్ని భాషల్లోకి అందుబాటులోకి తేవడం? ప్రపంచవ్యాప్తంగా కొన్ని సంస్థలు సమాచారాన్ని అందరికీ అందుబాటులో ఉంచేలా ఇంటర్నెట్ వేదికగా పని చేస్తున్నాయి. అలాంటి సంస్థల సహకారంతో మనం మన భాషల్లో వనరులు సృష్టించుకోవాలి.** అ

**తెలుగులో సంతకం - ఆత్మగౌరవ సంకేతం**

# తెలుగు భాషోద్యమ సమాఖ్యకు మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం తోడ్పాటు




విజయవాడలో మే 14న తెలుగు భాషోద్యమ సమాఖ్య నిర్వహించిన జనచైతన్య సభ నిర్వాహణలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు శ్రీ సి.మధు పూర్తి సహాయ సహకారాల నందించి, సభలో పాల్గొని ప్రసంగించారు. ఆయన తన ప్రసంగంలో ఇలా అన్నారు:

ఒకే దేశం ఒకే భాష అనే ఒక సిద్ధాంతాన్ని ఇప్పటి కేంద్రప్రభుత్వం చేపట్టింది. ఒకే దేశం ఒకే భాష అనే సిద్ధాంతం మొత్తం మన ప్రాంతీయ భాషల యొక్క , మన రాష్ట్రాల యొక్క హక్కులకి, దేశంలో గుర్తింపు పొందినటువంటి భాషలు అన్నిటి మీద ఒక పెద్ద దాడిని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఒక్క విషయం మాత్రం చెప్పాలి. జాతీయ ఉద్యమం రోజుల్లోనే రాష్ట్రాల్లో ప్రాంతీయ భాషల యొక్క ప్రాధాన్యత పెరిగింది. బ్రిటిష్ వాళ్ళు పోవాలి, దేశానికి స్వతంత్రం రావాలి అనే నినాదం తీసుకున్నప్పుడు 'మాకొద్దీ తెల్లదొరతనం' అన్నప్పుడు ఆ తెల్లదొరలను తరిమేయాలన్నప్పుడు- మాతృభాషలుగా ఎక్కడ ఏ ప్రాంతాల్లో ప్రాంతీయ భాషలు అయితే ఉన్నాయో, బ్రిటిష్ వ్యతిరేకత ప్రాతిపదిక మీద ఉద్యమాలు పోరాటాలు జరిగాయి. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కూడా మాతృభాష యొక్క ప్రాధాన్యతని గుర్తించింది. అప్పుడు విశాలాంధ్రలో ప్రజారాజ్యం కావాలని నినాదం రావడం, ఆ తర్వాత పొట్టి శ్రీరాములు గారి బలిదానం, ఒక దాని తర్వాత ఒకటి వచ్చాయి. రాష్ట్రాల యొక్క హక్కుల విషయం వచ్చినప్పుడు- రాష్ట్రాల్లో భాష అనేటువంటిది ఒక రాష్ట్రం- ఒక సంస్కృతి- ఒక ప్రాంతం ఆ ప్రజల యొక్క పరిపాలన ఇవన్నీ సాగాలన్నట్లయితే మాతృభాష అవసరం ఉంది. ఆంధ్ర తెలంగాణ విడివిడిగా ఉన్నప్పుడు, కర్ణాటకలో కొంత, మహారాష్ట్రలో కొంత తమిళనాడులో కొంత భాగం తెలుగువారు ఉన్నారు. తెలుగు మాట్లాడేవారు అందరూ ఒకే ప్రాంతంగా ఒకే జాతిగా ఒకే రాష్ట్రంగా ఒకే విశాలాంధ్రగా ఏర్పడాలి అని నినదించాం. ఆఖరికి అది దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి దారితీసింది. ఇప్పుడు దీనికి కూడా ప్రమాదం వచ్చింది. ఒకే దేశం- ఒకే భాష నినాదాన్ని ఈరోజు కేంద్రప్రభుత్వం తీసుకుంది. ఇలాంటి నేపథ్యంలో ఈ భాషోద్యమానికి ప్రాంతీయ భాషలో మాతృ భాషలో విద్యాబోధన, తెలుగు భాష యొక్క పరిరక్షణ, తెలుగు భాషలోనే పరిపాలన- ఇలాంటి అంశాలకి చాలా ప్రాధాన్యత ఉన్నది- అని ఆయన అన్నారు. తెలుగువారి భాషా సాంస్కృతిక సమైక్యతకోసం తాము ప్రచార కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన చెప్పారు. ఇందుకోసం కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలను రికార్డు చేశామని ఆయన చెప్పారు. తెలుగు భాష సంస్కృతులను ప్రచారం చేసే కూచిపూడి నృత్యరూపకాల ప్రదర్శన కూడా సభానంతరం ఆయన ఏర్పాటుచేశారు.

అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం నాడు తెలుగు భాషోద్యమ సమాఖ్య- పెద్దలకోసం, కళాశాల విద్యార్థులకోసం నిర్వహించిన కార్యక్రమాలకు తాను హాజరయ్యానని, వారు ప్రచురించిన పుస్తకాలను కూడా చదివానని చెప్పారు. ఆ తర్వాత- తమకు కలిసివచ్చే కొందరు కార్యకర్తలతో, పెద్దలతో సమావేశాన్ని కూడా తాము నిర్వహించామని, దానికి సమాఖ్య గౌరవాధ్యక్షుడు డా. సామల రమేష్‌బాబు కూడా హాజరయ్యారని తెలిపి, వివిధ ప్రాంతాల్లో సమాఖ్య జరిపే కార్యక్రమాలకు తమ మద్దతు ఉంటుందని శ్రీ మధు ఈ సందర్భంగా ప్రకటించారు.

> దేశభాషాభిమానం తోడిదే దేశాభిమానము, ఏ కులమువారైనా, ఏ మతమువారైనా ఏ దర్జావారైనా తెలుగు మాతృభాషగా గలవారందరూ ఒక్క సంఘమువారనిన్నీ, సంఘములోని వారందరూ అభివృద్ధి పొందితేనే కాని, సంఘము అభివృద్ధి పొందదనిన్నీ, ఎవరు వెనుకబడ్డా సంఘమునకు నష్టమే అనిన్నీ ఎవరు త్రికరణశుద్ధిగా భావిస్తారో వారే దేశాభిమానము గలవారని చెప్పవలెను.
>
> – గిడుగు వెంకట రామమూర్తి

# 'తెలుగులోనే పరిపాలన చేసానని ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోతున్నందుకు యన్టీఆర్ బాధపడ్డారు'

## డా. గుంటుపల్లి శ్రీనివాస్ ప్రేరణాత్మక ప్రసంగాలు



విజయవాడలో మే 14న, నెల్లూరులో మే 29న జరిగిన ప్రజాచైతన్య సభల్లో డా.గుంటుపల్లి శ్రీనివాస్ ప్రసంగాలు: తెలుగుమాధ్యమం, పరిపాలనలో తెలుగు అమలు విషయాలపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఈయన పోరాడుతున్న సంగతి ప్రజలకు తెలిసిందే.ఆయన ప్రసంగాల సారాంశం ఇది:

నేను 2015వ సం.నుండి ప్రధానంగా పాఠశాల విద్యారంగంలో సంస్కరణల కోసం పనిచేస్తున్నాను. అందులో భాగంగానే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో జరుగుతున్న వ్యవస్థీకృత మాస్ కాపీయింగ్ పైన పోరాటం, తదుపరి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్బంధ ఇంగ్లీషు మీడియంపైనా న్యాయపోరాటం. ఆ పోరాట సమయంలో వివిధ వర్గాల ప్రజలతో, తల్లిదండ్రులతో మాట్లాడాను. **మనరాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని తల్లిదండ్రులకు తెలుగంటే చిన్నచూపులేదని, అభిమానం ఉన్నదని తెలుసుకున్నాను. అయితే వారి చుట్టుప్రక్కల ఎటుచూసినా ఇంగ్లీషు మాత్రమే కనబడటం, ఉద్యోగ అవకాశాలు దానితో ముడిపడి ఉన్నాయి అన్న భావన వారిని ఇంగ్లీషు మీడియం వైపు నడిపించింది.** దుకాణాలలో, సూపర్ బజార్/మాల్స్‌లో పనిచేయడానికి కంప్యూటర్‌లో రసీదు టైపు చేసి ఇవ్వడానికి కూడా ఇంగ్లీషు ఉండాలన్న ఆలోచన వారిని ఎక్కువగా ప్రభావితం చేసింది. కావున బడిలో మాతృభాషా మాధ్యమం కోసం చేస్తున్న పోరాటం విజయవంతం అవ్వాలంటే 'ముందుగా ప్రభుత్వ పరిపాలన తెలుగులో జరగాలని నిర్దేశిస్తున్న అధికారభాషాచట్టం అమలుకోసం ప్రయత్నాలు చేయాలని' ప్రముఖ సోషలిస్టు శ్రీ రావెల సోయమ్మగారు ఇచ్చిన సలహా నన్ను అధికారభాషా చట్టం అమలుకోసం పోరాడే దిశగా నడిపింది. అధికారభాషాచట్టం యొక్క పూర్వాపరాలు గురించి చదవడం ప్రారంభించాను. దీని సాధనకోసం స్వాతంత్ర్య సమరయోధులు కీ.శే వావిలాల గోపాలకృష్ణయ్యగారు పట్టువదలని విక్రమార్కుడిలా పనిచేశారని తెలుసుకున్నాను. ప్రభుత్వ పరిపాలన విధిగా తెలుగులో జరగాలంటే 'ప్రత్యేక చట్టం' యొక్క ఆవశ్యకతను గుర్తించిన ఆయన శాసనసభలో 9 సార్లు ప్రైవేటుబిల్లు ప్రవేశపెట్టారు. 9వసారి ప్రజాభిప్రాయం కోసం గెజిట్‌లో ప్రచురించారు. అప్పుడు పెద్దఎత్తున ప్రజలు తమ అభిప్రాయాన్ని ఉత్తరాల రూపంలోనూ, గ్రామాలలో..పట్టణాలలో నిర్వహించిన సమావేశాలలోనూ, సభలలోనూ పాల్గొనడం ద్వారా వ్యక్తీకరించారు. ప్రజాభిప్రాయానికి తలొగ్గిన అప్పటి రాష్ట్రప్రభుత్వం 1966లో శాసనసభలో అధికారభాషాచట్టం బిల్లును ప్రవేశపెట్టింది. ఆ సమయంలో ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి 'మధ్యాహ్నం రెండు గంటలకల్లా సభ బిల్లుకు ఆమోదం తెలపాలి' అని నిర్దేశించారు. ఇందులో ఒక పాజిటివ్, ఒక నెగిటివ్ ఉన్నాయి. 'పాజిటివ్' ఏమిటంటే ప్రజాభిప్రాయాన్ని గౌరవించిన అప్పటి ముఖ్యమంత్రిగారు బిల్లును ఆఘమేఘాలపైన ఆమోదించాలని నిర్దేశించడం. నెగిటివ్ ఏమిటంటే అఘమేఘాలపైన బిల్లును అమోదిస్తే బిల్లు పూర్వాపరాలపైన, అమలులోని సాధ్యాసాధ్యాలపైనా, కలిగే ఆటంకాలపైనా సరైన చర్చ జరుగదు. నిజానికి దాని పర్యవసానమే 'జలగం వెంగళరావుగారు ముఖ్యమంత్రి అయ్యేవరకు ఆధికార భాషాచట్టం సరిగా అమలుకే నోచుకోకపోవడం.

**అధికారభాషగా తెలుగు అమలుక్రమాన్ని పరిశీలిస్తున్న దశలో నన్ను ఎంతగానో కదిలించినది 1988లో తిరుపతిలో ఎన్టీఆర్ గారి ఉపన్యాసం: 'నా ప్రజలకు నేను ముఖం చూపించుకోలేకపోతున్నాను. తెలుగులోనే పరిపాలన చేస్తామని వారికి మాట ఇచ్చాను. ముఖ్యమంత్రిగా ప్రజలకిచ్చిన మాటను నెరవేర్చలేకపోతున్నాను' అని ముఖ్యమంత్రి స్థానంలో వున్న ప్రజానాయకుడు నిజాయితీతో, భావోద్వేగంతో చెప్పిన మాటలు తెలుగు భాష యెడల ఆయనకున్న మక్కువను, ప్రజల భాషలో పరిపాలన సాగాలన్న మౌలిక ప్రజాస్వామ్య సూత్రం యెడల ఆయనకున్న నిబద్ధతను తెలియపరుస్తుంది.**

తదుపరి నన్ను నేను వేసుకున్న ప్రశ్న 'ఇతర రాష్ట్రాలలో అధికార భాషాచట్టం అమలవుతూ, తెలుగు రాష్ట్రాలలో మాత్రం అమలవ్వకపోవడానికి ఏవైనా సంస్థాగత లోపాలు ఉన్నాయా? ' అని ఈ విషయంపై సునిశిత పరిశీలన చేయడానికి అధికారభాషాచట్టం పటిష్టంగా అమలవుతున్న '8' ఇతర రాష్ట్రాలలోని సంస్థాగత విషయాలను, తెలుగు రాష్ట్రాలలోని వాటితో పోల్చి చూశాను. వాస్తవానికి ఇతర రాష్ట్రాలలో మాదిరిగా తెలుగు రాష్ట్రాలలో కూడా అధికారభాషాచట్టం అమలుకు కావాల్సిన ప్రతీ సంస్థాగత నిర్మాణం ఉంది. అధికారభాషాచట్టం రూపుదాల్చకముందే పరిపాలన కోసం కావాల్సిన పదకోశాన్ని తయారుచేయడంలో స్వాతంత్ర్యసమరయోధుడు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు, మాజీ ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావుగారు ఎనలేని కృషి చేశారు.

స్వాతంత్ర్య సమరయోధులు 'గురువులకే గురువు' అయిన

**మిగతా 31వ పుటలో**

ప్రజా చైతన్య సభ

# కోట్లాది ప్రజల భాష తెలుగుకోసం మనం ఉద్యమించాలి

తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆధ్వర్యంలో మే 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సభలో ముఖ్యఅతిది, తెలంగాణ రాష్ట్ర పూర్వ తెలుగు సాహిత్యఅకాడమీ అధ్యక్షులు, కవి, శ్రీ నందిని సిధారెడ్డి స్ఫూర్తిదాయక ప్రసంగం



ప్రసంగిస్తున్న
నందిని సిధారెడ్డి గారు

ఈరోజు ఇద్దరు మహనీయులు సురవరం ప్రతాపరెడ్డిగారు, ఎన్టీ రామారావు గార్లకు సంబంధించిన జయంతులను పురస్కరించుకొని ప్రజాచైతన్య సభ నిర్వహిస్తున్నందుకు తెలుగు భాషోద్యమ సమాఖ్యను అభినందిస్తున్నా. ఆ ఇద్దరిని గురించి సభాధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు గారు చెప్పారు.

**ఆ మహనీయుల ఇద్దరి స్ఫూర్తి అని పదే పదే ఎందుకు అనుకోవలసి వస్తుందంటే ఆ స్ఫూర్తి ఏదో కోల్పోతున్నాం గనుక. ఒకరు సాహిత్యరంగానికి చెందితే ఒకరు కళారంగానికి చెందినవారు. ఇద్దరిలో తెలుగు భాషాభిమానంతోపాటు ఇద్దరిలో రాజకీయ చైతన్యం వుంది. ఆశ్చర్యంగా ఇద్దరూ రాజకీయాల్లో పొసగలేకపోయారు. విచిత్రంగా కనబడుతుంది. నిజంగా, నిజాయితీపరులెవ్వరూ రాజకీయాల్లో నిలవలేరంటానికి వారిద్దరు ఉదాహరణ.**

సురవరం ప్రతాపరెడ్డిగారు 1952, 1956లోనే రాజకీయాలు ఏమీ ఒరగబెట్టవని తేల్చుకున్నారు. ఎన్టీరామారావుగారు 1983లో ఒక పెద్ద ప్రభంజనాన్ని సృష్టించి, తెలుగు భాషను తెలుగు సంస్కృతిని ఢిల్లీదాక వ్యాపింపజేసి ఢిల్లీలో తెలుగువాళ్ల ప్రభావాన్ని కలిగించిన శక్తి.

ఎన్టీరామారావుగారు ఊరూరా కదిలించి అంతటి చైతన్యాన్ని తీసుకొచ్చి 'చెయ్యెత్తిజైకొట్టు తెలుగోడా' అనే పాటతో వ్యాను మీద తిరిగిన వ్యక్తి కూడా ఒకఐదేళ్ళు పరిపాలించిన అనుభవం ఉన్నా, సంవత్సరం మొదటి నాటికి అనేక కారణాలవల్ల అధికారం నుండి దిగిపోవలసివచ్చింది. రాజకీయ అనుభవం లేకపోవడం వల్ల, సరే జరిగిన చరిత్ర అంతా అవగాహనారాహిత్యం వల్ల అనుకొండి. మరొకప్పుడు కూడా మళ్ళీ దిగిపోవలసి వచ్చింది.

చాలా ఆశ్చర్యం ఏమంటే ఎవరు దించారో వాళ్ళే ఎన్టీరామారావు పేరు వాడుకుని మళ్ళీ అధికారంలోకి రావాలని చూస్తున్నారు. చరిత్రలో ఉన్నదే నా అభిప్రాయం కూడా. అంటే భావోద్వేగం ఉన్నవాళ్ళు రాజకీయ ఉద్విగ్నత, నిజాయితీ ఉన్నవాళ్ళు పనిచేయలేరనడానికి వాళ్ళిద్దరు ఒక ఉదాహరణ. ఇద్దరిలో భావోద్వేగం ఎక్కువ. ప్రతాపరెడ్డిగారు కూడా అంతే. భావోద్వేగమే ఆయనలో వున్నది. ఏ విషయాలలో కూడా. బాగా గమనించితే వ్యక్తిత్వంలో భావోద్వేగం ఎక్కువ, తెలుగుభాష కోసం తెలంగాణను చైతన్యవంతం చేయడానికి పూనుకొని గోలకొండ పత్రికకు సంపాదకులుగా వ్యవహరించారు.

**తప్పకుండా తెలుగుకు మంచి భవిష్యత్తు ఉన్నది. ఉంటది.**
**ఎందుకంటే ఇది రాజుల భాషకాదు. ఇది ప్రజల భాష.**
**ఎప్పుడైనా ప్రజలు భాషను రక్షించుకొని తీరతారు.**
**భాష రక్షింపబడుతుంది. తెలుగుకు చావులేదు.**
**తెలుగుకు చావులేదు.**

రెడ్డి హాస్టల్లో ఒక లైబ్రరీ నడుపుతూవుంటే అందులో లైబ్రరీలో ఉద్యమకారుల్ని తయారుచేస్తున్నారు అని, మొత్తం లైబ్రరీ అంతా వెతికితే అక్కడ ఉద్యమకారులు లేరని తేల్చారు. ఆశ్చర్యమేమంటే- ఆయన అనుభవం అది-పుస్తకాలే. పెద్ద ఆయుధాలని వాళ్ళు గుర్తించని ఆయుధాలు పుస్తకాలే ఉద్యమకారుల్ని తయారుచేస్తవని వాళ్ళకు తెలియకపోవడం అని.

ఈ ఇద్దరు మహనీయులనుండి మనం నేర్చుకోవలసింది తెలుసుకోవలసింది-ఏమిటంటే-మనం తెలుగు భాషను ఇప్పుడున్న స్థితినుండి కాపాడుకోవాలంటే భాషోద్యమ సమాఖ్య తరపున రెండు అడుగులు అయినా వేయాలని పురోగమిస్తున్న సంకల్పం- రమేష్‌బాబు కావచ్చును, ఉమామహేశ్వరరావు కావచ్చును. సమాఖ్యలో వున్నటువంటి బాధ్యులు అందరూ కలసి తీసుకున్న సంకల్పం ఏంటంటే- ఏడాదిపాటుగా ఈ రెండు తెలుగురాష్ట్రాల్లో చైతన్యం తీసుకురావడానికి విస్తారంగా ప్రతిపట్టణం సందర్శించాల్సిన అవసరం ఉందని వారు గుర్తించారు.

ఈ ఇద్దరినుండి నేర్చుకొనేదేమంటే రాజకీయాలతో సంబంధం లేకుండానే ఉద్యమాలు నడుస్తాయి. ఎప్పుడైనా రాజకీయాలే ఉద్యమాలను నడుపుతాయని మనం అనుకుంటాం. తెలంగాణ ఉద్యమం అంతే . మరే ఉద్యమం అయినా అంతే.

వాస్తవంగా ఉద్యమాలు ఆనాటి వాస్తవిక పరిస్థితుల్ని, వాతావరణాన్ని బట్టి పుడతాయి. పుట్టిననాటినుండి వాటిని రాజకీయాలు తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నం చేస్తాయి. ఇక్కడ మనం ప్రజల్ని చైతన్యం చేయవలసిన అవసరం ఉంది.

**అధికార భాషాచట్టాన్ని ప్రవేశపెట్టింది శ్రీ పి.వి.నర్సింహారావుగారు. ఆయన మరొక రాజకీయవేత్త. ఆయనకుతెలుగు భాషాభిమానం చాలా ఉంది. ఒకవైపు తెలుగు అకాడమీ ఒకవైపు తెలుగు మాధ్యమంలో పాఠశాలలు, కళాశాలలు స్థాపించిన ప్రత్యేకత ఆయనకు ఉంది .వీటిని నిలుపుకోవల్సిన అవసరం**

**ఎంతో వుంది.**

ఏ రాజకీయ ప్రభావంతో అయితే ఈ వ్యవస్థలన్నీ ఏర్పడి ఉన్నాయో, ఆదే రాజకీయ ప్రభావంతో ప్రతికూలంగా ఆ వ్యవస్థల్ని కూలదోయడానికి ప్రయత్నిస్తున్నారు. అధికారభాషా సంఘం నామమాత్రమే అయింది. నాగురించి నేను ప్రత్యేకంగా చెప్తున్నాను అని అనుకోకబోతే- తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.సి.ఆర్.గారు నువ్వు మాతో ఉండడం లేదు. నీకు ఒక పని చెబుదామనుకుంటున్నా. అదేమంటే అధికార భాషా సంఘం బాధ్యతలు అంటే-ఛైర్మన్ బాధ్యతలు తీసుకుంటే బాగుణ్ను అనుకుంటున్నా అన్నారు. అప్పుడు నేను అన్నాను. నారాయణరెడ్డి అధికార భాషా సంఘం బాధ్యతలు తీసుకున్న దశ నాకు తెలుసు. వావిలాల గోపాలకృష్ణయ్యగారి దగ్గరినుంచి, వందేమాతరం రామచంద్రరావుగారి దగ్గరనుంచి, నారాయణరెడ్డిగారి వరకు చాలా మందిని నేను పరిశీలించా. నారాయణరెడ్డిగారి దగ్గర వుండే శిష్యత్వం వల్ల దగ్గరగా పరిశీలించే అవకాశం వుంది. ఇవన్నీ చూశాకకూడా అనుకున్నదేమంటే **చట్టం ఉన్నాకూడా-అదొక సానుకూల అంశమే అయినా, ఈ చట్టాన్ని గౌరవించలేని పాలకులు ఉంటే- అది ఏ మాత్రం ముందుకు పోదని నాకు అర్థం అయింది. అప్పుడు చెప్పాను** అధికారభాషా సంఘం నామమాత్రమయిపోయింది. అధికారాలు లేని భాషాసంఘంఅది అని. పనిచేసేది ఏమీలేదక్కడ. పనిచేసేది లేనప్పుడు నేను అక్కడ ఉండేది లేదని చెప్పా.

అయితే నాకున్న ఒక చైతన్యాన్నిబట్టి అక్కడ కూర్చోవచ్చు. అయితే అ అధికారుల మధ్యన బ్యూరోక్రాట్స్ మధ్యన- అట్లనే రాజకీయనాయకుల మధ్యన నిజాయితీపరులు సురవరంప్రతాపరెడ్డి ఎన్టీరామారావు లాంటి వాళ్ళు లేదా అలాంటి భావోద్వేగం ఉన్నవాళ్ళు నిలబడలేకపోయినప్పుడు నావంటివాడు నిలబడగలడా అనే సత్యం తెలిసింది.

**నేను ఈ మాటలన్నీ ఎందుకు చెబుతున్నానంటే రాజకీయనాయకులకు పదే పదే అర్జీలు పెట్టుకోవడం వల్ల తెలుగుభాష ఏ మాత్రం పురోగమించదు. ఎప్పుడుకి పురోగమిస్తుంది అంటే ప్రజల్ని చైతన్యవంతం చేయడం ద్వారానే ఈ ఉద్యమం పురోగమిస్తుంది. కాబట్టి ప్రజల్ని చైతన్యవంతం చేయాలని మంచి ఆలోచన వచ్చినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. హృదయపూర్వకంగా తెలుగు భాషోద్యమ సమాఖ్యను అభినందిస్తున్నా.**

తెలంగాణలో ఆంధ్రలో ప్రతి పట్టణంలో భాషాభిమానులు ఒక యాభై మంది దొరుకుతారు. మన పట్టణాలు తిరుగుదాం, చైతన్యవంతం చేద్దాం. లొసుగులు ఎక్కడ వున్నవి అంటే- చట్టం అమలుకాకుండా ఎక్కడ ఉన్నది అంటే బీరువాలో ఉన్నది. పాలకులు పట్టించుకోవాలంటే-వాళ్ళు ఓటుబ్యాంకు లేదా?అద్భుతంగా ఉన్నది కానీ అ అద్భుతంగా ఓటుబ్యాంకును మనం నిర్మించుకొనేటువంటి దిశగా మనం పనిచేయాలి. **అధికారభాషా సంఘం అధ్యక్షుడికి ఒకటిరెండు అర్జీలు ఇస్తాం. ఇవ్వగానే అయిపోతుంది అనుకోవద్దు. చాలాసార్లు వాస్తవం ఏమిటి అంటే- ఈ చిన్న చిన్న వ్యవస్థల్లో అధ్యక్షులుగా వున్నవాళ్ళు రాజకీయనాయకుల దగ్గర ముఖ్యంగా ముఖ్యమంత్రి స్థాయి మంత్రివర్గం దగ్గర కనీసం నోరుతెరిచి మాట్లాడలేని ఒక పరిస్థితి ఉన్నది అంటే ఇది వాస్తవస్థితి. కాబట్టి వాస్తవస్థితినుండి బయటపడాలంటే మనదగ్గర ఉన్న ఒకే ఒక ఆయుధం ప్రజాచైతన్యం, ప్రజలమధ్యకు వెళ్ళడం. ప్రజల మధ్య ఉండి పనిచేయడం అంటే ఒక రాష్ట్రమైనా సఫలమవుతుంది. దానికి తెలంగాణా ఉద్యమమే ఒక ఉదాహరణ.భాషా ఉద్యమం అంతే. మనం ఒక పదిమంది కలిసికట్టుగా పనిచేస్తే దానిక సత్ఫలితాలు వస్తయి. తెలుగుభాషకు తప్పకుండా ఒక మంచిరోజు వస్తుంది. దానికోసం మనం అంకితభావంతో పనిచేయాలి.**

అయితే ఇక్కడ ఉన్న సమస్యలు ఏంటంటే భాషాభిమానుల దగ్గర ఉన్న అనవసరమైన చర్చ ఒకటి ఉంది. ఇందాక ఉమామహేశ్వరరావు గారి దగ్గర చర్చించాను కూడా. వీళ్ళు అనవసరమైన చర్చమీద ఎక్కువకాలయాపన చేస్తున్నారు. ఏ, తెలుగువాడాలి? తెలుగంటే ఏ తెలుగు వాడాలి? తెలుగంటే అచ్చతెలుగు వాడాలి అట్లనే ఇంగ్లీషులేనటువంటి తెలుగు వాడాలి......

ఇటువంటి తెలుగువాడితే మంచిదేకాని, నేను వీటికి వ్యతిరేకం కాదు కాని ఏరకమైనటువంటి చైతన్యం ఇది?!

సంఘం అనే పదం అందరికీ తెలిసిందే. సంఘంకు బదులు మంద వాడాలంటారు. సంఘం అంటే సమూహమే.గొర్రెల మంద, మేకల మంద అన్నా సమూహమే. సంఘం వాడాలా? మంద వాడాలా? అని గంటలు గంటలు చర్చలు చేసి ఏమి సాధిస్తారు? మనం చరిత్ర అధ్యయనం చేస్తే-భాషాశాస్త్రంలో ఏం జరిగిందో తరువాత చెప్పారు. సాహిత్యంలో ఏం జరిగింది అంటే ఏది సౌకర్యంగా ఉందో అది ఆభాషగా నిలబడ్డది. ఏది అసౌకర్యంగా ఉందో అది పోయింది.

అచ్చతెలుగు రామాయణమే రాశారు. అచ్చతెలుగు రామాయణం రాస్తే దాని కంటే రంగనాథ రామాయణం ప్రజల దగ్గరకు వెళ్ళింది. అందులో సంస్కృత పదాలు ఉండవచ్చు.

అచ్చ తెలుగులో యయాతి చరిత్ర వచ్చింది. అది ఎందుకు ప్రాచుర్యం పొందలేదు?

అచ్చతెలుగు అంటే

సంస్కృతం కలిసిన తెలుగా? ఆంగ్లం కలిసిన తెలుగా? ఉర్దూ కలిసిన తెలుగా? అని ఒక చర్చ.

పలకడానికి వ్యవహరించడానికి ఏ భాష సౌకర్యంగా వుంటుందో ఆభాష నిలబడుతుంది. ఆభాషను ప్రజలు యిష్టపడతారు తప్ప సౌకర్యంగా లేని భాషను యిష్టపడరు. పండిత్యాన్ని అసలు యిష్టపడరు.

ఇవాళ మార్కెట్ అనే పదం ఉంది. ఇది అందరూ వాడతారు. ఒకవంక కూరగాయల మార్కెట్ వుంది.సూపర్ మార్కెట్ వుంది.ఇంకో మార్కెట్ వుంది. ఈ మార్కెట్ అనే దానికి తెలుగుపదం కావాలి. కొత్తది పుట్టించాలి. ఇది ఎంత మందికి చెబుతారు.

ఒకనాడు నా చిన్నప్పుడు బట్టల దుకాణం అని రాసేది. బట్టల దుకాణం నుంచి వస్త్రదుకాణం అని వచ్చింది. తరవాత క్లాత్ స్టోర్ వచ్చింది ఇవ్వాళ ఇంకా క్లాత్ షోరూం అని వ్రాస్తున్నారు. ఇలాంటి దశలో ఇంకోటివచ్చినయి. ఆంధ్రా భోజనం తెలుగు భోజనం పోయి ఇవ్వాళ ఫుడ్‌కోర్టులు వచ్చేసినయి. ఈ దశలో మనం అనవసరమైన వాగ్వివాదం పెట్టుకుంటే చదువుకునే విద్యార్థుల్లో కూడా అయోమయం కలుగజేసిన వాళ్ళం అవుతున్నాం. తెలుగు భాష మాట్లాడాలి అనుకునే

వాళ్ళలోకూడా అయోమయం కలుగజేసిన వాళ్ళం అవుతున్నాం. ఈ మందలాంటి మాటలు ఎన్ని మార్చుకోవాలి. ఇక్కడి నుండి మొదలుపెడితే ఈ యాతన ఈ అవసరం అంతా దీనివల్ల వ్యవధి ఖర్చుయిపోవడమే తప్పా- దీనితో మనం ఈ చర్చను ఆపేయాల్సి ఉంటుంది.

ఇంకొకటికూడా జరుగుతుంది. ఏమిటంటే ఇవాళ 56 అక్షరాలు వావాలా?54 అక్షరాలు వాడాలా అనేది చర్చ. చిన్నయసూరి చెప్పినదాని ప్రకారంగా 36 అక్షరాలు. బహుజనపల్లి సీతారామాచార్యులు చెప్పిన దాని ప్రకారంగా 56 అక్షరాలు. ఇప్పుడు 36-56 మధ్యన 20 అక్షరాలు తేడా. ఒక చరిత్రకాలంలో కలిసిపోయినయి. కలిసిపోయిన తర్వాత వాటిని పట్టుకొని 26 అక్షరాలుగా ఇంగ్లీషులాగ కుదించవచ్చనే వాతావరణం ఒక ప్రపోజల్ నడుస్తుంది. అంటే లిపిలో సంస్కరణలు. అ మీద గుడిపెడితే ఒకటి ఇ అవుతుంది. దాని కొమ్ముపెడితే ఉ అవుతుంది. అని ప్రతిపాదనలు తీసుకువచ్చి లేనిపోని చర్చలవల్ల సామాన్యప్రజలు చదువుకోవాలనుకొనే ప్రజలు- దీని జోలికి పోకూడదనే ఒక వాతావరణం ఏర్పడుతుంది. ఇవాళ లిపి సంస్కరణలు కూడా. నేను అనుకుంటున్నా. అక్షరాలు కొన్ని స్థిరపడ్డాయి. ఇవాళ అచ్చుల్లో అక్కరలేదని ఏదైతే వుందో ఋ అనేది వద్దనకుండానే పోయింది. అట్లనే బండి ఱ కూడా (ఱ) పోయింది. పోయేవి ఎట్లాగైనా పోతాయి. ఉండేవి ఉంటాయి (జన వ్యవహారంలో) అది చరిత్ర నిర్మిస్తుంది తప్ప మనం ఏం చేయలేం. ఇది నా అభిప్రాయం లిపి సంస్కరణల గురించి.

ఇవాళ ఏం చర్చ జరగాలంటే- రెండే విషయాలు చెప్పి ముగిస్తాను. ఇంకో విషయం ఏంటి అంటే పదేపదే తెలుగు చైతన్య సభలు చాలా విన్నా. ఈ సభ విన్నా. దౌర్భాగ్యస్థితి ఈ భాష పరిస్థితి బాగులేదు. ఇరవై ఏళ్లకు అంతరించిపోతుంది, అంటే ఎవరు చదువుకుంటారండి కొత్తపిల్లలు. **ఈ భాష ఇదిగో అంతరించిపోతుంది పాయె పాయె అంటే-ఎట్లా చదువుకుంటారండి. చదువుకునే వాళ్లకు ఎలా ఉంటది.**

కాబట్టి న్యూనపరుచుకునే స్థితినుండి బయటపడాలి. ఎందుకు మనం న్యూనపరచుకోవాలి? తెలుగుభాషకు బ్రహ్మాండమైన యోగ్యత ఉన్నది. హిందీ సినిమాలో మనకు దొరకని సంభాషణలన్నీ తెలుగు సినిమాలో మనకు దొరుగుతున్నాయి. ఇప్పుడు ఇవాళ తెలుగులో కొన్ని వేల లక్షల వీడియోలు ఉన్నాయి. రాజకీయాలకు సంబంధించినయి, సాహిత్యానికి సంబంధించినయి,సాంస్కృతిక రంగానికి సంబంధించినయి- ఆటలు కావచ్చు- ఒకపాట పెడితే వేల మంది చూస్తున్నారు. ఈ పాఠ్యాంశాల ద్వారా తెలుగు చదువుకుంటే మీకు భవిష్యత్తు ఉంటదని చెబితే తెలుగు చదువుకుంటారు తప్ప, తెలుగు చదువుకుంటే లాభం లేదని మనమే అంటే, మరి పాలకులు ఏమనుకుంటారు. అది కాదు బిచ్చం ఎత్తుకునే ఆమె తన పిల్లల్ని ఇవ్వాళ ఇంగ్లీషు మీడియంలో చదివిస్తున్నారు తెలుసా. వాళ్ళు ఫీజులు కట్టుకోలేరుకదా. అందుకని నేను ఇంగ్లీషు మీడియం పెట్టాల్సివస్తుందని ఆయన పద్ధతిలో ఆయన (కె.సి.ఆర్) మాట్లాడాడు. మరి ఏం చేయాలి. చదువుకునేవాళ్ళలో చైతన్యం తీసుకురావల్సి వస్తుంది. అదే సమయంలో వాళ్ళ పేరెంట్స్‌లో కూడా చైతన్యం తీసుకురావలసి ఉంది.

తెలుగు చదువుకోవడం ద్వారా ఈ అవకాశాలు ఉన్నాయి అని మనం చెప్పవలసివుంది. ఇంటర్మీడియట్‌కు వచ్చిన తర్వాత తెలుగులో మంచిగ రాసేవాళ్ళు లేకుంటే ఎందుకు రాయలేకపోతున్నారంటే తెలుగు మాధ్యమంలో స్కూళ్ళు లేకపోవడమే. స్కూళ్ళు లేకపోవడానికి ప్రధానమైన కారణం-రాజకీయనాయకులు మాత్రమేకాదు. మనం సరైన చైతన్యం తీసుకురాకపోవడం కూడా ఒక కారణం.

కాబట్టి మనం మనల్ని న్యూనపరచుకోవలసిన అవసరం లేదు. తెలుగు భాషను న్యూనపర్చాల్సిన పనీ లేదు. తెలుగుకు రాబోయే రోజుల్లో ఒక మంచి వైభవం పడుతుంది. ఒక విషయం చెప్పాల్సిన అవసరం ఉంది. ఇవాళ రాజకీయనాయకులు తెలుగులో మాట్లాడతారా? ఇంగ్లీషులో మాట్లాడతారా? ఎన్నికల్లో వాళ్ళు ఒక్క రాజకీయ నాయకుడైనా ఇంగ్లీషులో మాట్లాడతాడా నేను ఛాలెంజి చేస్తున్నాను. ఇంగ్లీషు చదువుకొని, ఇంగ్లీషు మీడియం నుంచి వచ్చిన కొద్దిమంది పార్లమెంటరీ నాయకులు కూడా వచ్చీరాని తెలుగులో ఓట్ల కోసం ఊళ్ళల్లోకొచ్చి తెలుగే మాట్లాడుతున్నారు తప్ప ఒక్కరు కూడా ఇంగ్లీషులో మాట్లాడరు. వాళ్ళు మంచి ఇంగ్లీషు వచ్చి కూడా ఊళ్ళలోకి వెళ్లినప్పుడు సాధారణమైన మనుషులతో ఏమి మాట్లాడుతారు వాళ్ళు తెలుగులోనే మాట్లాడుతారు. ఒక డాక్టర్ ఉన్నారు. ఇంగ్లీషు మీడియంలోనే చదువుకొని వచ్చాడు. వచ్చిన తర్వాత ప్రాక్టీస్ పెట్టాడు. ప్రాక్టీస్ పెట్టాక రోగి వచ్చినపుడు తెలుగులో మాట్లాడితే తప్పా, లేకపోతే పేషంట్లు ఆయన దగ్గరకు పోరు.

**ఇవాళ పాలనలోకి వచ్చిన వాళ్ళుహిందీ భాషలో మాత్రమే మాట్లాడుకుంటున్నారు. సంస్కృతం మాత్రమే భాష అనుకుంటున్నారు. వాళ్ళకు తెలుగు రాదు కాబట్టి తెలుగు భాషే కాదు.మనకు వచ్చింది తెలుగు. ఈ తెలుగును మనం దౌర్భాగ్యం... అంతరించిపోతుంది .... నాశనమైపోతుంది, వాళ్ళేం చేస్తున్నారు. అది ఎలా చేస్తున్నారంటే హిందీని ఎక్కడబడితే అక్కడ వాడుతున్నారు. కేంద్రసాహిత్య అకాడమీలో ఈ మధ్య నేను దగ్గరగా ఉంటున్నా. కవి సమ్మేళనాల్లో 7గురో 10 మందో వచ్చి కూర్చుంటారు. హిందీ కవిత చదివితే అక్కడ ఉన్నవాళ్ళు చప్పట్లు కొడతారు. తెలుగులో కవిత చదివితే ఎవరూ చప్పట్లు కొట్టరు. ఎందుకంటే తెలుగు వాళ్ళు అక్కడ ఉండరు. ఒకవేళ వున్నా చప్పట్లు కొట్టరు. తెలుగువాళ్ళ పరిస్థితి చాలా దయనీయంగా ఉంటది. చప్పట్లు కొట్టమన్నా కొట్టరు. విమర్శలకైనా కొట్టాలి. అలాంటి వాతావరణం తయారుచెయ్యాలి.**

అక్కడ హిందీవాళ్ళంతా వస్తారు. కూర్చుంటారు. అట్లా ఇట్లా అని పోరాడుతుంటారు. వహ్వా అంటారు. ఇంకేదో అంటారు. క్యాబోలే అంటారు. ఈ వాతావరణ కల్పన అనేది చాలా ముఖ్యమే. అయితే హిందీని ఎందుకు ప్రమోట్ చేస్తున్నారంటే - **మొన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక మంత్రి ఒక మాట అన్నారు. హిందీ అనివార్యంగా భారతదేశంలో వున్నవాళ్ళు మాట్లాడవలసిందే. ఒకవేళ హిందీ మాకు రాదంటే ఈ దేశం విడిచిపెట్టి పోవాల్సిందే. అంటే ధైర్యం ఎక్కడ నుంచి వస్తుంది.**

తెలుగువాళ్ళు భారత దేశం అంతటా ప్రపంచంలో విస్తరించి ఉన్నారు గదా. 16 కోట్లా 18 కోట్లా రకరకాలుగా లెక్కలు ఉన్నాయి.

ఈ 18కోట్లు-16 కోట్ల మంది తెలుగును జాతీయ భాష అని శ్రీశ్రీ అంటే దీన్నిబట్టుకొని హిందీ మాట్లాడకపోతే ఈ దేశం విడిచిపెట్టి పొండి అన్నాడు. మనకు చెప్పడానికేమో మతం ఉందని చెప్తారు. మతం ఉందని చెబితే మనం ఓట్లు వేస్తాం. ఇక్కడ భాష సంగతి. అంటే ఏం? తెలుగులో రాముడు ఉండడా? తెలుగులో కృష్ణుడు ఉండడా? తెలుగులో సీత వుండదా? తెలుగులో రామాయణం లేదా? తెలుగులోనే యన్టీఆర్ బోలెడు వేషాలు వేశాడు. తెలుగు మాట్లాడాడా? హిందీ మాట్లాడాడా? రామాయణం సినిమా రాలేదా? బాపు సినిమా తీయలేదా? తీసినవన్నీ తెలుగు సినిమాలే కదా. నాకు తెలిసినంతవరకు రాముడు కొడితే రావణుడు ఏమి మాట్లాడిండు. తెలుగే గదా అట్లా చేస్తే కదా రామాయణం కిందిదాకా వెళ్ళింది. అట్లా చేస్తే కదా ఒక రాముడంటే ఆరాధనాభావం ఏర్పడింది

కాబట్టి తెలుగులో కూడా ఆ విధంగా తీసుకురావాలంటే ఈ భాష గొప్పదిరా అని ఒక మాట చెప్పాలి. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్రం రావాలంటే రాలే. పోతన ఎంత గొప్పవాడో చెప్పాం. సురవరం ప్రతాపరెడ్డి ఎందుకు గోలకొండ సంచిక తెచ్చాడో చెప్పాం. ఐదేళ్ల కాలంలో 354 కవితలు స్వీకరించి పబ్లిష్ చేయడం చిన్న విషయం కాదని. అంటే ఒక భావోద్వేగం వస్తే ఒక రోషం వస్తే ఇలా చేస్తారు. **సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్ర రాసినాడు కనక,అది రాముడి చరిత్ర కాదు ఆంధ్రుల చరిత్ర అని చెప్పినాడు కనక, అవన్నీ గుర్తుపెట్టుకున్నాం. కాబట్టి మహనీయుడు ఎప్పుడు అవుతాడంటే ఉండే పరిస్థితులు బట్టి ఒక ఆశావహమైన పరిస్థితులు ఏర్పడినపుడు ఆయన మహనీయుడు అవుతాడు. మనం చేయాల్సింది ఏమిటి ఒక పక్క హిందీ తప్ప ఏదీ భాషకాదంటుంటే తెలుగువాళ్ళం మనం ఎందుకు తక్కువ చేసుకోవాలి. హిందీ కూడా గొప్పదే. మేము ఇంతమందిమి ఉన్నాం. మేము తెలుగు మాట్లాడతాం అని ఒక భావోద్వేగంతో ప్రకటించాల్సిన అవసరం ఉంది.**

అసలు సంస్కృతం అభివృద్ధి కోసం ఇటీవలి కాలంలో ఈ ఏడాది రెండేళ్ళలో 630 కోట్లు ఖర్చుపెట్టారు. సంస్కృతం అభివృద్ధి కోసం 630 కోట్లు ఖర్చు బడ్జెట్ నుంచి ఖర్చు చేస్తే, తెలుగు భాష అభివృద్ధి కోసం ఎంత ఖర్చు పెట్టారంటే 3 కోట్లు. అంటే ఈ తేడాను గూర్చి మాట్లాడటానికి ఎవరూ ముందుకురారు. **వ్యవహారం లేని, అధికారంలోలేని భాష, వేలల్లో మాట్లాడే భాషకి 630 కోట్లు ఖర్చుపెడితే కోట్లలో మాట్లాడే తెలుగు భాష అభివృద్ధికి ఎంత ఖర్చు పెట్టారు అంటే 3 కోట్లు, ఏదో నామమాత్రంగా ఖర్చుపెట్టారు. ఇది ప్రశ్నించే దానికి పార్లమెంట్‌లో ఉన్నటువంటి సభ్యుల్ని మనం ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉంది.**అంటే తెలుగు భాషను గూర్చి గొప్పదనాన్ని గూర్చి చెప్పాలె. ఎవరెవరు పనిచేశారో చెప్పాలె. ఇటువంటి పని చేయడం చాలా సంతోషంగా ఉంది. భాష అభివృద్ధి కావాలంటే సాహిత్యకారులు ఏం చేస్తారు అని ఒకాయన అడిగాడట.

సాహిత్యం,భాష వేరుకాదు, కళ-సంస్కృతి- భాష వేరుకాదు. ఎన్టీరామారావు తెలుగు భాష కోసం చేశాడా. తెలుగు సినిమాలకోసం చేశాడా. అట్లా మహనీయులైనటువంటివాళ్ళు, గర్వించతగిన వాళ్ళు తెలుగు భాష కోసమే తెలుగు కోసమే కృషి చేశారు. అది దృష్టిలో పెట్టుకుని ఇవ్వాళకూడా తెలుగులో మనం చేయాల్సిన అవసరం ఏమున్నదో అది చేయాలి..

ఆ మహనీయులకు సంబంధించి జయంతులు, వర్ధంతులు గురించి, వాళ్ళ సాహిత్యం గురించి వాళ్ళ కళను గురించి ఇవన్నీ ప్రాచుర్యంలోకి తేవాలి. ఎంతమట్టుకు తేగలుగుతున్నాం. అవి అన్నీ ఇలాంటి వేదికలు పెట్టి చెప్పనక్కరలేదు. ఉమామహేశ్వరరావుగారు అనుకుంటే, రాయగలిగితే యుట్యూబ్‌లో పెట్టగలుగుతాం. భవానీదేవిగారు రాయగలిగితే యుట్యూబ్‌లో పెట్టగలుగుతాం. అట్లా ఎవరికి వారు రచనలు చేయగలిగితే, సాంఘిక మాధ్యమాల్ని ఉపయోగించుకుని, సాంఘిక మాధ్యమాల్లో విస్తృతంగా చేయగలిగితే అలా పోస్టులు పెడితే వాటిఅన్నింటిని చూసేవాళ్ళ సంఖ్య కూడా పెరుగుతుంది. కాబట్టి మనం సాంకేతిక మాధ్యమాల్ని,సాంఘిక మాధ్యమాల్ని వాడుకోవాలి.

కాబట్టి పట్టణాలన్నీ తిరిగి చిన్న సమావేశాలైనా పర్వాలేదు అక్కడకు వెళ్ళగలగాలి.సమావేశాలు నిర్వహించగలగాలి.ఇవన్నీ చేస్తున్నాం. సాహిత్య సేవ కూడా చెప్పగలగాలి. వీటిలో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తూకూడా. వాళ్ళు శాసనసభ్యులు కావచ్చు, పార్లమెంట్ సభ్యులు కావచ్చు. వాళ్ళు మంత్రులు కావచ్చు, **అధికారపక్షం కావచ్చు, ప్రతిపక్షం కావచ్చు వాళ్ళతో తెలుగుభాష ఏదైతే ఉన్నదో నెత్తినోరు పెట్టుకుని చెప్పాల్సిందే. చెప్తుంటే చెప్తుంటేగాని చెవికెక్కని రోజులు వచ్చేశాయి. చర్మం బాగా దళసరి అయిపోయింది.మందమైపోయింది. ఆ చర్మం దళసరి అయినవాళ్ళకు చెప్పడానికి ఎక్కువ కష్టపడాల్సివుంది.**

కాబట్టి ప్రజల్ని చైతన్యం చెయ్యడం ఒక పని అయితే అధికారంలో వున్నవాళ్లో, సమాజాన్ని ప్రభావితం చేస్తున్న పాత్ర ఉన్నవాళ్ళు కనక రాజకీయాల్లో ఉన్నవాళ్ళను చైతన్యం చెయ్యాల్సిన అవసరం ఉంది. ఒక పరీక్ష. వాళ్ళుకూడా తెలుగు భాష పట్ల దృష్టి పడేట్లు చేయాలి. అట్లా చేయడంద్వారా చాలా మేలు జరుగుతుందని నేను అనుకుంటున్నాను. మరి పనులు అందరం చేద్దాం. కవులు ఏమన్నా వాళ్ళు రచనలు చేయాలి. మాట్లాడేవాళ్ళు మాట్లాడాలి. కథలు రాసేవాళ్ళు కథలు రాయాలి. వ్యాసం రాసేవాళ్ళు వ్యాసం రాయాలి. చర్చలు పెట్టేవాళ్ళు చర్చలు పెట్టాలి. హోటళ్ళకాడ, చాయ్ కాడ చర్చలు చేయాలి. మహనీయుల మీద జోకులు వేసుకోవడం మనమీద మనం జోకులు వేసుకోవడం మానివేసి, ప్రాక్టికల్‌గా వాస్తవికంగా ఏ పని చేయడానిక వీలుందో ఆ పనులు చేయాల్సిన అవసరం వుంది.

**తప్పుకుండా తెలుగుకు మంచి భవిష్యత్తు ఉన్నది.ఉంటది. ఎందుకంటే ఇది రాజుల భాషకాదు. ఇది ప్రజల భాష. ఎప్పుడైనా ప్రజలు భాషను రక్షించుకొని తీరతారు.భాష రక్షింపబడుతుంది. తెలుగుకు చావులేదు. తెలుగుకు చావులేదు.** అ

## సవరణ

'అమ్మనుడి' జూన్ 2023 సంచిక 20వ పుటలోని వ్యాసం 5వ పంక్తిలో- కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారు 1923 జులై 18వ తేదీన తనువు చాలించినట్లు పొరపాటున ముద్రితమైంది. జులై 13వ తేదీన అని చదువుకోగోరుతున్నాము. -సంపాదకుడు

స.వెం.రమేశ్

# కర్నాటక ఎన్నికలలో గెలిచిన వారు కన్నడిగులు 112, తెలుగువారు 69

ఆంధ్ర తెలంగాణలు మట్టుకే తెలుగుతావులు కావు. తెలుగునేల చాలా పెద్దది. విందెమల నుండి వానమామల వరకూ వంగకడలి నుండి పడమటికనుమల వరకూ పరచుకోనున్నది తెలుగునేల. ఈ నేలను కొన్నికొన్నిచోట్ల తెలుగువారితోపాటు కన్నడిగులూ తమిళులూ ఒడియా మరాఠి గోండీవాళ్లూ పంచుకొనున్నారు. నుడినాడుల ఏర్పాటుతో బాగా నష్టపోయింది తెలుగునుడి, తెలుగుజాతి. ఈ సంగతిని గుర్తించవలసింది బయటివాళ్లుకాదు, తెలుగువాళ్లమైన మనమే.

కర్నాటకలో శాసనసభ ఎన్నికలు ముగిసి దాదాపుగా రెండు నెలలయ్యింది. కులాల, మతాల నడుమ కర్నాటకలో ఉన్న రాపిడి గురించి దేశమంతటా మన తెలుగులోనూ చాలా చాలా చర్చలు జరిగినాయి. కాని, అక్కడి నుడి నిలవరం (పరిస్థితి) గురించి బయటవారికి తెలిసింది తక్కువ. అందుకనే 'అమ్మనుడి' చదువరులకోసం ఈ సమాచారాన్ని ఇస్తున్నాను.

నుడినాడుల ఏర్పాటుతో అందరికన్నా ఎక్కువ మేలు పొందినది కన్నడంవాళ్లు ఒడియావాళ్లు, ఆ తరువాత తమిళులు. అందరికన్నా ఎక్కువ నష్టపోయింది తెలుగువాళ్లు. ఇప్పటి కర్నాటక పటాన్ని చూస్తే, పడమటి తీరమంతా తుళు, కొంకణిల తరువాతే కన్నడం. తూరుపు అంచున చాలా జిల్లాలు తెలుగుమయం. కులాల మతాల గొడవలను మట్టుకే, పైపైనే చూస్తూ మనం పట్టించుకోవడం లేదుకాని, కర్నాటకలోని ఉందూరు జనం అక్కడి నుడి రాపిడిని ప్రతి ఎన్నికలలోనూ మనకు చెబుతూనే వున్నారు. ఈ ఎన్నికలలో కూడా అంతే.

**కర్నాటకలో ప్రతితడవ లాగే ఈతడవ కూడా చాలామంది కన్నడేతరులు శాసనసభకు ఎన్నికయినారు. ఈసారి కన్నడేతరుల శాతం 50. ఇందులో తెలుగువారే ఎక్కువ. వివరాలను చూద్దాం.**

## లింగాయత కులం కాదు., మతం

కర్నాటకలో ఎక్కువ మంది గెలిచిన కులం లింగాయతులని అందరూ రాసేసినారు. చదివేసినారు. నిక్కానికి లింగాయత అనేది కులం కాదు. అది ఒక మతం. లింగాయతులలో చాలా కులాలవారున్నారు. హెళవ(అట్టడుగులు), నావి(మంగలి), మడివాళ(చాకలి), మేదర, కంసాల, బడిగ, కుంబార (కుమ్మరి), భజంత్రి(మేళంవారు), కమ్మర, ఉప్పర, గౌళి, అంబిగ, బోయి,గంగమత, సునగార, బండారి, అగస, పంచమసాలి, గాణిగ, (గాండ్ల/తెలిక) బణజిగ(బలిజ), సాదర, జంగమ, రెడ్డి, నొణబ..... ఈ వరుసలో ఇంకా ఎన్నో కులాలున్నాయి. ఇంకా ఈ కులాల నడుమ కంచంపొత్తు, మంచంపొత్తు వుండదు. ఒక్కొక్క కులంలోనూ కొన్ని కొన్ని చీలికలు ఉంటాయి. మచ్చుకు హిందూ పూజారుల వంటి లింగాయత జంగమవారిలో హిరేమఠ, చిక్కమఠ, మఠపతి, గణాచారి, హూగార,పూజార వంటి చీలికలున్నాయి. అందుకే లింగాయత అనేది కులం కాదు. అదొక మతం, అందులో ఎన్నో కులాలున్నాయి. ఇదంతా పెద్ద వివాదం. చాలామంది లింగాయత తెలివిపరులు తమది మతమనే చెబుతారు. ఆ గుర్తింపు కోసం ఎలుగెత్తుతున్నారు కూడా. కానీ కేంద్ర దొరతనం విడిగా లింగాయత మతానికి గుర్తింపు ఇవ్వడం లేదు. లింగాయతులలో ఎనభై వరకు కులాలున్నా, రెడ్డి, బణజిగ, సాదర, గాణిగ, నొణబ, పంచమసాలి వంటి కాపు(రైతు)కులాలదే రాజకీయపెత్తనమంతా. ఇందులో మరలా పంచమసాలీలు (సాలెవారుకాదు) విడిగా రిజర్వేషను కోసం కొన్నేళ్లుగా పోరాడుతున్నారు.

కర్నాటకలో లింగాయతులు పదిహేను నుండి పదిహేడు నూర్పాలు (శాతం) ఉన్నారని అంచెన. మొత్తం లింగాయతులలో రాజకీయపెత్తనం, పైన చెప్పిన కాపుకులాలదే. పై కాపుకులాలలో రెడ్డి, బణజిగ లింగాయతులు తెలుగువాళ్లు. పంచమసాలి, సాదర, గాణిగ,నొణబలు, కన్నడిగులు. జంగమ లింగాయతులలో కన్నడిగులూ, తెలుగువాళ్లూ ఉన్నారు. లెక్కకు చూస్తే పంచమసాలీలు పెద్దగుంపు.

2023 ఎన్నికలలో గెలిచిన లింగాయతులు మొత్తం 61మంది. ఇందులో 18 మంది పంచమసాలి కులంవారు (కన్నడిగులు), 12 మంది బణజిగలు(తెలుగువారు), 11మంది రెడ్లు (తెలుగు), ఆరుగురు సాదర(కన్నడ), ఐదుగురు గాణిక (కన్నడ), వీరశైవ, జంగమలు చెరి మూడు (కన్నడ), నొణబలు ఇద్దరు (కన్నడ), కూడు ఒక్కరు (కన్నడ). మొత్తం 61 మందిలో ఇరవై ముగ్గురు తెలుగువాళ్లు. బణజిగలలో శికారిపుర నుండి గెలిచిన విజయేంద్ర (యడియూరప్ప కొడుకు) గాజుల బలిజ. సేడం నుండి గెలిచిన డా. ఎన్.ఆర్.పాటీల్ ఆదిబలిజ. మిగిలినవాళ్లు శీలవంత బలిజలు. శీలవంతులలో

రాజమహేంద్రవరు, కొండపల్లియవరు, చంద్రగిరియవరు అనే చీలికలున్నాయి. లింగాయత రెడ్లలో మోటాటి, పాకనాటి, వెలనాటి, మున్నూటి అనే చీలికలున్నాయి.

కర్నాటకలో ఒక్కలిగ కులంవారు 12 నుండి 15 నూర్పాలు ఉంటారని అంచెన. ఒక్కలు అంటే కాపు అని తెల్లం. కర్నాటక ఒక్కలిగలలో నూటికి తొంభైమంది కన్నడిగులూ, పదిమంది తెలుగువాళ్లూ ఉంటారు. వేళ్లిచ్చే కాపులూ మునుగుకాపులూ తెలుగువాళ్లు. గంగటిగ, కుంచెటిగ, నామధారి,దాసరి, హాలక్కి హళ్లిగార వంటి పదుల చీలికల వాళ్లు కన్నడిగులు. **కర్నాటక నుండి గెలిచిన మొత్తం 42 మంది ఒక్కలిగలలో బి.ఎన్.రవికుమార్ ఒక్కరే తెలుగువారు.** మిగిలిన అందరూ కన్నడిగులే.

**తెలుగువాళ్లలో పైన చెప్పిన లింగాయత 23 మంది, ఒక్కలిగ ఒక్కరు కాకుండా, హిందూ రెడ్లు 8 మంది, హిందూ బలిజ ఒక్కరు, వాల్మీకి వారు (రాయలసీమలో బోయ అంటారు)18 మంది, ఈడిగవారు ముగ్గురు, ఒడ్డెరవారు ఏడుగురు, మాదిగవారు నలుగురు, ఉప్పర, బైరాగి, గొల్లవారిలో ఒక్కొక్కరు ఉన్నారు. అంటే మొత్తం 69 మంది.**

బ్రాహ్మణకులంలో మొత్తం పదిమంది గెలిచినారు. వారిలో ఇద్దరు తుళువాళ్లు.మరాఠీ, తమిళ,కొంకణి నుడులవారు తలా ఒకరు, కన్నడిగులు ఇద్దరు. మిగిలిన ముగ్గురిలో తెలుగు బ్రాహ్మణులు ఎవరైనా ఉన్నారేమో తెలియరాలేదు. **అట్లాగే హొలెయ (మాల) వారిలో బంగారుపేట, కొరటగెరె నుండి గెలిచినవారు తెలుగువాళ్లు అయివుండవచ్చు, కాకపోవచ్చు కూడా. ఈ రెండు నియోజకవర్గాలలో తెలుగు మాలవారు చాలా ఎక్కువగా ఉన్నారు.**

## కన్నడేతరులు సగంమంది

తెలుగువాళ్లు 69మంది, తుళువాళ్లు 14మంది, ఉర్దూవాళ్లు 8 మంది, లంబాడీ నుడివాళ్లు ఏడుగురు, మరాఠీవాళ్లు ఐదుగురు, మలయాళీలు ఇద్దరు, తమిళులు ముగ్గురు,కొంకణి, మేవాడీ, కుర్రు, కొడవ నుడులవారు తలా ఒక్కరు. మొత్తం మీద 112 మంది కన్నడేతరులు గెలిచినారు. అంటే సరిగ్గా సగం మంది కన్నడేతర శాసనసభ్యులున్నారు కర్నాటక శాసనసభలో.

<u>ఎక్కువమంది గెలిచిన తొలి అయిదు కులాలు ఇవి</u>

| | | |
|---|---|---|
| 01. | ఒక్కలిగ | :42మంది : (41 కన్నడ + 01 తెలుగు) |
| 02. | రెడ్డి | :(19మంది :తెలుగు ( 11 లింగాయత + 8 హిందు) |
| 03. | పంచమసాలి | :18 మంది :కన్నడ |
| 03. | వాల్మీకి | :18 మంది :తెలుగు |
| 04. | బణజిగ/బలిజ | :13 మంది :తెలుగు ( 12 లింగాయత +1 హిందు) |
| 05. | కురుబ | :12 మంది :కన్నడ |
| 05. | హొలెయ | :12 మంది: (8 కన్నడ + 2 తమిళం + 2 తెలియదు) |

**<u>ఎక్కువమంది గెలిచిన తొలి అయిదు నుడులు ఇవి:</u>**

| | | |
|---|---|---|
| 01. | కన్నడం | : 112 మంది (వివరాలు తెలియని 3 బ్రాహ్మణులు + 2 హొలెయలను కూడా కలిపితే) |
| 02. | తెలుగు | : 69 మంది |
| 03. | తుళు | : 14 మంది |
| 04. | ఉర్దూ | : 8 మంది |
| 05. | లంబాడీ | : 7 మంది |

ఇక కర్నాటక తూర్పు పడమర లెక్కలను చూద్దాం. కర్నాటక పడమటి తీరంలో మూడు జిల్లాలుంటాయి. ఉడుపి, దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడ జిల్లాలవి. పేరులోనే కన్నడం ఉంటుందికానీ కన్నడిగులు బాగా తక్కువక్కడ.తుళువారి లెక్క పెద్దది. తరువాత కొంకణి, ఆ తరువాతనే కన్నడం. ఈ మూడు జిల్లాలలో మొత్తం 19 నియోజకవర్గాలున్నాయి.ఈ పందొమ్మిదిలో పద్నాలుగు చోట్ల తుళువారు, రెండుచోట్ల మరాఠీవారు, కొంకణి,ఉర్దూ, తమిళవారు తలా ఒక చోట గెలిచినారు. ఒక్కచోట కూడా కన్నడిగులు నెగ్గలేదు.

అటు పడమట సరే. ఇటు తూరుపు చూడండి. తూరుపున ఆంధ్రప్రదేశ్‌ను ఆనుకొని కోలార్, చిక్కబళ్ళాపూరు, తుమ్మకూరు,చిత్రదుర్గం, బళ్ళారి జిల్లాలుంటాయి. నేరుగా ఆంధ్రకు అంటుకొని లేకపోయినా బెంగళూరు నగర, బెంగళూరు గ్రామీణ జిల్లాలు కూడా లెక్కించదగినవే. ఎందుకంటే 1947 నుండి 1956 వరకు ఉండిన మైసూరు రాష్ట్రంలో కోలారు, బెంగళూరు జిల్లాలలో తెలుగూ మైసూరు, శివమొగ్గ, చిక్కమగళూరు జిల్లాలలో కన్నడమూ ఎక్కువనీ, తుమకూరు చిత్రదుర్గం జిల్లాలలో సగం సగం తెలుగు కన్నడాలు ఉండేవని ఆకాలపు ఇంగ్లీషు రాతలలో ఆనవాళ్లున్నాయి. **ఈ ఆనవాళ్లను చూపించే, బెంగళూరు జిల్లాను ఆంధ్రలో కలపాలని, మద్రాసు చట్టసభలో తరిమెల నాగిరెడ్డిగారు గొంతు చించుకొన్నారు.** సరే. చరిత్రలోకి మరీ లోతుగా వెళ్లడం ఎందుకులెండి!

బెంగళూరు నగర జిల్లా కింద 28 నియోజకవర్గాలు ఉన్నాయి. బెంగళూరు నగరం గురించి చెప్పాలనా? హైదరాబాద్‌నూ చెన్నపట్నాన్నీ కలకత్తాను దాటేసి, దేశంలో మూడో పెద్దనగరం అయిందిప్పుడు. పలు పలుకుల నగరమిది ఇప్పుడు. ఇక్కడి ఇరవైయెనిమిదిలో పదహారుమంది కన్నడిగులయితే, ఏడుగురు తెలుగువారు, ఇద్దరు తమిళులు, ఇద్దరు మలయాళీలు, ఒకరు ఉర్దూవారూ నెగ్గున్నారు. బెంగళూరు గ్రామీణ జిల్లాలో నాలుగు నియోజకవర్గాలుంటే ముగ్గురు తెలుగువాళ్లు కన్నడిగులొక్కరు గెలిచినారు.

'తెలుగు కనబడదు, తెలుగు తప్ప వినబడదు' అనే నానుడి పాత కోలారు జిల్లాకు చెందినది. కోలారు ఇప్పుడు

కోలారు చిక్కబళ్లాపురం అనే రెండు జిల్లాలయింది. కోలారులోని ఆరింటిలో నలుగురు తెలుగువారు, ఇద్దరు కన్నడిగులు నెగ్గితే, చిన్నబళ్ళాపురంలోని ఐదింటిలో నలుగురు తెలుగువారు, ఒకరు కన్నడంవారు నెగ్గన్నారు.

తుమ్మకూరు జిల్లాలో 8మంది కన్నడిగులూ ఇద్దరు తెలుగువారు నెగ్గితే, దానికి ఉత్తరంగా ఉన్న చిత్రదుర్గం జిల్లాలో తెలుగు, కన్నడిగులు చెరి ముగ్గురు నెగ్గన్నారు.

ఆంధ్రులూ కర్నాటులూ మాదంటే మాదని పెద్ద గొడవలు పడిన జిల్లా బళ్ళారి. నేనిక్కడ చరిత్రను తవ్వబోవడం లేదు. కానీ ఒక్క సంగతిని గురుతు చేస్తున్నాను. బళ్ళారి ఎవరిదనే గొడవను తీర్చడానికి , శాసనసభ ఎన్నికను కొలతగా పెట్టినప్పుడు, ఆంధ్ర తరపున ఒక కమ్మనాయుడు, కర్నాటక తరపున ఒక రెడ్డి నిలబడినారు. ఇద్దరూ తెలుగువాళ్లే. కులబలం ఎక్కువున్న రెడ్డి గెలిచినారు. బళ్లారి కర్నాటకకు చేరింది. సరే, ఇప్పటి కతను చూద్దాం. బళ్లారిలోని మొత్తం తొమ్మిది నియోజకవర్గాలలో లంబాడీ నుడివారు ఇద్దరు నెగ్గితే, మిగిలిన ఏడింటా తెలుగువారే నెగ్గినారు.(వాల్మీకులు ఐదుగురు–ఈడిగవారు ఒక్కరు– రెడ్డి ఒక్కరు). కన్నడిగులు ఒక్కరూ నెగ్గలేదిక్కడ.

ఇక తెలంగాణను ఆనుకొని వున్న పాత రాయచూరు (ఇప్పుడు రాయచూరు, కొప్పళ) పాత గుల్బర్గ (ఇప్పుడు గుల్బర్గ, యాదగిరి), బీదరు జిల్లాల సంగతి చూద్దాం.

రాయచూరులోని ఏడు నియోజకవర్గాలలోనూ తెలుగువారే గెలిచినారు. ఇక్కడ నుండి నెగ్గిన బలిజ కులానికి చెందిన శివరాజ్‌పాటీల్ (రాయచూరు నియోజకవర్గం) అయితే, ఎన్నికల ముందు పెద్ద దుమారాన్నే లేవదీసినారు. రాయచూరు జిల్లాను తెలంగాణలో కలపాలని ఆయన చేసిన నిక్కచ్చు (డిమాండ్) కర్నాటకలో పెద్ద కలకలాన్ని లేపింది. కొప్పళలోని ఐదింటిలో ముగ్గురు తెలుగువారు, ఇద్దరు కన్నడిగులు నెగ్గినారు.

గుల్బర్గజిల్లా తొమ్మిదింటిలో నలుగురు కన్నడిగులూ ఇద్దరే తెలుగువారు నెగ్గినారు. ఉర్దూ మేవాడీ లంబాడీ నుడులవారు తలా ఒకరు నెగ్గినారు. యాదగిరిలోని నాలుగింటిలోనూ తెలుగువారే నెగ్గినారు. కన్నడిగులే లేరు. బీదరూ అంతే. బీదరు ఆరింటిలో నలుగురు తెలుగువాళ్లు, ఉర్దూ ఒకరూ, లంబాడీ ఒకరూ నెగ్గినారు.

**మొత్తంమీద–బెంగళూరు నగరాన్ని తప్పిస్తే – ఆంధ్ర తెలంగాణలకు ఆనుకొని వున్న జిల్లాలలోని 71 నియోజకవర్గాలలో, 43లో తెలుగువారు, 21లో కన్నడిగులూ నెగ్గన్నారు.**

**ఇక ఆంధ్రకూ, తెలంగాణకూ ఆనుకొనివున్న నియోజకవర్గాల దగ్గరకు వస్తే– అవి అటు బీదరు నుండి ఇటు బంగారుపేట వరకు ముప్పై. వీటిలో తెలుగువాళ్లు నెగ్గినవి ఇరవైమూడు (వాల్మీకి 9, రెడ్డి 7, బలిజ 3, మాదిగ 2, ఒడ్డెర 1, ముసుగు 1). కన్నడిగులు నెగ్గినవి మూడు. లంబాడీలు రెండు, ఉర్దూ ఒక్కటి, తెలియనిది ఒక్కటి.**

మరొక మాటను కూడా మనం తెలుసుకోవాలి. ఆనుకొని ఉన్న జిల్లాలలోనే కాదు, బాగా లోపలి వైపున కూడా తెలుగువాళ్లు నెగ్గన్నారు. మచ్చుకు బెల్గాం జిల్లాను తీసుకొండి. ఈ జిల్లాలోని కొన్ని ప్రాంతాల మీద హక్కుకోసం కన్నడిగులూ మరాఠీలూ గొడవ పడుతూనే ఉన్నారు, ఏళ్లకేళ్లుగా. అటువంటి బెల్గాం జిల్లాలోని మొత్తం పద్దెనిమిది నియోజకవర్గాలలో పదిమంది కన్నడిగులూ ఒక్కరు మరాఠీవారు, ఒక్కరు ఉర్దూవారు గెలిస్తే, ఆరుగురు తెలుగువారు గెలిచున్నారు. ఈ జిల్లాలోనే 72 వీరగాధలను తెలుగులో గానంచేసే బేడజంగాలు, పాములదిన్నె అనే పల్లెలో బతుకుతున్నారు. 2004లో వారితో నాలుగునాళ్లు గడిపిన ఆ గురుతులు మరిచిపోలేనివి నాకు.

**2023 ఎన్నికలలోనే కాదు, ప్రతి ఎన్నికలలోనూ కర్నాటకలో తెలుగువారు పెద్దలెక్కన నెగ్గుతున్నారు. అరవైమందికి తగ్గకుండా డెబ్బై అయిదు వరకు ఉంటుందీ లెక్క. తెలుగువారు అంటే ఆంధ్రప్రదేశ్ నుండో తెలంగాణ నుండో వలసపోయినవారు కారు. వారంతా ఉందూరు (స్థానిక) తెలుగువారే. ఈ ఎన్నికలలో కూడా, చిత్తూరు జిల్లా నుండి ఏభైయేళ్ల కిందట వెళ్లి బెంగళూరులో కుదురుకొన్న ఒక్కరు తప్పితే, మిగిలిన 68 మందీ ఉందూరు వారే.**

దీనిని బట్టి మనకు ఎరుకపడేది ఏమిటి? ఆంధ్ర తెలంగాణలు మట్టుకే తెలుగుతావులు కావు. తెలుగునేల చాలా పెద్దది. వింధ్యమల నుండి వానమామల వరకూ వంగకడలి నుండి పడమటికనుమల వరకూ పరచుకోనున్నది తెలుగునేల. ఈ నేలను కొన్నికొన్నిచోట్ల తెలుగువారితోపాటు కన్నడిగులూ తమిళులూ ఒడియా మరాఠీ గోండీవాళ్లు పంచుకొనున్నారు. నుడినాడుల ఏర్పాటుతో బాగా నష్టపోయింది తెలుగునుడి, తెలుగుజాతి. ఈ సంగతిని గుర్తించవలసింది బయటివాళ్లుకాదు, తెలుగువాళ్లమైన మనమే. అ

## గ్రంధాలయం



**చల్లారని నిప్పురవ్వలు** (కవిత్వం)
రచన: మహమ్మద్ ఖాజామైనద్దీన్
పుటలు: 104, వెల 50/-
ప్రతులకు: తెలంగాణ సాహితీ
1)హౌస్ నెం.1-10-85/18
సాహెబ్‌గుట్ట, మహబూబ్‌నగర్
ఫోన్: 9396626276

**రేగడి సీమ కథలు**
రచన: గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి
పుటలు: 110, వెల 150/-
ప్రతులకు: గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి,
నెం.86-267,సోమప్ప కాలనీ,బి.క్యాంప్,
కర్నూలు - 518 002
ఫోన్: 9110595847



కీ.శే.తిరుమల రామచంద్ర

# శ్రీ కొమర్రాజు వేంకట లక్ష్మణరావు



**శ్రీ కొమర్రాజు వేంకట లక్ష్మణరావు జన్మించే నాటికి 18వ శతాబ్దంలో శ్రీ కందుకూరు వీరేశలింగం సాగించిన సాంఘిక సాహిత్యోద్యమాలు అప్పుడప్పుడే ప్రారంభమవుతున్నాయి. మేధావులలో ఆంగ్ల విద్యాభ్యాసం వల్ల కలిగిన సంస్కార దృక్పథం ఒక పరిణామ దశకు చేరింది. అప్పటికే భారత దేశంలో నవీనయుగంలో ప్రధానమైన మూడు ఉద్యమాలు బ్రహ్మ సమాజ, ఆర్య సమాజ, దివ్యజ్ఞాన సమాజాల ప్రభావం విద్యావంతులపైన ప్రసరించింది. ఈ మూడు ఉద్యమాలు కూడా సంఘ సంస్కార సాంస్కృతిక పునరుజ్జీవన రంగాలలో ఆంధ్ర దేశంలో గణనీయమైన ఫలితాలు ప్రసరింప జేశాయి. 19వ శతాబ్దం ముగిసే నాటికి 23 సంవత్సరాల నవయువకుడైన లక్ష్మణరావు ఈ ఉద్యమాల త్రివేణీ సంగమమని భావించవచ్చు.**

## నేపథ్యం

శ్రీ వీరేశలింగం సాహిత్యంలో అనేక నూతన ప్రక్రియలకు ప్రవర్తకులయినప్పటికిని ఆధునిక దృష్టితో చరిత్ర రచన, పరిశోధన, శాస్త్రీయ విజ్ఞాన ప్రచారం మొదలయిన వాటిని ఉద్యమం వలె సాగించిన వారు శ్రీ లక్ష్మణరావు. సాహిత్యంలోను, సంఘసంస్కరణలో జాతీయతాదృక్పథం లక్ష్మణరావుతోనే తెలుగు దేశంలో ప్రారంభమయిందనవచ్చు.వీరేశలింగంది విమర్శన దృక్పథమైతే, లక్ష్మణరావుది విశ్లేషణ దృక్పథం.ఆయన శిథిలమవుతున్న వ్యవస్థను పడగొట్టారు. ఈయన దాన్ని సంస్కరించి పునర్నిర్మాణానికి నడుం కట్టారు. స్వీయాభిప్రాయాలు రూపు దిద్దుకుంటున్న వయసులో ఈయన మహారాష్ట్ర దేశంలో నివసించడం మహారాష్ట్రమే కాక, ఇతర భారతీయ భాషలతోను, వ్యక్తులతోను కలిగిన పరిచితి-ఈయన దృక్పథాన్ని, ఆలోచనా సరళిని విశాలం చేశాయి.శతాబ్దిలోని సాంస్కృతిక సాంఘిక పునరుజ్జీవనోద్యమాల మేలిమిని 20వ శతాబ్దానికి పదిలంగా అందించి, తెలుగు దేశంలో అనేక రంగాలలో పునర్నిర్మాణోద్యమాలకు పునాదులు వేసినవారు ఈయన. ఈ ఉద్యమాలు జనంలో ముఖ్యంగా విద్యావంతులలో ఆత్మవిస్మృతిని తొలగించి,స్వాతంత్ర్య సంపాదనకు వారిని ఉన్ముఖులను చేశాయి. లక్ష్మణరావు జన్మించడానికి మూడు దశాబ్దాల పూర్వమే ఆధునిక విద్యావిజ్ఞానాలు, వార్తా సాహిత్య పత్రికలు, గ్రంథ ప్రచురణలు, ప్రజల సమిష్టి కృషి, నిర్మాణాత్మకమైన ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. దీనివల్ల ప్రజలలో నూతన జాగృతి ఏర్పడింది. కనుక లక్ష్మణరావు కృషికి కొంత సౌలభ్యం, కొంత ప్రోత్సాహం అతర్కితంగానే సమకూడినవి.

## జననం విద్యాభ్యాసం

ఈ పరిస్థితిలో శ్రీ లక్ష్మణరావు 18వ తేదీ మే నెల 1877 న కృష్ణాజిల్లా నందిగామ తాలూకా పెనుగంచిప్రోలలో జన్మించారు.తల్లిగారి పేరు గంగమ్మగారు, తండ్రిగారి పేరు వేంకటప్పయ్యగారు ఈ వంశానికి మూలపురుషుడు కొమర్రాజు. ఈయన 16వ శతాబ్దివాడు, యీయన మునిమనుమడు వేంకటనారాయణ 1740లో శైవమత దీక్షను స్వీకరించారు.అప్పుడు ఆయన తన పేరును శంకరుడుగా మార్చుకొన్నాడట. ఆనాటి నుంచి ఈ వంశంవారు ఆరాధ్య శైవ సంప్రదాయం అనుసరిస్తూ వచ్చారట.ఇంటిపేరు మూలపురుషుడైన కొమర్రాజుతో ఏర్పడింది. మూలపురుషుడైన కొమర్రాజుకు పదకొండవ తరంవాడైన లక్ష్మణరావుకు ఆసఫ్ జాహీ నాల్గవ నిజాంకు దివానయిన చందూలాల్ దేశపాండ్యా పదవి ఇచ్చాడు.ఈయన చింతపల్లి సంస్థానాధీశుడైన రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయనికి సౌజన్యం నెరపేవారట. ఈయన సోదరుడు నాగేశ్వరరావు ఆ రోజులలో భవన నిర్మాణ కుశలుడుగా పేరుప్రతిష్ఠలు సంపాదించి వెంకటాద్రినాయని మన్ననలు పొందినట్టు కూడా చెబుతారు. లక్ష్మణరావు కుమారుడు వెంకటప్పయ్య. ఈయన మునగాల పరగణా దివానుగా ఉండేవాడు. ఈయన కుమారుడు వేంకట లక్ష్మణరావు.

వేంకట లక్ష్మణరావు రెండేళ్ల వయస్సు వాడయివుండగా తండ్రి మరణించారు. లక్ష్మణరావుకు సవతి సోదరుడు ఒకడు వుండేవారు.ఆయన పేరు శంకరరావు. అప్పుడాయన భువనగిరిలో ఉద్యోగం చేస్తుండేవాడు.వెంకటప్పయ్య మరణంతో సవతి తమ్ముడిని, చెల్లెలిని,సవతితల్లి గంగమ్మను శంకరరావు పోషించవలసివచ్చింది. లక్ష్మణరావు భువనగిరిలోనే ప్రాథమిక విద్యతోపాటు అన్నవద్ద సంస్కృతం, తెలుగు నేర్చుకున్నారు. ఆ రోజులలోనే లక్ష్మణరావు సోదరి అచ్చమాంబకు భండారు మాధవరావుతో వివాహం జరిగింది. ఈయన లక్ష్మణరావు మాతులుడే. ఈయన నాగపూరులో ఇంజనీరుగా పని చేసేవాడు. ఈయన మొదటి భార్య మరణించగా, మేనకోడలు అచ్చమాంబని వివాహం చేసుకొన్నాడు. అందువలన లక్ష్మణరావు మాధవరావు ప్రాపకంలో మాధ్యమిక, ఉన్నత విద్యాభ్యాసం నాగపూర్లోనే కొనసాగింది. మాతృభాషలో వలెనె మహారాష్ట్రంలోను ఆయన ప్రావీణ్యం సంపాదించాడు. నాగపూర్ లోని మారిస్ కాలేజి నుండి ఆయన పటభద్రుడయినాడు. మారిస్ ఆనాటి మధ్య పరగణాలకు చీఫ్ కమీషనర్

(గవర్నరు)గా వుండేవాడు. ఆయన పేరుతోనే ఈ కళాశాల స్థాపించారు. తర్వాత ఇది నాగపూర్ మహా విద్యాలయంగా రూపొందింది. దీనికి అనుబంధంగా ఆ రోజులలో నెయిల్ సిటీ హైస్కూల్ పని చేస్తోండేది. ఈ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరిమహాదేవ పండిట్.ఈయన గొప్ప విద్వాంసుడు. సంస్కరణ భావాలున్నవాడు. 'వివిధ జ్ఞాన విస్తార్' అనే గొప్ప మరాఠీ పత్రికను నిర్వహించేవాడు. లక్ష్మణరావు ఉన్నత పాఠశాల తరగతులలో ఈయనకు ప్రియ శిష్యుడు. ఈ గురుశిష్యుల అనుబంధం ఎంతగా రాణించిందంటే 'వివిధ జ్ఞానవిస్తార్ 'లో లక్ష్మణరావు రచనలు చేయడమేకాక దాని ఉపసంపాదకుని బాధ్యత నిర్వహించే వరకు సాగింది. ఆ రోజులలోనే తెలుగు సాహిత్యాన్ని గురించి ఈ పత్రికలో మంచి వ్యాసమొకటి వ్రాశాడు. మరాఠీ సాహిత్య ప్రియులంతా దానిని మెచ్చుకున్నారు. తెలుగు సాహిత్యం లోను ఈయన రచన ఆ రోజుల నుంచే కొనసాగింది. 'తెలుగు జనానా' పత్రికలో విశ్వము యొక్క విరాట్ స్వరూపం, విశ్వము యొక్క బాహ్య స్వరూపములను గూర్చి సంభాషణరీతిలో వ్యాసాలు ప్రకటించారు.

మారిస్ కళాశాల నుంచి గణనీయంగా బి.ఏ ఆనర్స్ పట్టం పొంది అటు పిమ్మట కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి ప్రైవేటు అభ్యర్థిగా ఎం.ఏ. పట్టం పొందారు. సంస్కృత సాహిత్యం, వేదాంతం అభిమాన విషయాలుగా ఈయన విద్యావ్యాసంగం సాగింది. సంస్కృతం ఎం.ఏ.పరీక్షలో సమాధాన పత్రాలు సంస్కృత భాషలోనే వ్రాయవలసివుండేది.దీనికి తోడు పాళీ భాష కూద నిర్బంధ పఠనీయంగా ఉండేది. ఒక వైపున ఈయన డిగ్రీల కోసం కృషి చేస్తూనే, మరొక వైపున ఆనాటి మరాఠీ సాహిత్య రంగంలో సంచలనాత్మకమైన వాద వివాదాలలో పాల్గొంటూ ఉండేవారు. రామాయణంలోని పంచవటీ స్థల నిర్ణయాన్ని గురించి గొప్ప పండితులతో తర్క వితర్కాలు జరిపి సప్రమాణంగా భద్రాచలం సమీపంలోని పర్ణశాల ప్రాంతమే పంచవటి అని నిరూపించారు. మహారాష్ట్రలోని మోరోపంత్ విరచితమైన కర్ణపర్వాన్ని పరిష్కరించి ప్రకటించడం మహారాష్ట్ర విద్వత్ప్రపంచంలోను ఆయనకు గొప్పగుర్తింపును కలిగించింది, నాగపూర్‌లో ఉంటూ ఉండగానే సోదరి అచ్చమాంబకు తెలుగు సాహిత్యంలో అభిరుచి కలిగించి ఆమెచేత రచనలు చేయిస్తుండేవారు. తల్లి గంగమ్మ ప్రోత్సాహంవల్ల విద్యార్థి దశలోనే కృష్ణాజిల్లాలోని స్వస్థలాన్ని దర్శిస్తూ అక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకొంటూ ఉండేవారు. ఈ సందర్భంగా 1897, 98, 99 వేసవి సెలవులలో లక్ష్మణరావు మునగాల సంస్థానపు సమస్యలను తెలుసుకోవడానికి బందరులో ఉండేవాడు. అప్పుడు కోర్ట్ ఆఫ్ వార్డ్ సంరక్షణలో విద్యాభ్యాసం నిమిత్తం బందరులో ఉంటూ వచ్చిన మునగాల యువరాజా నాయని వెంకటరంగారావుతో ఆయనకు పరిచయం కలిగి క్రమేపీ అది వారిద్దరి మధ్య దృఢమైన అనుబంధంగా ఏర్పడింది.

ఈ శతాబ్దం ప్రారంభ కాలంలోనే మునగాల సంస్థానాన్ని కోర్ట్ ఆఫ్ వార్డ్ నుంచి మేజరయిన నాయని వెంకట రంగారావుకు అప్పగించడం జరిగింది. అప్పుడు లక్ష్మణరావు తన కార్య క్షేత్రం ఆంధ్ర దేశానికి మార్చడం జరిగింది. అప్పటికే ఆయన 'శివాజీ చరిత్ర' రచించి పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. తెలుగు దేశంలోని మేధావులందరికీ అభిమాన పాత్రుడయ్యాడు: విద్యాధికుల హృదయ క్షేత్రాలలో జాతీయ భావాల నారులు పోశాడు. 1901 లోనే నాయని వెంకట రంగారావు, రావిచెట్టు రంగారావు, ఆదిపూడి సోమనాధరావు మొదలయిన మిత్రుల సహకార ప్రోత్సాహాలతో శ్రీకృష్ణదేవరాయ భాషా నిలయం స్థాపించారు. అప్పుడప్పుడే తెలుగు దేశంలో తలఎత్తుతున్న జాతీయోద్యమ భావాలను జాగృతం చేయదానికి నడుం కట్టాడు. మహా రాష్ట్రలో విద్యాభ్యాసం, కలకత్తా విశ్వవిద్యాలయం నుండి ఎం. ఏ. పట్టం పొందడం ఈయన జాతీయ భావాన్ని విస్తృతం చేసాయి. ఆ సంస్కారాన్ని సాహిత్యం ద్వారా తెలుగు దేశంలో వ్యాపింపజేయడానికి పూనుకున్నాడు.

## సంఘ సేవా జీవితం

లక్ష్మణరావు బెజవాడ తాలుకా కంకిపాడు కరణమైన కానూరు మల్లికార్జునరావు కుమార్తెను పెండ్లాడినాడు. ఆమె పేరు కోటమాంబ. ఈయనకు కోటమాంబయందు అచ్చమాంబ, వినాయకరావు అనే ఇద్దరు సంతానం. అచ్చమాంబ డాక్టరుగాను, సంఘ సేవకురాలుగాను ప్రసిద్ధి పొందింది. వినాయకరావు కూడా ముద్రణాలయం నిర్వహించి కొన్ని రచనలు చేశారు. లక్ష్మణరావు మునగాల రాజాకు దివానుగా నడిగూడెంలో ఉంటూ సంస్థాన వ్యవహారాలు చూచేవాడు. కాని ఇంతలో మునగాల ఎస్టేటును గురించి దావాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు బందరులోను, మద్రాసులోను కోర్టు వ్యవహారాలకోసం చాల కాలం గడపవలసి వచ్చేది. అదిగాక నడిగూడెంలో ఎండలు ఎక్కువ. ఆ వాతావరణం మొదటి నుండి సున్నితమైన లక్ష్మణరావుకు పడలేదు. ఎట్లాగూ కోర్టు వ్యవహారాలలో తిరుగుతుండడం తప్పనిసరి కాబట్టి మునగాల రాజాగారు ఆయనను మద్రాసులోనే వుండి ఆ విషయాలు చక్కపెట్టవలసిందిగా కోరారు. లక్ష్మణరావుకు ఇది చాల అనుకూలించింది.1905 ఆరంభములోనే ఆయన సకుటుంబంగా చెన్నపట్నం చేరి అక్కడ కాపురం పెట్టారు, మద్రాసులో ఉండగా ఆయన దక్షిణ భారత సంఘం సంస్కరణ సమాజంలో సభ్యుడుగా చేరాడు, అప్పుడు దాని అధ్యక్షుడు ఎస్. శ్రీనివాస అయ్యంగారు.

ఆ రోజులలో ఈ సమాజం వారు హరిజనులకు విద్య గరపడానికి రాత్రి పాఠశాలలు నిర్వహించేవారు. ఈ కృషిలో లక్ష్మణరావు భాగస్వామి అయి, రాత్రి పాఠశాలలో కూడ పని చేశారు. ఒక ప్రక్కన కోర్టు వ్యాజ్యాలు చూసుకుంటూనే, న్యాయవ్యవహారాలలో మరింత పరిజ్ఞానాన్ని గడించుకొనడానికి ఆయన న్యాయ కళాశాలలోను చేరారు. ఎఫ్.ఎల్. చదివి ఉత్తీర్ణుడయినాడు. అప్పుడే ఆయన దృష్టి సంఘ సంస్కరణల వైపు, రాజకీయాందోళనల వైపు బాగా ఆకృష్టమైంది అనాడు చెన్నపురిలో డాక్టరు సి. బి. రామారావు ఇల్లు సంఘ సంస్కరణాభిమానుల సమావేశస్థలిగా వుండేది. లక్ష్మణరావు తరచు ఆయన ఇంటికి వెళ్ళుతూ, అక్కడి కార్యక్రమాలలో పాల్గొంటూ వుండేవాడు. మొట్టమొదటిసారిగా ఆయనకు శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు పరిచయం రామారావు ఇంట్లోనే కలిగింది. ఆధునిక భారతదేశ చరిత్రలోనే మలుపు తిప్పిన వంగదేశ విభజన నవయువకులైన హరిసర్వోత్తమరావు, లక్ష్మణరావు వంటి వారిని బాగా ఉద్రేక పూరితులను చేసింది. అందువల్లనే బహుశా లక్ష్మణరావు

న్యాయ కళాశాలలో విద్యను పూర్తి చేసి బి. యల్. పట్టా పుచ్చుకోలేకపోయాడు. ఇంతలో వంగదేశము నుంచి జాతీయోద్యమ మహా తరంగమైన బిపిన్ చంద్రపాల్ తెలుగు దేశంలో పర్యటించడానికి వచ్చారు.రాజమహేంద్రవరం, విజయవాడ, బందరు వంటి తెలుగు నగరాలలో మహోపన్యాసాలు చేశారు. మునగాల రాజా రాజమహేంద్రవరందాకా ఆ బిపిన్ చంద్రపాల్‌కు ఎదుర్కోలు సన్నాహం చేసి, ఆయనను విజయవాడకు తీసుకొని వచ్చారు. మునగాల రాజా, దివానుకూడ జాతీయవాదులు కావడం కరకంకణ న్యాయంగా శోభించింది.

బిపిన్ చంద్రపాల్ 1905 లో మద్రాసుకు వచ్చినప్పుడు, ఆయన సభ ఏర్పాటు చేయడంలో లక్ష్మణరావు, అయ్యదేవర కాళేశ్వరరావు చాలా కృషి చేశారు. అదే సంవత్సరం వంగదేశ యువకులను అభినందించడానికై దీపావళి పండుగ నిధిని సేకరించడానికి వీరిద్దరూ పూనుకున్నారు. లక్ష్మణరావు తన వంతుగా పగడాల వీధిని నిర్ణయించుకొని ఇంటింటికి తిరిగి నిధి వసూలు చేశారు.మహాలయ అమావాస్య నుండి దీపావళి వరకు నెలరోజుల పాటు ఇంటింటికి తిరిగి స్వదేశ ఉద్యమాన్ని, దీక్షను బోధించే కరపత్రాలు పంచి పెడుతూ వసూలు చేశారు. దీపావళి పండుగనాడు ఆ డబ్బునంతా 'స్వదేశ మిత్రన్' వంపాదకులు శ్రీ సుబ్రహ్మణ్యయ్యర్ సమక్షంలో లెక్క పెట్టగా 52 వేల రూపాయల లెక్క తేలింది. న్యాపతి సుబ్బారావు పంతులు, సర్ సయద్ మహమ్మద్ ధర్మకర్తలుగా స్వదేశీ వస్తు విక్రయశాల నొకదానిని ఈ ధనంతో చెన్నపట్టణంలో నెలకొల్పడం జరిగింది.

1907 లో కృష్ణాజిల్లా రాజకీయ సభలు, సంఘ సంస్కరణ మహాసభలు జరిగినవి. సంఘ సంస్కరణ సభల నిర్వాహక కార్యదర్శి లక్ష్మణరావు. ఆహ్వాన సంఘాధ్యక్షుడు మునగాల రాజా, ఈయన తన ప్రారంభోపన్యాసంలో "స్వభాష, స్వవేషము, స్వదేశీ, స్వరాజ్యము ఆధునిక కాలపు నాలుగు వేదములు అని ఉత్తేజకరంగా వర్ణించాడు. నాయని వెంకట రంగారావు స్వదేశీ అభిమానానికి కారకుడు లక్ష్మణరావే అని చెప్పవచ్చు.

స్వస్థలంలో రాజకీయ చైతన్యం, సంఘ సంస్కరణల ప్రయత్నాలు చేస్తూనే రాజధాని నగరం లో పెద్ద యెత్తున విద్యాధికులను సమీకరించి నిర్మాణాత్మకమైన మహత్తర కృషికి లక్ష్మణరావు సంకల్పించాడు. ఆరోజులలో యువ విద్యాధికులందరూ తీవ్రమైన జాతీయాభిమానంతో ఉప్పొంగి పోతుండేవారు. జపాన్ వారి జాతీయ చైతన్యం, స్వదేశాభిమానం,స్వయంకృషి, స్వశక్తిపై విశ్వాసం మన యువకులను ఎంతగానో ఆకర్షించాయి. జపాను దేశానికి వెళ్ళి లఘు పరిశ్రమలు స్థాపించడానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పొంది, స్వదేశానికి వచ్చి జాతీయ పరిశ్రమలను స్థాపించవలెనని దేశాభిమానులు ఉవ్విళ్లూరేవారు. ఇటువంటి యువ విద్యాధికుడు శ్యాంరాజ్ రామారావు. ఈయన రాయలసీమ ప్రాంతంవారు. ఈయనకు జపాన్‌కు వెళ్ళి గాజు పరిశ్రమలో సాంకేతిక విజ్ఞానం సంపాదించాలనే అభిలాష ఉండేది. ఈయునకు ఆర్థికంగా సాయపడేందుకు మిత్రులందరు డాక్టర్ సి బి. రామారావు ఇంట్లో సమావేశమయ్యారు.ఆయనకొక అభినందన పత్రం కూడ సమర్పించారు. ఆ సమయంలోనే మిత్రుల మనస్సుల్లో విజ్ఞానచంద్రిక మండలి స్థాపనకు అంకురార్పణం జరిగింది. ఏ విధంగా జాతీయ ప్రబోధం చేయాలో తర్కించుకొన్నారు. పత్రిక నడపడమా, గ్రంథ ప్రచురణమా–అని చర్చలు జరిగాయి. చివరకు చందాదారులను చేర్చి, ప్రతి మూడునెలలకు ఒక పుస్తకం చొప్పున అన్నివిధాలా ఉన్నత ప్రమాణాలతో పుస్తకాలు ప్రచురించాలని నిశ్చయించుకొన్నారు.అయితే పద్యకావ్యాలు కాక, సరళమైన, సలక్షణమైన వచనంలో విజ్ఞాన శాస్త్రం, స్వాతంత్ర్యోద్యను చరిత్రలు, దేశచరిత్రలు మొదలైనవి ప్రచురించ సంకల్పించారు. ఈ విజ్ఞాన చంద్రిక గ్రంథమండలికి లక్ష్మణరావు సంపాదకుడు. నాయని వెంకటరంగారావు పోషకుడు. డాక్టర్ ఆచంట లక్ష్మీపతి, అయ్యదేవర కాళేశ్వరరావు, రావిచెట్టు రంగా రావు క్రియాశీల సభ్యులుగా ఉండేవారు. అయితే విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి 1906 నుంచిగాని పనిచేయడం సంభవించలేదు. హైదరాబాద్ రెసిడెన్సీ బజారులో దీని కార్యాలయ స్థాపన జరిగింది. హరి సర్వోత్తమ రావు కార్యదర్శి.

## విజ్ఞాన చంద్రికా మండలి

1906 వేసవిలో మద్రాసులోని మునగాల రాజాగారి నివాసభవనంలో లక్ష్మణరావు, హరిసర్వోత్తమరావు, రావిచెట్టు



రంగారావు అయ్యదేవర కాళేశ్వరరావు సమావేశమై విజ్ఞాన చంద్రికామండలి రూపురేఖలను నిర్ణయించారు. ఆ సమావేశంలో లక్ష్మణరావు సమకాలీన భారతీయ సాహిత్యంలోని ఆధునిక రీతులను గూర్చి వివరించారు. ముఖ్యంగా మహారాష్ట్ర, బెంగాలీ, హిందీ భాషలలోని నవీన రీతులను గురించి విపులీకరించి తెలుగు దేశంలో

చేయవలసిన కృషిని గూర్చి చర్చించారు. భారతదేశంలో ప్రతి భారతీయుని కర్తవ్యం స్వాతంత్ర్య సంపాదననుకొని, అందుకై తెలుగు ప్రజలను కూడ సమాయత్తం చేయడానికి వారిలో చైతన్యం కలిగించవలెనని, అందుకుగాను సరళమైన భాషలో వివిధ విషయాలలో గ్రంథాలు వెలువరించాలని, ముఖ్యంగా స్త్రీ విద్య, అస్పృశ్యతా నివారణం మొదలయిన సాంఘిక సమస్యలతో పాటుగా, రాజకీయార్థిక విజ్ఞానాలను కూడ అందజేయవలెనని లక్ష్మణరావు సూచించాడు. దీనికోసం తెలుగుదేశం నాలుగు మూలలనుండి చందాదారులను చేర్చాలని, చందాదారులకు నూరు పుటలు నాలుగణాల చొప్పున, చందాదార్లు కాని వారికి పోస్టేజి ఖర్చులు కాక నూరు పుటలకు ఆరణాల చొప్పున గ్రంథాలు విక్రయించాలని నిశ్చయించారు. విజ్ఞాన చంద్రికా మండలి సభ్యులెవరును జాతీయ విజ్ఞానోద్యమంలో కృషిచేయడానికి ప్రతిఫలం అపేక్షించరాదని దృఢనిశ్చయం చేసుకొన్నారు. దీనికనుగుణంగా లక్ష్మణరావు తాను వ్రాసిన ఏ గ్రంథానికి ప్రతిఫలం తీసుకోలేదు.

వీరు రచనా,గ్రంథ ప్రచురణ యజ్ఞంలో గ్రాంథిక వ్యావహారిక వాదవివాదాల జోలికి పోలేదు. సర్వజన సులభగ్రాహ్యమైన సరళ గ్రాంథిక శైలినే లక్ష్యంగా పెట్టుకొన్నారు. కార్యస్థానం ఏర్పడి పనిచేయడానికిగాను ప్రారంభ వ్యయం నిమిత్తం మునగాల రాజా రెండు వేల రూపాయలు విరాళమిచ్చారు. చంద్రికా మండలి పక్షాన ప్రచురితమైన మొట్ట మొదటి గ్రంథం హరి సర్వోత్తమరావు వ్రాసిన అబ్రహాం లింకన్ జీవిత చరిత్రం. ఈ జీవిత చరిత్ర రచించడంలోనే గ్రంథమండలి ఆశయం స్పష్టమవుతుంది. పేదరికంలో పుట్టి స్వయం కృషి వల్ల గొప్ప విద్యావంతుడై రాజకీయనాయకుడై, దేశనేత అయి, అమెరికా అధ్యక్షునిచేత సన్మానంపొంది బానిస వ్యాపారాన్ని రద్దుచేసిన అబ్రహాం లింకన్ పీడిత చరిత్రను హరి సర్వోత్తమరావు ఉత్తేజకరంగా వ్రాశాడు.ఈ పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంలో మండలి సభ్యులు ఐదుగురు సకలాంధ్ర జనావళిని ఉద్దేశించి ఒక విజ్ఞాపనం ప్రచురించారు. దీనిలో వారు మండలి ఆశయాలను వివరించారు. విద్యావంతుల రచనలను, లక్ష్మీపుత్రుల ధనసహాయాన్ని అర్థించారు. విజ్ఞాన శాస్త్రాలలో పట్టభద్రులైన వారు శాస్త్రీయ విషయాలను తెలుగులో వ్రాసి సహకరించాలని కోరారు.రచయితలు శాస్త్రీయ గ్రంథరచనలో కాశీ నాగరీ ప్రచారిణి సభవారు రూపొందించిన పారిభాషిక పదజాలాన్ని ఉపయోగించవలసిందిగా కోరారు. దీనిని బట్టి మండలికి భావి భారత సమైక్యదృష్టి ఎంత తీక్షణంగా వుండేదో స్పష్టమవుతుంది.

విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి ప్రచురించిన రెండవ పుస్తకం లక్ష్మణరావు వ్రాసిన 'హిందూ మహాయుగము.' భారత దేశ చరిత్రను ప్రధానమైన నాలుగు మహాయుగాలుగా విభజించి తెలుగువారికి అందించాలని లక్ష్మణరావు సంకల్పం ఈ గ్రంథాన్ని గురించి సమకాలీన పత్రిక "ఆంధ్ర కేసరి" ఈ విధంగా శ్లాఘించారు: "ప్రాచీన హిందువుల యొక్క ఔన్నత్యమును తెలిపెడి ఇట్టి చరిత్ర మిది వరకు నాంధ్రభాషలో నెవ్వరును రచియించి యుండలేదు. శైలి మిక్కిలి మృదువై లక్షణయుక్తమై యున్నది." ఈ పుస్తకం అచ్చయిన ఐదు నెలలలోనే వెయ్యి ప్రతులు అమ్ముడుపోయాయట.రెండు నెలలలోనే అయిదు వందలు అమ్ముడు పోయాయట. ఇది నాటికీ నేటికీ కూడా ఆశ్చర్యకరమైన విషయమే. 1901లో మొదటిసారి ముద్రణ పొందగా 1909లో మెట్రిక్యులేషన్ పాఠ్యగ్రంథంగా నిర్ణీతమయింది. 1892 లో నాగపూర్ లో జరిగిన అఖిలభారత జాతీయ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షత వహించిన రాజకీయ నాయకుడు పనప్పాకం ఆనందచార్యులుగారు ఈ గ్రంథాన్ని చాల శ్లాఘించారు. ఇలాంటి గ్రంథం రచించిన లక్ష్మణరావు స్వదేశీయుడయినందుకు తాము గర్విస్తున్నామని కూడా ఆయన అన్నారు. పాశ్చాత్యులు పక్షపాత దృష్టితో వ్రాసి నిరూపించే మహాత్ప్రయత్నం ఈ గ్రంథంలో జరిగింది. అపూర్వ చరిత్రా ధారాలు సేకరించి మౌలికంగా రచన సాగించాడు గ్రంథకర్త.

దీని తరువాత వెలువడిన గ్రంథం డాక్టర్ ఆచంట లక్ష్మీపతి జీవశాస్త్రము, నాలుగవ పుస్తకం వేలాల సుబ్బారావు 'రాణిసంయుక్త' విజ్ఞాన చంద్రిక గ్రంథమండలి ఏర్పరచుకొన్న ఆశయాలకు అనుగుణంగానే ఒకటొకటిగా మహాపురుషుల చరిత్ర, దేశ చరిత్ర, విజ్ఞాన శాస్త్రం,చారిత్రిక నవల ఈ నాలుగు పుస్తకాలు' హైద్రాబాదునుండే వెలువడినవి.పుస్తకాలు వెలువడిన కొద్ది చందాదారుల సంఖ్య ఎక్కువవుతూ వచ్చింది.

1907వ సంవత్సరంలో రాజద్రోహం నేరం క్రింద హరిసర్వోత్తమరావు నిర్బంధితుడు కావడంతో మండలి కార్యకలాపాలకు కొంత అంతరాయం ఏర్పడింది. హైదరాబాదులో కూడా మండలి కార్యస్థానంపైన పోలీసుల నిఘా ఎక్కువయింది. అప్పుడు కార్యస్థానాన్ని మద్రాసుకు మార్చవలసి వచ్చింది. హరిసర్వోత్తమరావు స్థానంలో ఆచంట లక్ష్మీపతి కార్యదర్శిగా నియమితుడయ్యాడు.ఆదిరాజు వీరభద్రరావును లక్ష్మీపతికి సహాయకుడుగా మద్రాసులో వుండి పని చేయడానికి నియమించారు. అందువల్ల ఐదవ పుస్తకం మద్రాసునుంచి వెలువడింది. ఇది మహమ్మదీయ మహాయుగం. లక్ష్మణరావే ఇందులోని క్రొత్త విషయాలు అంటూ ఈ విధంగా పేర్కొన్నారు : 1. మహమ్మద్ ఘజినీని అనంగపాలుడు ఓడించడం, 2. మహమ్మద్ ఘోరీని పృథ్వీరాజు ఏడుసార్లు పట్టుకొని ప్రాణదానం చేయడం. 3. స్థానేశ్వర యుద్ధములో జరిగిన మోసం. 4.ఔరంగ జేబును ఐదుసార్లు ఓడించి స్వతంత్రుడైన ఛత్రసాల్ రాజు వృత్తాంతం. 5. అక్కన్న మాదన్నగార్ల చరిత్ర, 6 అక్బరును ఓడించిన వీరబాయి చరిత్ర–ఇవి ప్రముఖమైన అంశాలు. ఇవికాక నూతనాంశాలు చాలా ప్రతిపాదించడం జరిగింది. ఆంగ్ల చరిత్రకారుల రచనలతో బాటుగా సంస్కృత, మరాఠీ, హిందీ, తెలుగు భాషలలోని చరిత్రలన్నింటిని సమన్వయపూర్వకముగా అవలోకనంచేసి ప్రామాణికంగా ఈ గ్రంథరచన చేయడం జరిగింది. ఈ గ్రంథంలోనే ఆరవ ప్రకరణమైన విజయనగర చరిత్రను ఎన్నెన్నో మౌలికాంశాలతో, పెక్కు చారిత్రకాధారాల పరిశీలనతో అపూర్వమైన రీతిలో రచించాడు. బహు భాషలలో లక్ష్మణరావుకు గల పాండిత్యం ఆయన పెక్కు మౌలికాంశాలను సేకరించడానికి తోడ్పడింది.

మండలి పక్షాన వెలువడిన ఆరవగ్రంథం పదార్థ విజ్ఞాన శాస్త్రం. దీనిని మంత్రి ప్రగడ సాంబశివరావు రచించాడు. ఏడవ గ్రంథం వేమనాది విశ్వనాథ శర్మ రసాయన శాస్త్రం. గ్రంథమండలి పక్షాన వెలువడిన ఈ విజ్ఞానశాస్త్ర గ్రంథాలు చాలా ప్రఖ్యాతి పొందాయి.అంతకు పూర్వం విజ్ఞాన శాస్త్రరచనతో వీరేశలింగం మొదలయిన వారు కొన్ని ప్రయత్నాలు జరిపినా ఆశాస్త్రాలు

చదివినవారు వాటిని సరళమైన శైలితో వ్రాయడానికిది తొలి ప్రయత్నం. ఎనిమిదవ గ్రంథం ఆ రోజులలో చాలా ప్రచార ప్రసిద్ధులు పొందిన చిలుకూరి వీరభద్రరావు ఆంధ్రుల చరిత్ర. తొమ్మిదవ గ్రంథం భోగరాజు నారాయణమూర్తి రచించిన "విమలా దేవి" . పదినుంచి పది హేను వరకు ప్రకృతిశాస్త్ర గ్రంథాలు, మండలి పక్షాన మొత్తం పదమూడు ప్రకృతిశాస్త్ర గ్రంథాలు వెలువడినవి. ఆయా శాస్త్రాలలో ప్రజ్ఞావంతులైన వారే ఈ శాస్త్ర గ్రంథాలు రచించారు. 1916వ సంవత్సరం వరకు ఈ మండలి చాలా చురుకుగా పనిచేసింది. అంతవరకు 30 గ్రంథాలు ప్రచురించింది. . ప్రపంచయుద్ధ మేఘాలు ఆవరించడంతో మండలి కార్యకలాపాలకు అటుతర్వాత కొన్ని విఘ్నాలు కలిగాయి.

ఈ మండలి కార్యకలాపాలలో విశేషించి చెప్పదగినది చారిత్రక నవలా రచనలో పోటీజరపడం. తెలుగు దేశంలో ఇదే ప్రథమం.బహుశ దేశంలోనే నేమో: భారతీయ పురావైభవ చరిత్రను, అందులో ఏక దేశమైన తెలుగువారి పరమోజ్జ్వల చరిత్రను కథారూపకంగా అందించి తెలుగువారిని చైతన్యవంతులను చేయడమే ఈ ప్రణాళికలోని ముఖ్యోద్దేశం. స్వాతంత్ర్యం దేశభక్తి స్వస్థాన వేషభాషల పట్ల అనురక్తి, జాతీయతాదృక్పథం తెలుగు ప్రజలో ఉద్దీపింపజేయడానికి లక్ష్మణరావు తలపెట్టిన ఈ ఉద్యమం సత్ఫలితాలు తెలుగు దేశంవారు ఆచిరకాలంలోనే పొందడం గురించి నిదర్శనాలున్నాయి. బహుశా 1913 వ సంవత్సరం నుంచి తీవ్రమైన అభినివేశంతో కొనసాగిన ప్రత్యేకాంధ్రరాష్ట్రోద్యమం విజ్ఞానచంద్రికా గ్రంథమండలి సాధించిన సత్ఫలితాలలో ఒక్కటని చెప్పవచ్చు.ఆరోజులలోనే చారిత్రక నవలకు 500ల రూపాయల ప్రథమ బహుమతి ఇచ్చి ప్రోత్సహించడం అపూర్వ విషయం. ఈ పోటీల వల్లనే ఒకదశలో తెలుగులో గొప్పచారిత్రక నవలలు వెలువడ్డాయని చెప్పడం సత్యదూరం కాదు. ఆ తర్వాత చారిత్రక నవలారచన పట్ల కుతూహలం కలుగడం,అడివి బాపిరాజువంటి అగ్రశ్రేణిరచయితలకు ప్రేరణం కలుగడం విజ్ఞాన చంద్రికా మండలి సాధించిన సత్ఫలితమే అని చెప్పవచ్చు. ఈ పోటీ వెనుక వంగ దేశ విభజనవల్ల కలిగిన తీవ్ర జాతీయోద్యమ ప్రభావం కూడా వుంది.కేతవరపు వెంకటశాస్త్రి 'రాయచూరు యుద్ధం' దుగ్గిరాల రాఘవచంద్రయ్య 'విజయనగర సామ్రాజ్యము' ఎవి నర్సిహ్మాపంతులు 'పాతాళభైరవి' భోగరాజు నారాయణమూర్తి 'విమలాదేవి' చాలా ప్రఖ్యాతి పొందినవి. 'రాయచూరుయుద్ధం' సాహస వీరశృంగార గాథ. శ్రీకృష్ణదేవరాయల వారు దీనిలో నాయకుడు, తిమ్మరుసు మంత్రి బుద్ధి చాతుర్యము, రాయలవారి పరాక్రమము ఒక ప్రణయగాథతో జోడించి రాయచూరు పతనం ఫలశ్రుతిగా ఈ నవల ఇతివృత్తం వెంకటశాస్త్రి నిర్వహించారు. ఈ నవల పునర్ముద్రణ పొందడం చాలా అవసరం.

ఈ విధంగా గ్రంథప్రచురణ చేయడమేకాక 1912 లోనే ఈ మండలి విజ్ఞానచంద్రికా పరిషత్తు అనే పేరుతో వైజ్ఞానిక, చారిత్రక, శాస్త్రీయ గ్రంథాలలో పరీక్షల సంస్థను నెలకొల్పింది. మండలి ప్రచురించినవిగాని, ఇతరులు రచించిన ప్రామాణిక గ్రంథాలుగాని పఠనీయగ్రంథాలుగా నిర్ణయించి తెలుగుదేశములోని పలు ప్రాంతాలను పరీక్షాకేంద్రాలుగా ఈ పరీక్షలు నిర్వహించడం జరిగింది. గుంటూరు, బందరు,బెజవాడ, నర్సాపురం, రాజమహేంద్రవరం, కాకినాడ, హైదరాబాదు మొదలైన ప్రదేశాలలో ఈ కేంద్రాలు నెలకొల్పింది. యువతీయువకులెందరో అత్యుత్సాహంతో ఈ పరీక్షలలో పాల్గొన్నారు పరీక్షలలో గణనీయమైన ఫలితాలు సాధించినవారికి 116 రూపాయల నగదు బహుమానం, బంగారు,వెండి పతకాలు, యోగ్యతా పత్రాలు యిచ్చిరి. ఈ విధంగా ఈ పరీక్షలలో పాల్గొని ఆ రోజులలో బహుమానాలు పొందినవారిలో, తర్వాతి కాలంలో ప్రసిద్ధిపొందిన పలువురు సాహిత్యవేత్తలున్నారు. కవితిలక కంచనపల్లి కనకమ్మ ఈ పరీక్షలలో ప్రథమ బహుమతి పొందారు. సుప్రసిద్ధ సాహిత్య పరిశోధకుడు శ్రీ నిడుదవోలు వెంకటరావు బంగారు పతకం పొందారు. పరీక్షాధికారులుగా వీరేశలింగం పంతులు, వనప్పాకం శ్రీనివాసాచార్యులు,కట్టమంచి రామలింగారెడ్డివంటి గొప్ప సాహిత్యవేత్తలుండడం ఈ పరీక్షల విశిష్టత అని చెప్పవచ్చు. వీటి మూలంగా తెలుగుదేశంలో నవీన సాహిత్య, శాస్త్రీయ విజ్ఞానాల ప్రచారానికి దోహదం కలిగింది.

## ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం

1915 లోనే తెలుగులో విజ్ఞాన సర్వస్వాన్ని నిర్మించాలని లక్ష్మణరావుకు సంకల్పం కలిగింది. బహుళ భారతీయ భాషలలో నాటికి ఇటువంటి ప్రయత్నం జరగకపోగా, ఊహకూడా కలుగలేదు. లక్ష్మణరావుకు ఈ సంకల్పం కలుగడం విశేషం. దానిభారమంతా లక్ష్మణరావే వహించారు.డాక్టర్ కేట్కర్ మహారాష్ట్రం నుంచి వచ్చి లక్ష్మణరావు ఇంట్లో నెలల తరబడి వుంటూ తాను తలపెట్టిన మహారాష్ట్ర విజ్ఞానసర్వస్వం గురించి చర్చలు జరిపేవాడు డాక్టర్ శ్రీధర్ వెంకటేశ కేపూర్ మహారాష్ట్ర జ్ఞానకోశ నిర్మాణానికి కావలసిన స్ఫూర్తిని లక్ష్మణరావునుండి పొందినట్లు కేట్కరు సన్నిహితంగా ఎరిగిన ఎం.బి. నియోగి (ఎం.ఏ, ఎల్.ఎల్.,ఎం. ఎల్.ఏల్.డి ఆనర్స్, కె.టి.సి.ఐ.ఇ.) తెలిపారు.ఈయన వయస్సు 88 సంవత్సరాలు.

1915 తర్వాత ఆ లక్ష్మణరావు జీవితకాలమంతా విజ్ఞానసర్వస్వ రచనలోనే గడిచిపోయింది. ఈ కాలంలో శాసనాలు చదివించడంలోను, చరిత్ర పరిశోధనలోను ఆయనవద్ద శిక్షణపొందిన మల్లంపల్లి సోమశేఖర శర్మ ఆయనకు ఎంతగానో సహకరించారు. ఒక్క 'అ' అనే అక్షరంతోనే మూడు సంపుటాలు లక్ష్మణరావు ప్రచురించారు. ఆంధ్ర అనే శీర్షికతో పూర్తిగా ఒక పెద్ద సంపుటి వెలువరించడానికి పూనుకొని విషయసేకరణం చేస్తూ వచ్చారు. విజ్ఞాన సర్వస్వంలో మొత్తం 35 వ్యాసాలు తనవి. 11 వందల పుటలు ఆయన ప్రచురించారు. ఈ వ్యాసాలలో భాష, చరిత్ర, ధర్మశాస్త్రం, గణితం మొదలైన ఎన్నెన్నో విషయాలపై ఆయన వ్రాశారు. ఏమి వ్రాసినా విషయం పరిపూర్ణంగాను, సాధికారంగాను,సప్రమాణంగాను ఉండటం లక్ష్మణరావు రచనలలో ప్రత్యేకత. అంక గణితంనుంచి అధర్వణ వేదం వరకు ఆ మహనీయుని మేధా ముద్రణ స్పష్టంగా గోచరిస్తూనే వుంటుంది. అచ్చ తెలుగును గూర్చి, అభిజ్ఞాన శాకుంతలాన్ని గురించి, అలంకారాలను గురించి లక్ష్మణరావు వ్రాసిన వ్యాసాలలో ఆయన మౌలిక విమర్శనా శక్తి కానవస్తుంది. ఆయన శైలికి మచ్చుతునకగా 'అంకగణితం' వ్యాసంలో ఒక పరిచ్ఛేదం చూపవచ్చు.

'సంఖ్యలను వ్రాయుటలో వివిధ జాతులవారు వివిధ మార్గములనవలంబించిరి. చరిత్రకారులకు దెలిసినంతవరకు 'ఫోనీసి' యను పద్ధతి మిక్కిలి పురాతనమైనది. వీరు ఒకటిని ఒక గీతచేతను,

రెండును రెండు గీతలచేతను ఈ ప్రకారము తొమ్మిది వరకును సంఖ్యలను గీతలచే దెలిపెడివారు. ఇట్లు 1, 111, 11111 గుర్తులు 1, 3, 5 సంఖ్యలకు ప్రత్యామ్నాయముగా నుండెడివి. పది పదకొండులకు వేరువేరు గుర్తులనుపయోగించెడివారు. ఈ రీతిని గీతలతో సంఖ్యలను వ్రాయుట వ్రేళ్ళతో లెక్కించుటను బట్టి స్ఫురించినదనుటకు సందియములేదు. "

## లక్ష్మణరావు ఇతర రచనలు

విజ్ఞాన చంద్రిక గ్రంథమండలిలోను, విజ్ఞాన సర్వస్వంలోను ప్రచురించిన రచనలుకాక లక్ష్మణరావు వివిధపత్రికలలో రచించిన వ్యాసాలు, గ్రంథాలు చాలా ఉన్నవి. ఆయన చరిత్రకారుడుగా, సాహిత్యవేత్తగా లబ్ధ ప్రతిష్ఠుడయినది "శివాజీ చరిత్ర" తో ననవచ్చు. దీనిని రచించడానికి కారణాలను ఆయన ఈ విధంగా తెలిపారు : "పర దేశస్తులచే వ్రాయబడిన ఇంగ్లీషు గ్రంథాలలో లక్ష పొరాదులుండ వచ్చు. చరిత్ర భాగములు కొన్ని తిన్నగా తెలియనందున చరిత్రలో కొంత యుండవచ్చును, కాన మూల మహారాష్ట్ర గ్రంథముల ననుసరించి ఈ చరిత్ర వ్రాయబడినది. ఆయన చిట్నీస్ కృతమైన 'బఖర్', 'శివదిగ్విజయ','మహారాష్ట్రదా ఇతిహాస్' మొదలైన గ్రంథములనుండి శివాజీ చరిత్రను సేకరించారు. 'సరస్వతి' పత్రికాధిపతులు కొచ్చెర్లకోట రామచంద్ర వెంకట కృష్ణారావు 'శివాజీ చరిత్రను' ప్రచురించారు. ఇది చాలా ప్రఖ్యాతి పొందింది. ఇప్పటికి నాలుగు ముద్రణలు పొందడం దీని విశేషం.

లక్ష్మణరావు వివిధ పత్రికలలో వ్రాసిన వ్యాసాలు ఆయన మరణానంతరం రెండు సంపుటాలుగా వెలువడినవి. మొదటి సంపుటం 1923లోనే స్మారక సంపుటిగా వెలువడింది. ఇందులో చారిత్రక కాల నిర్ణయానికి,భాషకు వివిధ విజ్ఞానశాస్త్ర విషయాలకు సంబంధించిన వ్యాసాలు ఉన్నవి. ఏక శిలానగరము ఓరుగల్లే అనే వ్యాసమూ, చాళుక్యులు దాక్షిణాత్యులే,కృష్ణరాయల నిదానకాలము మున్నగు వ్యాసాలు ఆయన విజ్ఞాన వైదుష్యాన్ని, విమర్శనాపాటవాన్ని తెలుపుతాయి. భాషావిషయకంగా యుద్ధమల్లుని బెజవాడ శాసనము, ద్రావిడ భాషలలో ఉత్తమ పురుషవాచక సర్వనామము, త్రిలింగము నుండి తెలుగు పుట్టెనా లేక తెలుగు నుండి త్రిలింగము పుట్టెనా–అనే వ్యాసాలు వివిధ భాషాపాండిత్యాన్ని ముఖ్యంగా ద్రావిడభాషలలో ఆయన గంభీర పరిజ్ఞానాన్ని తెలియజేస్తాయి.ఇవిగాక పంచాంగ గణనము, లలిత కళలు, కర్మయోగము– గురించి లలితమైన శైలిలో ఆయన వ్రాశారు. విజ్ఞానచంద్రికా గ్రంథమండలి ప్రచురించిన పదార్థ విజ్ఞాన రసాయనాది శాస్త్ర గ్రంథాలకు ఆయన వ్రాసిన పీఠికలూ ఈ సంపుటిలో ఉన్నవి.రెండవ సంపుటంలో ఐదు వ్యాసాలున్నవి. ఇందులో నాలుగు విజ్ఞాన సర్వస్వంలో లక్ష్మణరావు వ్రాసినవే. ఇవికాక, శృంగారము – పూర్వలాక్షణికులు అనే వ్యాసంకూడా ఇందులో చేర్చారు.

లక్ష్మణరావు వ్రాసిన కొన్ని గ్రంథాలను సంస్కరించి విపుల పీఠికలు వ్రాసి ప్రచురించారు. అలాటి వాటిలో ఒకటి మల్లికార్జున పండితారాధ్యుడు రచించిన శివతత్త్వసారము. ఆయనకు గ్రంథ పరిష్కరణలోను, సంపాదకత్వం వహించి ప్రచురించడంలోను అచేలమైన ప్రతిభవుండేది. పుస్తకం అచ్చువేసేటప్పుడు తాను సంపాదించ గలిగిన వివరాలన్ని ఆయన ఇచ్చేవాడు.అటు తర్వాత ఎవరైనా పూనుకొని దానిని ఇంకా నిర్దుష్టంగా ప్రకటించ వచ్చునని ఆయన నమ్మకం. పాద నిర్ణయంలో ఆయన పద్ధతి ప్రశంసా పాత్రమయింది. పాఠాంతరాలన్నిటినీ కూడ ఆయన సేకరించి అధస్సూచికలో ఇచ్చేవారు. ఆంధ్ర సాహిత్యపరిషత్తు తరఫున శివతత్త్వసారం పరిష్కరించి ప్రచురించారు. దీనికి గొప్ప విలువైన పీఠికను కూర్చారు. శివతత్త్వసారం నన్నయకు నూరేళ్ళ తర్వాత తిక్కనకు నూరేళ్ళ ముందు రచితమైందని ఆయన నిర్ణయం. చారిత్రకమైన విలువ దీనికి చాల కలదని ఆయన నిరూపించారు. మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో లభించిన ప్రతికి జతగా మరొక ప్రతిని నర్సాపురంలో ఆయన సంపాదించగలిగాడు. ఈ రెండు ప్రతులను పోల్చి ఆయన మార్పులు, చేర్పులు చేసి ప్రకటించారు. పూర్వలాక్షణికులు దీనిని శతకమనే వ్యవహరించగా, ఇందులో శివా,రుద్రా, అజా, మహేశా మొదలయిన మకుటాలతో 488వరకు కంద పద్యాలు ఉన్నట్టుగా పేర్కొన్నారు. పండితారాధ్య చరిత్ర పర్వత ప్రకరణంలో పాల్కురికి సోమన ఈ గ్రంథాన్ని గూర్చి ప్రస్తావించాడు. గణపవరపు వేంకట కవి ప్రయోగరత్నాకరంలోను, కస్తూరి రంగకవి రంగరాట్ ఛందంలోను ఈ గ్రంథాన్ని, ఇందులోని 'జయతి త్రిపురాంతక దేవా' అనే పద్యాన్ని దూరాహ్వాన ప్లుతయాతికి ఉదాహరణగా ఇచ్చినట్టు తమకు లభించిన ప్రత్యంతరంలో ఈ పద్యం లేనట్టు ఆయన వివరించాడు. పాత పరిష్కరణలో వున్న కష్టనిష్ఠురాలను గురించి ఈ పీఠికలో చర్చించాడు.వీరేశలింగం వంటివారు చిత్ర భారతాన్ని పరిష్కరించేప్పుడు పడిన భ్రమ ప్రమాదాలను ప్రస్తావించి పాఠ నిర్ణయంలో పాటించవలసిన జాగ్రత్తలను చెప్పారు. చిత్ర ప్రభాను అనే ప్రయోగాన్ని చిత్తా బజధానుడు అని వీరేశలింగం దిద్దివేయడంవలన ఒక తరంవరకు యధార్థ నిరూపణం కష్టమయిపోయింది. పరిష్కరణలో తనకు తోడ్పడిన ప్రతివారికి కృతజ్ఞత తెలియజేయడం ఆయన ఔదార్యానికి, సంస్కారానికి తార్కాణం,జాతి పునరుజ్జీవనానికి చేయవలసిన కృషిలో ఆయన ఎప్పుడూ పరమోత్సాహంతో పని చేసేవాడు. విజ్ఞాన చంద్రికా మండలి తరుపున ప్రామాణిక గ్రంథ ప్రచురణ కోసం, ఆయా రచయితలను, సృష్టించి పరిచయం చేయడం కోసం ఆయన పరిశ్రమించేవారు. కొత్తవారిని ప్రోత్సహించడం, అప్పటికే లబ్ధప్రతిష్ఠులైనవారి చేత ఆయా గ్రంథాలను ప్రామాణిక దృష్టితో వెలువరింప చేయడం లక్ష్మణరావు జీవితాశయంగా ఉండేది.గురజాడ అప్పారావుగారి చేత కళింగ దేశ చరిత్రను రచియింప జేసి ప్రకటించాలని లక్ష్మణరావు అభిలషించారు. విజ్ఞాన చంద్రికామండలి ప్రచురణంలో రాబోయే గ్రంథాలలో కళింగదేశ చరిత్రను ప్రకటించారు కూడా. 1910 వ సంవత్సరంలో విజ్ఞాన చంద్రికామండలి పక్షాన వెలువడిన చిలుకూరి వీరభద్ర రావు గారి ఆంధ్రుల చరిత్ర ప్రథమ సంపుటంలో, రాబోయే పుస్తకాల పట్టికలో కళింగ దేశ చరిత్రం కూడా వుంది. గురజాడ అప్పారావు గారు కూడా కళింగదేశ చరిత్రకు సంబంధించి అనేక శాసనాలు,స్థానిక పురాణాలు, చారిత్రకాధారాలు సేకరించినట్లున్నూ వింటాము. అయితే నాడుకాని, ఆతరవాత కాని, ఈ గ్రంథం వెలువడ లేదు. దురదృష్టవశాత్తు 1910వ సంవత్సర ప్రాంతంలోనే చెలరేగిన గ్రాంథిక వ్యావహారిక భాషోద్యమము, అప్పారావు గారి ఏకాగ్రతను, దీక్షను,రచనా వ్యగ్రతను, వేరొక వైపుకు ఆకర్షించి ఉంటాయి. అంతేకాక లక్ష్మణరావు ఎదురి పక్షంలో వాడు.

అంటే గ్రాంథిక వాదుల పక్షానికి చెందిన వాడు. అప్పారావుగారిని గ్రాంథికంలోనే కళింగ దేశ చరిత్రను రాసి ఇవ్వాలని కోరిఉండవచ్చు. అప్పారావు అందుకు అంగీకరించి ఉండకపోవచ్చు. 1910 నుంచి 1914 వరకణ, తెలుగు దేశమంతటా తీవ్రంగా ఈ భాషోద్యమం సాగింది. 1915లోనే అప్పారావు కథావశేషులు కావడమూ జరిగింది. వీరేశలింగం పంతులుగారి స్వీయచరిత్ర సకాలంలో అచ్చు కావడానికి లక్ష్మణరావే కారకుడు. అంతకు పూర్వం పది పదిహేను సంవత్సరాలుగా వీరేశలింగం గారిని స్వీయచరిత్రం ప్రకటనకు పూనుకోవలసిందిగా అభిమానులు. మిత్రులు, ఆప్తులు కోరుతూ ఉన్నా, బలవంతం చేస్తూ ఉన్నా ఆయన అందుకు సరేనంటూ కాలయాపనం చేస్తూ వచ్చారు. మండలివక్షాన ప్రచురణకు లక్ష్మణరావు అభ్యర్థించినప్పుడు ఆయన సరే అన్నారు. వెంటనే లక్ష్మణరావు 1910వ సంవత్సరంలో చిలుకూరి వీరభద్రరావు గారి ఆంధ్రుల చరిత్రలో రాబోయే పుస్తకాల శీర్షికల క్రింద ప్రప్రథను స్థానాన్నిచ్చి వీరేశలింగం పంతులు స్వీయచరిత్రను గూర్చి ప్రకటన ఇచ్చారు. ఎందుకింత తొందరపడి ప్రకటించారని వీరేశలింగం గారడిగితే, ఇట్లా చెప్తే కాని మీరు త్వరగా పూనుకోరు, ముగించరు–అని అన్నారుట లక్ష్మణరావు. 1911వ సంవత్సరంలో స్వీయచరిత్ర ప్రథమ సంపుటినీ, 1915వ సంవత్సరంలో ద్వితీయ సంపుటినీ, విజ్ఞాన చంద్రికా మండలి తరపుననే ప్రకటించారు. మండలివారి ప్రచురణలో వీరేశలింగం గారు జన్మించిన గృహమూ, ఆయన నిర్మించిన మందిరాలు,మొదలైన వాటి ఛాయాచిత్ర ప్రతికృతులుండడమే కాక మరొక గొప్ప విశేషం కూడా ఉంది. పంతులు గారి చేతి వ్రాతకు ప్రతికృతిని కూడా సంతరించడం. వీరేశలింగం పంతులు గారు తమ స్వీయచరిత్రను తమ ధర్మపత్ని రాజ్యలక్ష్మమ్మ గారికే అంకితం చేశారు. పంతులుగారు అంకితం చేసిన వాక్యాలనే ఆయన చేతి వ్రాత నకలుగా విజ్ఞాన చంద్రికా మండలి వారు ప్రథమ సంపుటంలో అచ్చు వేశారు. అటుతరువాత వీరేశలింగం గారి స్వీయచరిత్ర ఐదు ముద్రణలు పొందినా, యీ అంకితం ప్రసక్తి లేకపోవడం. ఆయన యెడల గ్రంథప్రకాశకులు, అపచారం చేయడమే. లక్ష్మణరావు గారు గ్రంథ విషయంలో ఎంత జాగ్రత్త తీసుకొనేవారో, సంపాదకత్వ బాధ్యత వహించి, మార్పులు చేర్పులు చేయవలసి వస్తే, మృదువుగా వాటిని గ్రంథకర్త దృష్టికి తెచ్చి, సవరింప జేసి ప్రకటించే వారో, గ్రంథం రూపు రేఖలను గూర్చి, ముద్రణ విషయమైన మేలిమిని గూర్చి కాగితం, చిత్రపటాలు మొదలైన వాటిని గూర్చి అంతగానూ శ్రద్ధా సక్తులు కనపరచేవారు, జా గ్రత్త పడేవారు.అన్నిటా ఉత్తమంగా ఉండాలని, సర్వాంగ సౌందర్యం తొణికి సలాడాలని లక్ష్మణరావు ఆశయం, విజ్ఞాన చంద్రికా మండలి పక్షాన వీరేశలింగం స్వీయ చరిత్రకు సంపాదకీయ భూమికను కూర్చింది లక్ష్మణరావే. వీరేశలింగం గారిని ఎంతగా గౌరవించినా, అభిమానించినా, జాతీయవాది అయిన లక్ష్మణరావుకి వీరేశలింగం గారి రాజకీయాభి ప్రాయాలు సమ్మతం కాలేదని ఈ భూమికలో లక్ష్మణరావు వాక్యాల వల్లనే తెలుసుకోవచ్చు, వీరేశలింగం వృద్ధతరం వాడు. ఆయనకు జాతీయోద్యమ తీవ్రత పట్ల తాదాత్మ్య దృక్పథం ఉండేది కాదు.

వీరేశలింగం గారి చేత కవుల చరిత్రను పరిష్కరింపించి, పునస్సం శోధిత ముద్రణ వెలువడేందుకు అన్ని విధాల ప్రోత్సాహ, సహకారాలు కూర్చింది కూడా లక్ష్మణరావే. వ్యాధి బాధితుడు, దుర్బలుడు అయిన వీరేశలింగంగారికి తన ఇంట వేద విలాసంలో బస ఏర్పాటు చేసి ఆయనకు ఉచారాలు చేసి, ఆయనచేత కవుల చరిత్రను సంస్కరింప జేశాడు. వీరేశలింగం గారిని వెంటబెట్టుకొని వెళ్ళి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో నాడు పండితులుగా పనిచేస్తూవుండిన వేటూరి ప్రభాకరశాస్త్రి గారికి పరిచయం చేసి, మనమంతా పంతులుగారికి తోడ్పడి, ఆంధ్ర కవుల చరిత్రను సంస్కరించి పునర్ముద్రించే విషయంలో వారికి కావలసిన సమస్త సాధన సంసర్తులూ అందించాలని లక్ష్మణరావు గారు కోరినట్లు శ్రీ ప్రభాకరశాస్త్రి గారి స్వీయ చరిత్ర ద్వారా తెలుసు కోవచ్చు.

ఆధునిక భారత దేశ చరిత్ర పరిశోధనలో అగ్రగణ్యుడైన కావలి వేంకట బొర్రయ్యను గూర్చి సమకాలికులకు ప్రవథమంగా తెలియజేసింది లక్ష్మణరావే. ఆంధ్రపరిశోధక మహామండలి పంచమ వార్షికోత్సవానికి అధ్యక్షతవహించి లక్ష్మణరావు బొర్రయ్యను గూర్చి ఆయన శాసన పరిశోధనను గూర్చి వివరించారు. బొర్రయ్య తమ్ముడు కావలి వెంకటరామస్వామి 1928లోనే దక్కను కవుల జీవితచరిత్రలన్న గ్రంథాన్ని ఆంగ్లంలో ప్రకటించాడు. ఆ గ్రంథం లోనే బొర్రయ్యను గూర్చి ఆయన వ్రాశాడు. కల్నల్ కాలిన్ మెకంజీ బొర్రయ్యను గురుతుల్యుడిగా ఎంచుకున్నాడు. భారతీయ మహా విజ్ఞానసౌధానికి పురా చారిత్రకతత్త్వశోధనకు బొర్రయ్య నాకు ద్వారంలాగా సాయపడ్డాడని శ్లాఘించాడు మెకంజీ. మిక్కిలి చిరుత వయస్సుననే తన ఇరవై ఆరో ఏట బొర్రయ మరణించగా బొర్రయ్యను దహనం చేసిన చోట కల్నల్ కాలిన్ మెకంజీ ఒక శాసనం వేయించినట్లు వెంకటరామస్వామి పేర్కొన్నాడు. లక్ష్మణరావు తన వార్షికోత్సవ సభ అధ్యక్షోపన్యాసంలో, బొర్రయ్య గూర్చి మెకంజీ వేయించిన ఈ శాసనాన్ని గూర్చి తెలుసుకొనడానికి మద్రాసులోని స్మశానాలు తిరిగి చూసినట్లుగా చెప్పారు. లక్ష్మణరాయుడికి పరిశోధకుల పట్ల గల గౌరవం అటువంటిది. ఆంధ్ర పరిశోధక మహా మండలి పంచమ వార్షికోత్సవం 1922వ సంవత్సరంలో జరిగింది.

## వ్యక్తిత్వం

లక్ష్మణరావు నిరంతర విద్యా వ్యాసంగంలోనే పొద్దు పుచ్చుతూ ఉండేవాడు. లక్ష్మణరావు గ్రంథాలయానికి వస్తున్నాడంటే గ్రంథాలయ సిబ్బంది ఆయన కోసం వరసగా కుప్పలు కుప్పలు పుస్తకాలు పేర్చేవారు. తలుపులన్నీ మూసుకొని గ్రంథాలయంలో పనిచేసే వారంతావెళ్ళేటపుడు కాని ఆయన బయటకు వచ్చేవారుకాదు. ఆయన మేధావి. ఒక సారి తిప్పుతూ పుస్తకాన్ని చదివితే చాలు ఆయన కన్నివిషయాలూ గుర్తుండేవి. ఇంటి దగ్గర ఉన్నా నేలమీద చాప పరచి తన చుట్టూ పుస్తకాలు సగం చదివినవీ, సంప్రదించవలసినవీ పెట్టుకుని కింద కూర్చుండి వ్రాసుకుంటూ,వుండే వాడాయన. వీరేశలింగం పంతులు గారికి లాగానే ఆయనకు కుడా జీవితంలో ఆస్మా (ఉబ్బసం) నిత్యం సాహచర్యం నెరపింది. ఈ విధంగా ఆస్మాతో సతమతమయ్యే మనిషి ఇంతగా గ్రంథ పరిశ్రమ ఏ విధంగా చేయగలుగుతున్నాడా అని మిత్రులంతా ఆశ్చర్యపడేవారు. దగ్గువల్ల, ఆయాసం వల్ల బాధపడుతున్న రోజుల్లో లక్ష్మణరావు బోర్లగిల పడుకొని పుస్తకాలు చదువుతూ వుండేవారు. నిరంతర పఠన వ్యసనం నుంచి ఆయనకు కొంత విశ్రాంతి

కలిగించాలని, ఆయన మిత్రులు, సన్నిహితులు ప్రయత్నించినా ప్రయోజనం వుండేదికాదు, లక్ష్మణరావుగారి పైన మహారాష్ట్ర సంస్కృతి ప్రభావం చాలా వుండేది. ఆయన వేషంలోకూడా మహారాష్ట్ర లక్షణం కనిపిస్తూనే ఉండేది. కోటు, ఉత్తరీయం, తలపాగా, మీసాలు, వీటన్నిటితో ఆయన మూర్తిత్వం మహారాష్ట్రీయంగా ఉండేది. సంస్కృతంలోంచి మరాఠీలోకి చేరిన పదాలెన్నిటినో ఆయన తెలుగు రచనలలో ధారాళంగా ప్రయోగించారు. ఆయనకు బెంగాలీ, తమిళం, మళయాళం, కన్నడం, ఉర్దూ, హిందీ, సంస్కృతం, పాలీ భాషలలో మంచి పరిజ్ఞానం ఉండేది. అయితే మహారాష్ట్రంపై మక్కువ ఎక్కువ. మహారాష్ట్రుల సంప్రదాయాన్ని అనుసరించే ఆయనగారు కొడుకు పేరు వినాయకరావని పెట్టుకున్నారు. చనువున్న వాళ్ళతో, సన్నిహితులతో ఆయనకు ఛలోక్తులాడటంలో ఆసక్తి ఉండేది. హాస్యధొరణికూడా ఉండేదని తెలిసినవాళ్లు అన్నారు. నాగపూర్లో ఉన్నత పాఠశాల విద్యాభ్యాసం చేస్తున్న రోజులలోనే ఆయన ఆనాటి మహారాష్ట్ర పత్రికలో ఒక ప్రహసనం ప్రచురించాడు. వృద్ధభర్త- పడుచు భార్య ప్రహసనం అది. లక్ష్మణరావు బావగారైన మాధవరావు గారిదగ్గరకు అప్పుడప్పుడొక వృద్ధుడు వచ్చి తనకుటుంబ వ్యవహారాలన్నీ వెళ్ళబోసుకుంటూ వుండేవాడు. లక్ష్మణరావు రాసిన ప్రహసనం పత్రికలో అచ్చుకాగానే ఆ వృద్ధుడు పళ్లులేకపోయినా కొరుకుతూ వచ్చి చూశావా మీ లక్ష్మణుడి ఆగడం అని మాధవరావుగారితో ప్రహసనం గూర్చి చెప్పి చాలా ఆగ్రహపడ్డాడు. నేను మందలిస్తాను లెమ్మని చెప్పి మాధవరావుగారు ఆయన్ను శాంతింపజేసి పంపించవలసివచ్చింది. పాపం వీధి వీధంతా ఆయనను వేళాకోళం పట్టించారు. తెలిసినవాళ్ళంతా ఆయన్నుచూసి ఫక్కున నవ్వారు. లక్ష్మణరావు పరిశోధనలో నిమగ్నుడైపోయి సృజనాత్మక రచనా వ్యాసంగం వదలిపెట్టాడు. కాని లేకుంటే గొప్ప సృజనాత్మక రచయితగా కూడా రాణించి ఉండేవాడు. ఆయన చదువుకునే రోజుల్లోనే ఒక భావగీతం రచించి పత్రికలో ప్రకటించాడు. ఇల్లాలి మృతిని గూర్చిన కరుణగీతం అది. అప్పటికి లక్ష్మణరావుకి పెళ్ళి కాలేదు. కాని ఆ గీతం ఎందుకురాశాడో, ఎట్లా వ్రాశాడోకానీ, పత్రికలో అది అచ్చయిన తర్వాత రచయితకు సానుభూతి లేఖలుకూడా వచ్చాయట! ఆ గీతంలోని కరుణార్ద్ర భావోద్విగ్నత తమకు కంట తడి తెప్పించిందని, కొందరు పరామర్శ లేఖలు వ్రాశారట. లక్ష్మణరావు పెద్దవాడైన తర్వాత ఈ గీతంలోని చరణాలు ఎప్పుడైనా గుర్తు తెచ్చుకుని చదువుతూ నవ్వుకుంటూ ఉండేవాడట.

ఆయనకు స్త్రీ స్వాతంత్ర్యంపట్ల, మహిళలకు చూపవలసిన మర్యాద పట్ల ఎంతో అభినివేశం ఉండేది. పూర్వాచార పరాయణురాలైన తమ తల్లి గారికి తమకూ జీవితకాలంలో స్థిరంగా సంబంధం తెగిపోయేట్లు పరిణమించినా ఆమె కోరినట్లు, లక్ష్మణరావు తమ కూతురు అచ్చమాంబకు చిన్నతనంలో పెళ్ళి చేయలేదు. తల్లితో ఎంతగా వాదించి చెప్పినా ప్రయోజనం లేకపోయింది. మనవరాలికి యుక్తవయస్సు రాకుండానే పెళ్ళిచేసితీరాలని, లక్ష్మణరావుగారితల్లి గంగమ్మగారు పట్టుపట్టింది, లక్ష్మణరావు చలించలేదు. ఆ విధంగా చేయకపోతే తాను కాశీ వెళ్ళిపోతానని, మళ్ళీ కొడుకు ఇంట కాలు పెట్టననీ ఆమె కచ్చితంగా చెప్పింది. అయినా లక్ష్మణరావు చలించలేదు. అమె అన్నంత పని చేసింది. కొడుకు పోయినాడని తెలిసిన కూడా అమె కాశీ నుంచి తిరిగిరాలేదు. లక్ష్మణరావు క్రమం తప్పకుండా తల్లికి డబ్బు పంపేవాడు.

ఉత్తరాలు రాస్తూ ఉండేవాడు. కాని తాను త్రికరణశుద్ధిగా నమ్మిన ఆశయాలకోసం, సిద్ధాంతాల కోసం, అయన పాటుపడేవారు ఆ విషయాలలో ఆయనకు రాజీ అంటూ లేనేలేదు. చిన్నతనంలో పెళ్ళి చేయకపోవటమేకాదు, లక్ష్మణరావు తన కూతురును ఆ రోజుల్లోనే విదేశాలలో చదువుకోడానికి కూడా పంపించారు.

నేరం మోపి కోర్టులో విచారణ జరుగుతూ ఉండగా ఒక రోజున హరి సర్వోత్త మరావుగారి ఇల్లాలు కోర్టుకు పాదచారిగా రావడం లక్ష్మణరావు చూశారు. హరి సర్వోత్త మరావు గారిది పేద కుటుంబం. ఇంటినుంచి కోర్టుదాకా బండి బాడుగకూడ ఆమె ఇచ్చుకోలేని స్థితిలో నడచే వచ్చేవారు. ఇది చూసిన లక్ష్మణరావుకు చాలా ఆగ్రహమూ, బాధా కలిగాయి. దేశభక్తుడి ఇల్లాలికి ఈ పాట్లా? అని ఆయన ఎంతో నొచ్చుకున్నారు. హరి సర్వోత్తమరావుగారి ఇల్లాలు అప్పుడే నిండుమనిషి కూడాను. అ రోజున కోర్టు విచారణ ముగిసి ఇంటికి వెళ్ళేప్పుడు అమెగారికి బండి కుదిర్చి పంపించారు. లక్ష్మణరావు. ఆ తరువాత కోర్టు విచారణ జరిగినన్నినాళ్ళూ, ఆమె బండిమీదవచ్చి మళ్ళీ ఇంటికి వెళ్ళడానికి ఆయన ఏర్పాటు చేశారు.

లక్ష్మణరావు తమ రెండో మేనమామగారైన భండారు దండపాణి గారి ప్రథమభార్య చనిపోయినప్పుడు. ఆయన్ను వితంతు వివాహం చేసుకోవడానికి ప్రోత్సహించి,ఆ వివాహం తానే పూనుకొని జరిపించారు. ఇంతేకాక తగిన వసతిలేని తమ బంధువులు, తెలిసినవారి పిల్లలకు లక్ష్మణరావు పీటలమీద కూచుని పెళ్ళిళ్లు జరిపించేవారు. ఆయన ఇంట్లో ఇల్లాలి మర్యాదలకు వీసమెత్తు కూడా లోపం జరుగనిచ్చేవారు కాదట. ఆమె గొప్పగా విద్యావంతురాలు కాదు. ఆ రోజుల్లో సంప్రదాయాల్ని బట్టి అయినా తమ ఇంటికి వచ్చిన పెద్దలకు, మిత్రులకు లక్ష్మణరావు తమ శ్రీమతిని పరిచయంచేసి, ఆమెనెంతో గౌరవించేవారట.

అయన మిక్కిలి నిరాడంబరంగా జీవితం గడుపుకున్నారు. 'ఈయన మునగాల రాజాగారి దివాను, మహావిద్వాంసుడు, చారిత్రికాగ్రేసరుడు అయినా లక్ష్మణరావు' అని అయినను మొదటిసారి చూసినప్పుడు ఎంతో ఆశ్చర్యం పొందామని శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, తమ 'అనుభవాలు-జ్ఞాపకాలలో' వర్ణించారు. ఆయన సాధుశీలము, పాండిత్యం, గాంభీర్యం, ఆర్జవం, చాల ఆకర్షణీయమైనవి అన్నారు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. విద్వాంసులలో, ఆయన హిమాలయోన్నతులు అని అభివర్ణించారు.

లక్ష్మణరావుగారికి నిత్యజీవితంలో కర్మకాండ పట్ల ఆచార వ్యవహారాలపట్ల శ్రదాసక్తులుండేవి కావని చెబుతారు. ఆయన నాస్తికుడు కాకపోయినా అజ్ఞేయవాది. భగనంతుని అస్తిత్వాన్ని గూర్చి విచికిత్స చేయరు ఆజ్ఞెయవాదులు. ఉంటే ఉన్నాడు. లేకుంటే లేడు. ఆయన ఉనికితో లేదా హుళక్కితో మనకు నిమిత్తం లేదు. అనేవారి మతంతో ఏకీభవించేవాడు లక్ష్మణరావు అంటారు. చిన్నతనంనుంచీ కూడా పరిశోధనలపట్ల అయనకు చాలా అభినివేశం వుండేది. ఆయనగారికి ఇరువై అయిదేళ్ళ వయసుననే ఆ రోజుల్లో ప్రముఖ సాహిత్య మాసపత్రిక అముద్రిత గ్రంథ చింతామణిలో ఆయన ఒక లేఖ ప్రకటించారు.

మహారాష్ట్ర భారతాన్ని, తెలుగు భారతాన్ని, ఒక ఘట్టం సందర్భముగా పోలుస్తూ, సంస్కృత మహా భారతంలో ఈ విధంగా ఉందని తెలుపుతూ, విద్వాంసులైనవారు తెలుగు మహాభారతంలోని మూలంలోని మార్పు ఎందువల్ల వచ్చిందో తెలియజేయవలసిందిగా ఆయన అర్థించారు. సన్నయ్యకు విపుల శబ్దశాసనుడని బిరుదు రావడానికి కారణమూ, ఆయన వ్యాకరణం రచించిన విషయం యదార్థమేనా తెలియజేయవలసిందనీ కోరుతూనూ, అప్పకవి మహాభారతంలో ఆదిపర్వంలో శకుంతల చరిత్రంలోనిదని ఉదహరించిన పద్యం పిన వీర భద్రుని శృంగార శకుంతలంలోనిదని పేర్కొంటూనూ, లక్ష్మణరావు చింతామణిలో లేఖ ప్రచురించారు.

ఆయన ఇంకో రెండు గంటల్లో చనిపోతారనగా కూడా సర్దేశాయి విరచితమైన మహారాష్ట్ర చరిత్రను చదువుతూ కాలం గడిపారనీ వారిని గూర్చి వ్రాశారు. 1919 వ సంవత్సరం వేదవిలాసంలో సరిగా ఏకుర్చీలో కూచుని పనిచేసుకుంటూనే వీరేశలింగం పంతులుగారు ఒరిగిపోయి కన్ను మూశారో సరిగ్గా నాలుగు సంవత్సరాల తర్వాత అదే వేదవిలాస్‌లో, అదే కుర్చీలో కూచుని లక్ష్మణరావు కూడా కన్నుమూశారు. 1923 జూలై 13 వ తేదీన లక్ష్మణరావు పరమపదించారు.

ప్రఖ్యాత పరిశోధకుడు, పండితుడు కీ.శే.తిరుమల రామచంద్ర రచించిన ఈ వ్యాసాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ గారి ప్రచురణ నుండి సేకరించాము. ప్రచురణ తేదీ తెలియదు.

---

**15వ పుట తరువాయి...**

## డా. గుంటుపల్లి ప్రసంగాలు

శ్రీ గోపాలకృష్ణ గోఖలేగారు ఉద్యమాల తీరుతెన్నుల గురించి ఈ విధంగా చెప్పారు. **'మార్పుకోసం కొత్త చట్టాలను తీసుకురావడం కోసం చేసే ఉద్యమ తీరు తెన్నులు, చట్టాలు చేశాక వాటి అమలు కోసం చేసే ఉద్యమ తీరుతెన్నులు, అనుసరించే మార్గాలు వేరువేరుగా ఉంటాయి' అని.**

భాషాభిమానం ఎక్కువని అందరూ భావించే తమిళనాడులో 1970వ దశకంలో జరిగిన ఒక కోర్టుకేసు. అక్కడి పోలీసుశాఖలో పరిపాలన తమిళంలో జరిగే విధంగా ఎలా కారణం అయిందో మనమందరం తెలుసుకోవాలి. ఒక హత్య కేసులో నిందితుడు 3-4 సం.గా కోర్టునుండి వివిధ రకాలుగా ఉత్తర్వులు పొందుతూ పోలీస్ వారి అరెస్ట్‌ను నిరోధిస్తూ వస్తున్నాడు. చివరిగా ఆ కేసులో అరెస్టును అడ్డుకోవడానికి హైకోర్టులో తనకు పోలీసువారు సమన్లు అధికారభాష అయిన తమిళంలో కాకుండా, ఇంగ్లీషులో ఇచ్చారని,కావున అవి చెల్లవని' కేసువేశాడు. **ఆ కేసు తర్వాత నుండి తమిళనాడులో పోలీస్‌శాఖవారు విధిగా తమిళంలోనే సమన్లు ఇవ్వడం ప్రారంభించారు. ఇటువంటివి తెలుగురాష్ట్రాలలో జరగలేదు. పరిపాలన తెలుగులో జరగడాన్ని ఒక హక్కుగా సమాజం సాధించడంలో ఇక్కడి పౌరసమాజం వైఫల్యం చెందింది.**

ఆంధ్రప్రదేశ్‌లో అధికారభాషాచట్టం అమలు చేయడం అనేది 'తెలుగు భాష పరిరక్షణ కోసం మాత్రమే కాదు', నిజానికి అది ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎంతో అవసరం. ప్రజలకు అర్థంకాని భాషలో ప్రభుత్వ ఉత్తర్వులు ఉండడం వలన ప్రజలు ప్రభుత్వఉత్తర్వులను అర్థం చేసుకోవడానికి వివిధ మాధ్యమాలలోని అనధికార వ్యాఖ్యానాలపైన, విశ్లేషణలపైనా ఆధారపడాల్సివచ్చింది. దీనివలన కలుగుతున్న అత్యంత పెద్ద దుష్ప్రభావం ఏమిటంటే **'ప్రజల భావాలు, ఆలోచనలనే ఎవరైనా సులువుగా ప్రభావితం చేయగలుగుతారు'.** కొద్దిమంది మనస్సులో ఉన్న భావం ఏమిటంటే ఇప్పుడంతా ఇంగ్లీషు మీడియం కదా! ప్రభుత్వం ఇంగ్లీషులో ఇచ్చే ఉత్తర్వులు చదవడంలో ఎవ్వరూ ఇబ్బందిపడరు అన్నది వారి భావన. ఇందులోని నిజానిజాలు తెలుసుకోవాలంటే మనం పెద్ద పెద్ద సర్వేలు చేయనక్కరలేదు. రాష్ట్ర ప్రభుత్వం టీచర్ల బదిలీల గురించి (లేక) ఇతర ప్రభుత్వోద్యోగులకు సంబంధించిన విషయాల గురించి విడుదల చేసిన జి.ఒలను తమతమ స్మార్ట్‌ఫోన్‌లలో చదివిన తర్వాత, ఆ జి.ఒకు సంబంధించిన వివరణాత్మక తెలుగు మెసేజ్‌ల కోసం, యూట్యూబ్‌లో తెలుగు వీడియోల కోసం ఎదురుచూసే ప్రభుత్వ ఉద్యోగుల కళ్లు తెలుగు రాష్ట్రాల్లో లక్షల్లో వున్నాయి.

మరి కొద్దిమంది వాదన ఏమిటంటే ప్రభుత్వోద్యోగులందరూ పరిపాలన తెలుగులో జరగడానికి వ్యతిరేకం అని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని నల్గొండ జిల్లాలో పరిపాలన అంతా తెలుగులో జరిపిన అప్పటి కలెక్టర్ శ్రీ నందివెలుగు ముక్తేశ్వరరావుగారుచెప్పింది 'అత్యధిక ఉద్యోగులకు పరిపాలన తెలుగులో ఉంటే వారి పని తేలికవుతుంది, మరియు ఆహ్వానిస్తారు. కానీ ఆఫీసుల్లో పెత్తనం చెలాయించే (ఇంగ్లీషులో జి.ఒలు, ఇతర ఉత్తరప్రత్యుత్తరాలు వ్రాసిపెట్టే) కొద్దిమంది ప్రస్తుతం పనిచేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు మాత్రమే తీవ్రంగా వ్యతిరేకిస్తారు-అని.

**చాలామంది భాషాభిమానులు తెలుగు ప్రజలను పక్క రాష్ట్రాలవారితో పోల్చి తెలుగువారికి భాషాభిమానం లేదని విమర్శించడం ఒక పరిపాటిగా మారింది. నిజానికి ఇది వాస్తవంకాదు. ఎందుకంటే అసలు కారణం 'లక్ష్య సాధనకు సరైన వ్యూహాలు పాటించకపోవడమే. పరిపాలనా భాషగా తెలుగును అమలుచేసే విధంగా పోరాటం చేయడంలో అందరికీ పాత్ర ఉంది. రాజకీయనాయకులు, అధికారులు చేయాల్సినవి కొన్ని, న్యాయస్థానాలు చేయాల్సినవి కొన్ని, పౌరసమాజం చేయాల్సినవి కొన్ని. ...వెరసి అందరూ ఉమ్మడి లక్ష్యం దిశగా లక్ష్యశుద్ధి, చిత్తశుద్ధితో ముందుకు కదలాలి.**

"అమ్మా! నీ భాష కావాలి". నిప్పులు చెరగడానికి..
చెమటను జల్లెడపట్టి సంపాదనలను తీయడానికి..
తెలుగు పౌరుషాగ్ని రాజెయ్యడానికి
మాతృభాష కావాలి.
**- ఛాయారాజ్ ('మాతృభాష'-కవిత)**

భమిడిపాటి గౌరీశంకర్
9492858395

# రాఘవ పాండవీయము - యాదవ రాఘవ పాండవీయము - భాషారమ్యత

రాఘవ పాండవీయము పేరుతోనూ ఆయా కథల సంధానముతోనూ సంస్కృతంలో ద్వ్యర్థి కావ్యాలు, విలోమ కావ్యాలు వెలువడ్డాయి. యాదవ రాఘవ పాండవీయము, రాఘవ యాదవ పాండవీయము పేర్లతో సంస్కృతంలో త్ర్యర్థి కావ్యాలు వెలువడ్డాయి. కవిరాజసూరి రచించిన రాఘవ పాండవీయము, దండి రచించినట్లుగా పేర్కొన్న ద్విసంధానము, నిఘంటుకారుడైన ధనంజయుడు రచించిన ద్విసంధధానము సంస్కృతంలో కథల విషయంలో సమానాలే. యాదవ రాఘవ పాండవీయము పేరుతో అనంతాచార్యకవి. రాఘవ పాండవ యాదవీయం పేరుతో చిదంబర సుమతి. రాజచూడామణి సంస్కృతంలో త్ర్యర్థి కావ్యాలు రచించారు. ఆ కోవలోనే తెలుగులో వెలువడిన పింగళి సూరన రచించిన రాఘవపాండవీయం నెల్లూరి వీరరాఘవకవి రచించిన యాదవ రాఘవ పాండవీయం అనే ద్వ్యర్థి, త్ర్యర్థి కావ్యాల తులనాత్మక పరిశీలన ఈ గోష్ఠీపత్ర లక్ష్యం. సంక్షిప్తత దృష్ట్యా శీర్షికలోని రెండు కావ్యాలలోని పీఠిక అవతారికలకూ ప్రధానంగా ప్రథమాశ్వాసానికీ పరిమితమై ఈ గోష్ఠీపత్ర వివరణ ఉంటుంది.

ఆకువీటి పెదవేంకటాద్రి రాజు తన కొలువుకు పింగళి సూరనను పిలిచి గౌరవించి తీయని మాటలతో

*“రెండర్థంబుల పద్యమొక్కటియ నిర్మింపంగ శక్యంబుగా*
*కుండుం - దగ్గతి గావ్యమెల్ల నగునే నోనోయనం జేయదే*
*పాండిత్యంబున నందునుం దెనుగుం కబ్బం బద్ధుతంబంద్రు ద*
*క్షుండెవ్వాడిల రాను భారతకథల్ జోడింప భాషాకృతిన్”*

అని ప్రశంసించి మునుపెప్పుడో భీమన చెప్పాడంటున్నాడు. కాని అది అలభ్యమని అందువలన శ్రీ విరూపాక్షునికి అంకితముగా రాఘవ పాండవీయము అనే ద్వ్యర్థి కావ్యాన్ని రచింపమని అడిగినట్లు ఆ కావ్యావతారికలో ఉంది.

రాఘవపాండవీయం తెలుగులో తొలి ద్వ్యర్థికావ్యం అని సాహిత్యవిమర్శకుల అభిప్రాయం. దానికి ముందే ఉన్న సంస్కృత ద్వ్యర్థి కావ్యాలతో విశ్లేషించడం కానీ, ఆ కావ్యంలోని కథాకథన శైలిని యాదవరాఘవ పాండవీయంలోని కథాకథన శైలితో సరిపోల్చడం కానీ కాక, కేవలం భాషా విషయక చర్చే ముఖ్యం.

యాదవ రాఘవ పాండవీయము రచించిన నెల్లూరి వీరరాఘవకవి తన గురించి తాను చెపుతూ

*“అవునన కావ్యపజ్క్తి పదియర్థములన్ రచియింప నేర్తు స*
*త్కవుల దయన్ శిరీష కవితా మృదుతా మహత్కార్యవైఖరిన్*
*భువినట్లులైన సత్కథల మూటి నొనర్తును బాలబోధకై*
*తివిరి బహుత్వమందు నల త్రిత్వము పర్యవసాన మౌటచేన్”*

అని తన కావ్యం అవతారికలో పేర్కొన్నాడు. సంస్కృతంలో రాఘవ పాండవ యాదవీయం అనే త్ర్యర్థి కావ్యం రచించిన చిదంబర కవి మంగళాచరణ శ్లోకానికి పది అర్థాలు ఆ గ్రంథ వ్యాఖ్యల్లో పేర్కొన్నారట. బహుశా అది చదివిన వీరరాఘవ కవి స్వోత్కర్షగా పది అర్థాలతో రాయగలనని ఉండవచ్చు. అనేకార్థక కావ్యాలు నలయాదవ రాఘవ పాండవీయం అనే చతుర్థి కావ్యాలు దాటి కనిపించట్లేదు.

పింగళి సూరన, నెల్లూరి వీరరాఘవుడు తమ రచనా విధానాన్ని గురించి తమ కావ్యాల పీఠిక, అవతారికలలో తెలియచేసారు.

*ఆంధ్రభాషా సంస్కృతాభిభాషా శ్లేష*
*యొక్కొక్క చోట, నొక్కొక్క చోట*
*నుచిత శబ్ద శ్లేష యొక్కొక్క చోటన*
*ర్థ శ్లేష యొక్కొక్క తఱిని ముఖ్య*
*గౌణవృత్తి శ్లేషఘటన యొక్కొక్క తఱి*
*నర్థాన్వయము వేఱెయగుచు నునికి... నాచరింతు*

అని పింగళిసూరన తన కావ్యపీఠికలో చెప్పాడు. ద్వ్యర్థి అనే మాటకాక శ్లేష అన్న మాట ప్రయోగించడం గమనించతగ్గది. ఈ పద్యంలో పేర్కొన్న శ్లేషలను ఆరుద్ర ఆరు రకాలుగా వివరించారు.

*ఒకచోట శబ్దార్థ యుగళ చమత్కార*
*సందర్భ గర్భిత చతురవృత్తి*
*యొకవంక నకలంకితోదయ ధ్వని ముఖ్య*
*మొకవంక వాచ్యార్థ యోగవిభవ*
*మొక చక్కి జక్కని ప్రకటిత శ్లేషోక్తి*
*యొక చక్కని నభంగయుత పదాప్తి*
*యొకదారి పదవాక్య నికరగవ్యంగ్యంబు*
*నొకదారి బహుళార్థ యోగగమ్య... విస్తరింతు*

అని వీర రాఘవ కవి తన రచనా విధానాన్ని ప్రకటించాడు. ఈ పద్యంలో కూడా పద్యాలకు మూడు అర్థాలు వచ్చేలా చెయ్యడానికి ధ్వని, వాచ్యార్థము, సుగమమైన శ్లేషార్థము, అభంగ, సభంగ శ్లేషోక్తులు, పద వ్యంగ్యము, వాక్యవ్యంగ్యము, బహ్వర్థ యోగము, పూర్వా పరాన్వయ యోగము, ఏకార్థ వైభవం, ఇత్యాది సరస రీతులు, వృత్తులను అనుసరించి రస ప్రబంధము రచిస్తానని చెప్పాడు.

ఇద్దరి రచనా శైలుల ప్రకటనా పరిశీలిస్తే సామ్యం కొంత కనిపిస్తుంది. ‘ఉచిత శబ్దశ్లేష, అర్థ శ్లేష’ సూరన పేర్కొంటే దానిని “శబ్దార్థ యుగళ చమత్కార సందర్భ గర్భిత చతుర్థవృత్తి”గా వీరరాఘవుడు పేర్కొన్నాడు. “ముఖ్య గౌణవృత్తి శ్లేషఘటన” సూరనదైతే “చక్కని ప్రకటిత శ్లేషోక్తి వాచ్యార్థ యోగ విభవం”తోడిది వీరరాఘవునిది. “అర్థాన్వయము వేఱెయగుచునునికి శబ్దాన్వయ విభేద సంగతి” గురించి సూరన చెబితే బహుళార్థ యోగగమ్య... పూర్వాపరాన్వయ యోగగతుల గురించి వీరరాఘవుడు తెలిపాడు. శైలుల విషయంలో కొంత కొంత అర్థ భేదాలు కనిపిస్తున్నా ఇద్దరి కథా సందర్భాలు పరిశీలిస్తే మరింత సామ్యంకనిపిస్తుంది. యాదవ పరమైన అన్వయం వేరుగా చూడాలి.

**నామవాచకాల అన్వయ సమానత:**

రాఘవునిపరంగా అయోధ్య, పాండవులపరంగా హస్తినాపురం, యాదవులపరంగా మధుర రాజధానులుగా వర్ణించాలి. ద్వ్యర్థి,

త్ర్యర్థులలో సామ్యం చూస్తున్నా రాఘవ, పాండవ పరమైన అర్థాలే గ్రహించాల్సి ఉంటుంది.

*వెలయు నబల భువనములలోన వారణ*
*నగరి పురమ తల్లి నా దనర్చి*
*రాజ్యలక్ష్మి మిగుల బ్రబల నయోధ్య నా*
*రాజు వినుత గనిన రాజధాని*

సూరన హస్తినాపురాన్ని వారణ నగరిగా పేర్కొని రాఘవపరంగా అఖిల భువనములలోన అవారణ నగరిపురమ తల్లినాన్ అని అయోధ్యకు విశేషణంగా వారణనగరి పేర్కొన్నాడు. పాండవార్థంలో అయోధ్యకు యుద్ధం చేయశక్యంగానిది అనే అర్థంలో చెప్పాడు. "వారణ నగరి పురమ తల్లినాన్" అని పాండవార్థంలో విశేషంగా సులువుగా చెప్పాడు.

*"శ్రీలకిరవు బహుళ సితభానుకులులకు*
*నాగపట్టు సజ్జనా స్పదంబు*
*మహినయోధ్య కాంతి మధుర సాలోజ్జ్వత*
*నాగపురి దనర్చు న్వలీల"*

పాండవపరంగా యాదవపరంగా అయోధ్యను సూరన చెప్పిన అర్థంలోనే వీర రాఘవుడు చెప్పిన నా వారణపురిని 'నాగపురి తనర్చు' అని మార్పుచేసి 'అయోధ్య నాగపురి తనర్చు' అని రామాయణార్థంలోనూ, మధుర నాగపురి తనర్చు అని యాదవ పరంగానూ అని అన్వయించాడు. రెండూ ఆటవెలది పద్యాలే సూరన వస్తు నిర్దేశంతో మొదలెడితే, అదే పాటిస్తూ వీరరాఘవుడు 'శ్రీ' అని చేర్చాడు.

*"ఆ పట్టణ మేలెడి పృధి*
*వీ పాలుడు భ్రుకుటి మాత్ర విముఖత సమదా*
*టోపారి పంక్తి రథుడు*
*దీపించు నుదార నీతి సనుదాటోప అరి పంక్తీరథుడు"*

అని భారతార్థంలో భృకుటి మాత్ర విముఖత సమదాటోప అరి పంక్తీరథుడు'' అని ధృతరాష్ట్రునికి విశేషంగా ప్రయోగించి రామాయణార్థంలో ధృత = ధరించిన; రాష్ట్రుడు = దేశము గలవాడని దశరథుడికి విశేషణంగా సూరన ప్రయోగించాడు. దశరథుడికి పర్యాయపదంగా పంక్తిరథుడు గ్రహించాడు.

వీర రాఘవునికి యాదవ పరమైన అర్థం కూడా ఉండటం వలన శూరసేనుడు అన్న పేరు కూడా జత చేయాల్సి వచ్చింది. కంసుని తండ్రి అయిన ఉగ్రసేనుని తండ్రి శూరసేనుడు.

*"ఆ పురి శూరసేను దనహారి మహ:పరిభూత దారుణా*
*తాప విరోధి పంక్తి రథుడదాతత సత్త్వుడు దారదానధా*
*రా పరి శోభిహేతి ధృతరాష్ట్రుడు దా విలసిల్లు సర్వధా*
*శ్రీపతి రాజమౌళి మణిదీధితి రాజిత పద్మపాదుడై"*

సూరన ప్రయోగించిన పంక్తిరథుడు, ధృతరాష్ట్రుడు పదాలనే ప్రయోగించిన వీరరాఘవ కవి. అతని అరిపంక్తి రథుడిని, విరోధి పంక్తి రథుడిగా మార్చాడు. ధృతరాష్ట్రుడిని 'హేతి ధృతరాష్ట్రుడు' అనడం ద్వారా అతని ధృతరాష్ట్రత్వాన్ని సహేతుకంగా తెలిపాడు. శూరసేనుడు పాండవపరంగా రాఘవ పరంగా కూడా శూరులు గల సేన గలవాడే.

## ఘట్టాలలో వర్ణన సమానత:

*"వాలంప తాకునకు ధృతి*
*వ్రీలగ హా తాత యనుచు వెలువడు తన్మ*
*ర్త్యాలాపమున నా జన*
*పాలకులోత్తంను గుండె భగ్గున గలిగెన్"*

మర్త్యాలాపము, శ్రమణకుడిదిగా, మునిదంపతులదిగా అర్థం చేసుకోవాలి. "హా తాత!" అన్నమాట శ్రవణుకుడికి సరిపోయినా ముని దంపతులకి సరిగా అతకట్లేదు. జనపాలకులోత్తంగు గుండె రెంటను సమానం.

*"సాయకహతి దెగి హా తా*
*తాయనగ బ్రజా విలాప మాలించి మనం*
*బాయెడ భగ్గున గలగగ*
*బాయని శౌర్యాఖ్య గలుగు పార్థివుడడరెన్"*

ప్రజా విలాపము దేవకికి ప్రజా అంటే కూతురు అనే అర్థంలో యాదవపరంగా సరిపోయినా, శ్రవణకునికి, ముని దంపతులకి ప్రజావిలాపము అంటే మనుజ విలాపము అనే అర్థం తీసుకోవాలి. హా తాత! అన్న ఆర్తనాదం దేవకికి, శ్రవణకుడికి అన్వయించినా మునిదంపతులకి సరిగా అతకట్లేదు. హా తాత! అన్నది తెలుగులో "అయ్యో! అబ్బా! వంటి ఆర్తనాదంగా గుర్తిస్తే అన్ని సందర్భాలకీ అన్వయిస్తుంది. పై రెండు పద్యాలలో 'భగ్గున గలగెన్' అనేది సమానంగా కనిపిస్తోంది. మర్త్యాలాపము, ప్రజాలాపము దాదాపు సమానాలే.

## భాషా విషయికం:

దశరథునికి యజ్ఞ పురుషుడు, కుంతికి యముడు ఇచ్చిన వరములను వర్ణించే సందర్భంలో ఆంధ్ర, సంస్కృత భాషల సభంగశ్లేష రెండు కావ్యాలలోనూ కనిపిస్తోంది.

"ఇచ్చెం గృపన్ వరముం బాయ సమస్త కల్మషము"

పాయసము అస్తకల్మషము అని రాఘవార్థంలో, పాయ సమస్త కల్మషము అని పాండవార్థంలో విభాగం చేసుకోవాలి.

***"కలుషము లెడగా బాయస కలశము లాలించ నిచ్చి"***

కలుషము లెడగా బాయ సకల శములు ఆవించనిచ్చి –పాండవార్థం

కలుషము లెగాన్ పాయస కలశము లాలించనిచ్చి–

దశరథ, పాండురాజుల పాలనను వర్ణించే సందర్భంలో పింగళి సూరన చాలా సరళమైన విభాగాన్ని తెలుగు మాటల్లో ప్రకటించాడు. "తేనన్నమాట" తేను అన్నమాట తానన్నమాట అన్న విభాగం హృద్యంగా ఉంది."

ఇదే సందర్భంలో వీరరాఘవుడు తన పద్యంలో నిజగురుభక్తి అన్య సంస్కృత సమాసాన్ని అర్థశ్లేషతో ప్రయోగించాడు. సూరన 'జగతేనుత విక్రముడు' అన్న సమాసాన్ని ఉభయ పక్షాలకూ, సమానార్థకంగా ప్రయోగించగా వీరరాఘవుడు 'పాండువరాభిఖ్యను' అని పాండురాజు పేరును పాండవపరంగా పేర్కొని పాండువర అభిఖ్య అనే విభాగాన్ని రాఘవార్థంలో ఆడి తప్పనితనాన్ని సూచిస్తుంది.

శ్రమణకుని, ముని దంపతులని దశరథుడు పాండురాజు క్షమాపణ కోరే సందర్భంలో కూడా సూరన తెలుగుదనాన్నే చూపగా వీరరాఘవుడు సంస్కృతాన్ని ఆశ్రయించాడు. "ఏనుంగని కరమరయక పూనితిగాక" ఏనుంగని కరమరయక రాఘవార్థంలో విభాగం. ఏనున్ కని కరమరయక అని పాండవార్థంలో విభాగం ఇది శ్రమణకుడు నీటిలో పాత్రని ముంచుతున్న చప్పుడుని ఏనుగు నీళ్ళు తాగుతున్న చప్పుడని అనుకోవడాన్ని చప్పున తట్టేలా చేస్తోంది. ద్వ్యర్థికావ్యం గనుక పాండవార్థంలో విరుపు తప్పని సరి.

**"చనువుగ నప్పగించి తను జాతి విభేద మనీష"** అన్నప్పుడు

‘తను జాతి విభేద మనీష’ సమాసం రాఘవార్థంలోనూ, పాండవార్థంలోనూ సమానం త్ర్యర్థి. కాబట్టి చనువుగన్ అప్పగించి తనుజ అతి విబేధ మనీష అన్న విభాగం యాదవార్థంలో చెప్పుకోవలసి వచ్చింది. సమాసంలోని పదాల అర్థం సర్ది చెప్పుకోవలసిన తీరులోనే ఉంది.

**ఫలశ్రుతుల ప్రకటన:**

“దేవాదేవర ప్రేరణంబునన యుద్దీపించు వాగ్వైభవ
శ్రవిస్ఫూర్తిని రామభారత కథాశ్లేష ప్రబంధోత్తమ
వ్యానిర్వావము నిట్లు సెందెనిది భవ్యాభవ్యత ల్పాడకిం
పై వర్తిల్ల బరిగ్రహింపుము విరూపాక్షా! జగద్రక్షకా!

రాఘవపాండవీయ కర్త పింగళిసూరన ‘కోవిదాను కంపాఘున బుద్ధిజూపెద జమత్కృతి మత్కృతి మత్కృతిత్వమున్’ అని చెప్పుకున్నా వినయంగా విరూపాక్షుని భవ్యాభవ్య తల్పాడ కింపుతో గ్రహింపమని ప్రార్థించాడు.

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి ఈ చమత్కారం శబ్ద సంబంధిగా గుర్తించి “నిజానికి 24 వేల శ్లోక రామాయణాన్ని, లక్ష గ్రంథమైన భారతాన్ని నాలుగాశ్వాసాల ప్రబంధంగా కుదించడానికి ఎంత మనస్సును శబ్దాన్ని కట్టుకుంటే సాధ్యమో అభిజ్ఞులు ఆలోచించగలరు. ఏది ఏమైనా ఆనాడది సాహసోపేతమైన అద్భుత కృత్యం. దాన్ని సాధించి సూరన సమర్థుడనిపించుకున్నాడు.” అని సూరనను ప్రశంసించాడు.

“వివిధ బహు ప్రయోగములు విశ్రుతమై విలసిల్లు లెస్సగా
గవులు పరీక్ష సేయుడిది కాదనబోకు డదెట్టులన్ననే
నవిరళ సాహితీ పరికరాంబుధి పారగుడన్చు ధాళియు
న్దవితి విచార సాధుగతి తథ్యము జేసిన దందుమీదటన్”

యాదవ రాఘవ పాండవీయకర్త వీరరాఘవుడు “శ్లేష చిత్రముఖ వైఖరులన్ రచనా ప్రపంచమందుల నెవరెట్లు సెప్పినను దోడనె సెప్పగ నేర్తు నట్టులన్” అని చెప్పుకున్నాడు. అందుకే ఆత్మ ప్రత్యయంతో కాదనబోకుడని విశ్వాసంతో చెప్పాడు.

**ఆరుద్ర చెప్పినట్టు ద్వ్యర్థి కావ్యాలెవరూ కథకోసం చదవరు. శబ్దార్థాల చమత్కారం కోసం, పాండిత్యం కోసం చదవాలి.** ఈ సందర్భంగా ఆచార్య పింగళి లక్ష్మీకాంతం “తెలుగు పదములలో శ్లేషను కల్పించుటలో (సూరన) ఈతడద్వితీయుడు” అన్నమాట గుర్తు చేసుకుని తెలుగు భాషా ప్రయోగాల కోసం రాఘవ పాండవీయాన్ని దాని ననుసరించిన యాదవ రాఘవ పాండవీయాన్ని చదవవలెను.

**ఆధార గ్రంథాలు :**

1. ఆరు యుగాల ఆంధ్రకవిత – ప్రబంధ శరత్తు ” ఆంధ్రసారస్వత పరిషత్తు – 1986

2. యాదవ రాఘవ పాండవీయం – చతుర్థాశ్వాసము –యువ భారతి – 1976

3. యాదవ రాఘవ పాండవీయం – అవతారిక – తెలుగు అకాడమీ – 1968

4. ఆంధ్ర సాహిత్య చరిత్ర – పింగళి సూరన – యువ భారతి – 1975

రచయిత– (శ్రీకాకుళం) గాయత్రి కాలేజ్ ఆఫ్ సైన్స్&మానేజ్‌మెంట్‌లో తెలుగు విభాగాధిపతి.

## మన్నం వెంకటరాయుడుగారికి
### తానా వారి
### గిడుగు వెంకటరామమూర్తి
## భాషాసేవాపురస్కారం



మనసు ఫౌండేషన్ మన్నం వెంకట రాయుడు గారికి ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) వారు తమ గిడుగు వెంకటరామ్మూర్తి భాషాసేవ పురస్కారాన్ని ప్రకటించిన సందర్భంలో వారికి అభినందనలు.

జీవితకాలం తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన గిడుగు రామమూర్తి పేరు మీద ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పురస్కారాన్ని అందజేయాలని తానా గతంలో నిర్ణయించింది. తెలుగు భాషా వికాసానికి, అభ్యున్నతికి విశేషంగా కృషి సల్పిన ప్రముఖులను ఈ పురస్కారంతో గౌరవించాలని తానా ఆశయం. ఈ పురస్కారాలు 2002 డిసెంబర్ నుంచి ప్రకటిస్తోంది. గతంలో ఈ పురస్కారాలను ఆచార్య చేకూరి రామారావు (2002), ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి (2004), సి. ధర్మారావు (2006), ఎబికె ప్రసాద్ (2008), స.వెం. రమేశ్ (2010), ఆచార్య పి.ఎస్. సుబ్రహ్మణ్యం (2012), ఆచార్య రవ్వా శ్రీహరి (2014), డా. సామల రమేష్ బాబు (2016), ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు (2019) లకు అందజేసింది.

2023 గానూ తెలుగు పుస్తకాల్ని స్కాన్ చేసి భద్రపరచడం మరియు సుప్రసిద్ధ రచయితల సమగ్ర సంకలనాలు వెలువరించడం ద్వారా తెలుగు భాషకు ఎనలేని సేవ చేస్తున్న మనసు ఫౌండేషన్ చైర్మన్ డా.మన్నం వెంకటరాయుడుకు అందజేయాలని నిర్ణయించింది.

టి.షర్మిలా ప్రతిమ
8074427397

# ఆధ్యాత్మిక రచనల అనువాదం - భాషా విశేషాలు
## (సంస్కృతంనుండి - తెలుగులోకి)

**భారతదేశం కర్మభూమిగా ప్రసిద్ధి చెందిన దేశం. ప్రాచీనకాలంనుండి నేటివరకు కవులు, పండితులు, రచయితలు, రచయిత్రులు రామాయణ, భారత, భాగవతంవంటి పురాణ, ఇతిహాసాలను అంశాలుగా స్వీకరించి తమదైన శైలిలో వివిధ ప్రక్రియల్లో అనుసృజన చేసి మహాకావ్యాలుగా మనముందుంచారు. అయితే చాలావరకు అవన్నీ ఆనాటి పండితులకే పరిమితమయ్యాయి. తర్వాతి కాలంలో రాజకీయ, పాలన, యుద్ధ, సైనిక వంటి వివిధ అవసరాలనిమిత్తం అనువాదాలు వాటి రకాలను గూర్చి వివిధ విజ్ఞానవేత్తలు, జిజ్ఞాసాపరులు రకరకాల నిర్వచనాలను, పద్ధతులను చర్చించారు. ఆధునిక పరికరాలు అందుబాటులోకి రావడం, అనేక శాస్త్రసాంకేతిక విషయాలు వంటివి అనువాద తీరుతెన్నులలో అనేకమార్పులు తెచ్చాయి. అయితే 15,16 వ శతాబ్దాలలో వచ్చిన పదసాహిత్యం సామాన్య మానవులకు చేరువై, వారిని ప్రభావితులను చేసి వారిలో మార్పుకు కారణమైంది. 16వ శతాబ్దంలో పెదతిరుమలాచార్యులు సామాన్యులకోసం సంస్కృతం నుండి తెలుగులోకి రాసిన శ్రీ భగవద్గీతను వ్యావహారిక తెలుగులో వచ్చిన తొలి వేదాంత గ్రంథంగా చెప్పవచ్చు. అటువంటి వీరి భగవద్గీత అనువాదంలోని పదాలు, పదబంధాలు, ఉపవాక్యాలు వంటి భాషా విశేషాలు సంస్కృతంనుండి తెలుగులోకి అనువాదమయ్యే క్రమంలో ఏవిధమైన పరిణామాలు చెందాయో వాటి తీరుతెన్నులను పరిశీలించడం ఈ వ్యాస ప్రధాన ఉద్దేశ్యం.**

పదసాహిత్యానికి పెద్దపీటవేసి అలతి అలతి పదాలతో శృంగార, ఆధ్యాత్మిక సంకీర్తనలతో భక్తితత్త్వాన్నినింపి సంకీర్తనాచార్యులుగా పేరుపొందిన అన్నమయ్య పెద్దకుమారుడు పెదతిరుమలాచార్యుడు. వీరుకూడా తండ్రిలాగే ఆధ్యాత్మిక, శృంగార సంకీర్తనలతోపాటు శతకాలు, రగడలు, దండకాలు వంటి ప్రక్రియల్లోనూ, శ్రీభగవద్గీతకు వ్యాఖ్యను అందించి సాహిత్యానికి అపారమైన సేవ చేశారు. శ్రీభగవద్గీతను స్పష్టం, సరళం, పటిష్టం అయిన వ్యావహారికవచనంలో ప్రతి భగవద్గీతాశ్లోకం తెలుగులోకి అనువాదం చేశారు. సంస్కృత గ్రంథాలకు తెలుగులో వ్యాఖ్యానాలు చేయడం తిరుమలాచార్యులకు పూర్వం ఉన్నట్లు కనిపించలేదు కనుక తెలుగు వాఙ్మయంలో తొలివ్యాఖ్యాత పెదతిరుమలాచార్యులేనని ఆచార్య రవ్వా శ్రీహరిగారు భావించారు. దీన్నిబట్టి వీరు రాసిన భగవద్గీతను తెలుగువాఙ్మయంలో తొలి వ్యాఖ్యానగ్రంథంగా, భగవద్గీతాపరంగా తొలి తెలుగుభగవద్గీతావ్యాఖ్యగా చెప్పవచ్చునని వీరే తెలియజేశారు. కవిత్రయం రాసిన ఆంధ్రమహాభారతం భీష్మపర్వంలో భగవద్గీతకు పూర్తి అనువాదం లేనందువల్ల పెదతిరుమలాచార్యుల భగవద్గీతను మొట్టమొదటి సంపూర్ణ తెలుగు భగవద్గీతగా చెప్పవచ్చు. అంతేకాదు తెలుగు వ్యావహారికభాషలో వచ్చిన మొదటి వేదాంత గ్రంథంగానూ చెప్పవచ్చు.

వ్యాసమహర్షి రాసిన సంస్కృత భగవద్గీతలోని పదాలకు పెదతిరుమలాచార్యుల భగవద్గీతానువాదంలో వచ్చిన సమానార్థక స్వరూపాన్ని పరిశీలించినప్పుడు 1. సంస్కృత పదాలకు తెలుగు పదాలు సమానార్థకాలుగా వచ్చినవి. 2. సంస్కృత పదాలకు సంస్కృత పదాలే సమానార్థకాలుగా వచ్చినవి. అనువాదంలో కన్పిస్తున్నాయి. వీటిని ఈ క్రింది విధంగా వింగడించవచ్చు.

1.సంస్కృత పదం - సంస్కృత పదం, సంస్కృత పదబంధం, సంస్కృత ఉపవాక్యం

2.సంస్కృత పదం - తెలుగు పదం, తెలుగు పదబంధం, తెలుగుఉపవాక్యం

3.సంస్కృత పదబంధం - తెలుగు పదం, తెలుగు పదబంధం, తెలుగుఉపవాక్యం ,

4.సంస్కృత పదబంధం - సంస్కృత పదం, సంస్కృత పదబంధం, సంస్కృత ఉపవాక్యం

**1.సంస్కృత పదం - సంస్కృత పదం**

అచలం = చలింపక(6-13), అపరాజితః = వోటమిలేని (1-17), నష్టః = నష్టమాయెను(4-2)

పరః = వుత్కృష్టుడని(13-23)

**సంస్కృత పదం - సంస్కృత పదబంధం**

భుంజతే = భోజనం చేశేవారు(3-13), ప్రసాదే = ఆ మనస్సు ప్రసన్నమైతేను (2-65)

కృతాంజలిః= అంజలి పట్టుకొని(11-35)చేతులు మొగిచి(11-14)

**సంస్కృత పదం - సంస్కృత ఉపవాక్యం**

అకర్మణః = నియతకర్మము విడిచిన జ్ఞానముకంటే(3-8), అనన్య = ఇతరదేవతలను కొలవక(9-22)

అంతరం = విశేషమును, వివేకమును కలిగి (13-35), క్రతుః = జ్యోతిష్టోమాది క్రతువులున్నూ (9-16)

గుణాన్ = సాత్విక, రాజస, తామసాలను (14-26), అద్రోహః = వకరికి ద్రోహం శాయకుండుట(16-3)

అశమః = ఇంద్రియాలను అణచలేకుండుట(14-12), అక్రోధః = ఒకరికి బాధకమైన కోపం మానుట(16-2)

**2.సంస్కృత పదం - తెలుగు పదం**

అతీతః = దాటినవాడు(14-21), అజానంతః = యెరుగక(13-26), అన్యత్ = యిటుగాకుండితేను(16-8)

అపరాజిత = వోటమిలేని(1-17),

**సంస్కృత పదం - తెలుగు పదబంధం**

అభిభవతి ఉత = వొచ్చికప్పుకొనును(1-40),అశేషతః = యించుకంతాను తప్పకుండాను (6-39)

అసు = అవుగాక యని (3-10) అయితేను(9-13),అహైతుకమ్ = తలచిన తలపుతోను(18-22)

**సంస్కృత పదం - తెలుగు ఉపవాక్యం**

అవాప్తవ్యం = ముందరనున్నూ పొందబడింది కాదు(3-22)

క్రోధః = పరుల పీడించే కోపమును బెంచుటను(16-4)

జ్ఞేయం = యితరమును యెరుగదగినదిన్నీ(13-17)
ప్రమాదః = పనులు చేసేవేళ యామారుచున్ను(14-13)
ప్రవృత్తిః = ఒకపని శాయ దొరకొని చంచలపడుట(14-12)

**3.సంస్కృత పదబంధం - సంస్కృత పదం**

అనంతరూపమ్ = అనంతుడవు(11-16), కర్మయోగరౌ కర్మము (3-7), జీవలోకేన= ప్రాణులలోనూ(15-7)
పరాంగతిమ్= పరమగతి(16-22)మోక్షం (13-29), సాత్త్విక ఉచ్యతే= సాత్వికుడు(18-26)

**సంస్కృత పదబంధం - సంస్కృత పదబంధం**

సమాయుక్తః = వాయువును ప్రేరేపించి(15-14), శస్త్రసంపాతే = ఆయుధ ప్రయోగకాలం (1-20)
సన్యాసయోగ = జ్ఞానయోగంతో కూడిన(9-28), కృతనిశ్చయః = నిశ్చయించుకొని లెమ్ము. (2-37)

**సంస్కృత పదబంధం - సంస్కృత ఉపవాక్యం**

అచింత్య అటువంటివాడు ఇటువంటివాడు అని చింతింపరానివాడు (2-25)
పరిజ్ఞాతా = ప్రయోజనం యెరిగేవాడు జ్ఞాత(18-18)
బ్రహ్మచర్యం = పరస్త్రీలయందు ఆశపడకుండుటను బ్రహ్మచర్యమున్నూ (17-14)
తేజః = దుర్జనులకు వోడక నిర్వహించుకొనుట(16-3)
ఆర్జవమ్ = మనోవాక్కాయకర్మలందున్నూ ఒక్కరీతిననే వుండుటను (17-14)
అభిమానః చ = కులము, విద్య గలవాడనని అభిమానంతో వుండుటను(16-4)
అశ్రౌషమద్భుతం = ఆశ్చర్యమైన యీ వాక్యమును వింటిని(18-74)

**4.సంస్కృత పదబంధం - తెలుగు పదం**

యదాయదాహి = యెప్పుడేనేమి(4-7), శ్రుతం కచ్చిత్ = వింటివా? (18-72), మే ప్రోక్తః = చెప్పితిని(16-6)

**సంస్కృత పదబంధం - తెలుగు పదబంధం**

స్వస్తి ఇతి ఉక్త్వా = మేలుగావలెనని (11-21), ఆగమపాయినః = వచ్చునూ పోవునూ (2-14)
జన్మధ్రువం = పుట్టుక తప్పదు(2-27), యావాన్ యశ్చాస్మి = నేను యెంతటివాడను? (18-55)
బహూన్ అవాచ్య వాదాంశ్చ= ఆడరాని మాటలను (2-36),
న లింపన్తి = నన్ను అంటవు(4-14)

**సంస్కృత పదబంధం - తెలుగుఉపవాక్యం**

న జాయతే = పుట్టుచున్నవాడున్నూ కాడు.పుట్టుక లేదు (2-20)
బహుదంష్ట్రా కరాలం = నానావిధాలైన కోరదవడలతోను(11-23)
సమచిత్తత్వం = ఒక్కతీరున ఉండుట(13-10),

**సామాన్య క్రియలు - సంశ్లిష్ట క్రియలుగా అనువాదం**

ఇచ్ఛసి = నిశ్చయించేవు (11-7), నివర్తన్తే = తిరుగుచుందును (9-3)
నిశ్చితాః = నిశ్చయించినవారై(16-11), ప్రవహన్నివ= నవ్వుచున్నవాడువలె (2-10)
తప్యన్తే = తపస్సు శేయుచున్ను(17-5)

**సామాన్య క్రియలు - సంయుక్త క్రియలుగా అనువాదం**

ద్రవంతి = పారిపోవు (11-36), కర్మణి = కోరిన పనులు (14-9), గౌరక్ష్య = పసుల నేలుట (18-44)
సంయమీ = మేలుకొని వుండును(2-69), భుంజతే = భోజనం చేశేవారు(3-13),
ప్రతిజానీహి = ప్రతిజ్ఞ శేయుము(9-31)

**సమాపక క్రియలు - అసమాపక క్రియలుగా అనువాదం**

ప్రవిశంతి = ప్రవేశించి(2-70), రమతే = రమించి (18-36)

**సామాన్య క్రియలు - ప్రేరణ క్రియలుగా అనువాదం**

ప్రేరణ క్రియలు (Causative Verbs):-

సకర్మక క్రియారూపానికి - ఇంచు ప్రత్యయం చేరి ప్రేరణార్థక క్రియలు ఏర్పడతాయి. ఉదాః రాయించు, ఏడిపించు, రప్పించు, తాగిపించు, కురిపించు, నడిపించు, మాట్లాడించు, కొట్టించు
భయావహః = భయము పుట్టించును(3-35) ,ప్రీయమాణాయ = ప్రియపడుచున్నటువంటి (10-1)
అభిధీయతే= అనిపించుకొనును(17-27) , వర్షం ఉత్సృజామి = వర్షం కురియించేవాడను (9-19)
అనువాదంలో ఒకే పదం అనేక సార్లు వచ్చినప్పుడు ఆయా సందర్భాలను అనుసరించి వివిధ అర్థాలతో అనుసరించడం పెదతిరుమలాచార్యులు అనువాద నైపుణ్యానికి నిదర్శనం. ఉదా.
జ్ఞానం = భక్తిరూపమైన విజ్ఞానమును(9-1), జ్ఞానం = జ్ఞానస్వరూపమైన(14-11)
జ్ఞానం = నాయందు జ్ఞానమును (7-2), జ్ఞానం= తా చేసే ప్రయోజనం యెరుగుట జ్ఞానం(18-18)
జ్ఞానం = పరతత్వము నెరగుటనే జ్ఞానమున్నూ(18-42) జ్ఞానం= యిప్పుడు చెప్పిన జ్ఞానమున్నూ (18-19)
జ్ఞాన = జ్ఞానమనగాను జ్ఞానం (ఆత్మ జ్ఞానం) (6-8)
త్రిభిః = రాజస,తామస, సాత్వికా అనే మూడింటచేత(7-13),
త్రిభిః = కామ,క్రోధ, లోభాలచాతను(16-22)

**ముగింపు:-**

ఈ విధంగా పెదతిరుమలాచార్యులు శ్రీభగవద్గీతను అనువదించడంలో మూలభాషలోని సంస్కృత పదాలకు లక్ష్యభాష అయిన తెలుగుకు తగినట్లు సాధ్యమైనంతవరకు దేశిపదాలు వాడుతూ, కొన్ని చోట్ల సంస్కృత పర్యాయపదాలు కూడా ఉపయోగించారు. ఈ క్రమంలో పదాలకు పదాలు మాత్రమే ఇవ్వక పదబంధాలు, ఉపవాక్యాలు ఉపయోగించి అనువదించడంద్వారా లక్ష్యభాష పాఠకులకు మూలార్థాన్ని సమగ్రంగా అందించడంలో సఫలీకృతులైనారు. అట్లే క్రియలను అనువదించేటప్పుడు సామాన్యక్రియలు సంయుక్త, సంశ్లిష్ట , ప్రేరణ క్రియలుగా అనువదించిన తీరును గమనించవచ్చు. అదేవిధంగా ఒక పదం అనేక సార్లు పునరావృతమైనప్పుడు ఆ పదానికిఉన్న ఒకే అర్థంకాకుండా, చెప్పదలచిన విషయ సందర్భాన్ననుసరించి ఆ పదాలకు వివిధ అర్థాలను ఇవ్వడంలోనే తిరుమలాచార్యుల అనువాద నైపుణ్యం, విషయంపట్ల ఉన్న అవగాహన, సంస్కృత, తెలుగు భాషల నిర్మాణరీతులను అర్థంచేసుకొన్నతీరు స్పష్టమౌతున్నాయి. వీరు తన ప్రతిభాపాటవాలతో అందించిన భగవద్గీత అనువాదం సూటిగా, స్పష్టంగా ఉంది. కాబట్టి వీరి అనువాదం తర్వాతి తరాలకు మార్గదర్శకమై ఉంటుందనడంలో ఎటువంటి సందేహంలేదు.

-రచయిత రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఐఐఐటి ఒంగోలులో తెలుగు అధ్యాపకులు




# చంద్రిక కథ

## అరవంలో వ్రాసిన అసంపూర్ణ నవలకు

## బంగోరె 'ముందుమాటలు'

(గత సంచిక తరువాయి)

అయితే, వీరేశలింగంగారు 1919లో మరణించింది మద్రాసు వేదవిలాస భవనంలో.(ఈ వేదవిలాస భవనం మద్రాసు మైలాపూర్లోనని శ్రీ ఆవుల సాంబశివరావుగారి అధ్వర్యంలో అచ్చయిన వీరేశలింగం స్మారక సంచిక (1963)లో పేర్కొనబడిందిగానీ, అది ఎగ్మూరు ప్రాంతంలోనిది). ఈ మరణానికి కొంచెం అటు ఇటుగా భారతిగారు వీరేశలింగంగార్ని మద్రాసులో కల్సివుంటారా అనుకునే దానికి కూడా ఆట్టే ఆస్కారంలేదు. భారతిగారు1918 నవంబరు 20 తేదీన పాండుచ్చేరి నుండి మద్రాసుకు తిరిగివచ్చినా దాదాపుగా 1920 వరకు కడయం ప్రాంతంలోనే వుండిపోయారు. 1920 డిసెంబరులో గానిమళ్ళీ'స్వదేశీమిత్రన్' చేరుకోలేదు. అయితే మధ్యలో 1919 మార్చిలో భారతిగారు మద్రాసులో రాజాజీ ఇంట గాంధీగార్ని కల్సినట్లు వొక దాఖలా వుంది. వీరేశలింగం గారు మద్రాసు వచ్చింది 1919 ఏప్రిల్ 21 తేదీన, మరణించింది 1919 మే 28న. ఈ మరణమాసన్నమైవున్న వీరేశలింగం గార్ని భారతిగారు మద్రాసులో చూసి వుంటారా?

అంతే కాదు ఇంతకంటే ముందు భారతిగారు 'స్వదేశీ మిత్రన్' లో పనిచేయడానికి 1904 నవంబరులో మద్రాసు వచ్చారు గదా. అప్పుడు వీరేశలింగంగారు మద్రాసులోనే వున్నారు మరి – ఇంకోనెలా రెణ్ణెల్లకల్లా మద్రాసుకు గుడ్‌బై చెప్పేసి రాజమండ్రికి వెళ్ళి స్థిరపడేదని పెట్టే బేడా సర్దుకుని సిద్ధమవుతున్నారు. ఈ వొకటి రెణ్ణెల్లవ్యవధిలోభారతిగారు వీరేశలింగంగార్ని కలిసివుండేదానికి అవకాశం లేకపోలేదు. స్వదేశీమిత్రన్' లో జర్నలిస్టు అయ్యాడు కాబట్టి ఏదైనా సభల్లో గిభల్లో భారతిగారు వీరేశలింగంగార్ని కల్సివుండొచ్చు. కనీసం దూరంనుండైనా చూచివుండొచ్చు. ఈ రెండు స్వల్పవ్యవధులను తీసేసి చూస్తే, భారతిగారు వీరేశలింగంగార్ని కనీసం చూచికూడా వుండేదానికి ఆస్కారం లేదేమో.

ఏ విషయమూ ఖచ్చితంగా చెప్పడానికి మనకు వాళ్ళ డైరీలు, లేఖలవంటివి సమగ్రమైన గట్టి దాఖలాలు లేవు. ఇటీవల మంజుశ్రీగారు సంకలనంచేసిన వీరేశలింగంగారి డైరీలు, లేఖలు (విశాలాంధ్ర ప్రచురణాలయం 1970 నవంబరు) గ్రంథంలో డైరీలకు సంబంధించి అన్ని సంవత్సరాల్లోనూ అన్ని పుటలూ లేవు. అందువల్ల ఏ విషయమూ చెప్పలేనిస్థితిలో వున్నాం. ఇక సుబ్రహ్మణ్యయ్యర్ గార్ని కథాపాత్రగా ఎన్నుకొన్నారంటే నేరుగా అతనికిందనే పనిచేసాడు భారతి.

వీరేశలింగంగారితో భారతికి పెద్ద పరిచయం వుండి వుండదనుకోడానికి ఈ 'చంద్రిక కథ' లోనే మనకొక చిన్న 'క్లూ' దొరుకుతుంది. నవల కొనసాగినంత వరకూ వీరేశలింగంగారి భార్యనుకూడా ఇందులో వొక ప్రముఖపాత్రగానే చిత్రించివున్నా ఆమెపేరు ఎక్కడా చెప్పలేదు. పేరెందుకు చెప్పలేదు? తెలియదు కాబట్టే చెప్పలేదు. పేరెందుకు తెలియదు? ఆయనతో ఆయనకుటుంబంతో అంత పరిచయం లేదు గాబట్టే తెలిసుండదు అని తీర్మానించుకోవడం తొందరపాటు కాదేమో.

**తెలుగువారి వర్ణాంతరవిందు భోజనంలో భారతి**

అయితే తెలుగువారితో భారతికి పరిచయం లేకపోలేదు. ఒక తెలుగువ్యక్తి 1906 సెప్టెంబరులో మద్రాసులో ఏర్పాటుచేసిన వొక 'వర్ణాంతరవిందు భోజనానికి' భారతిగారు హాజరైనట్లు ఆనాటి 'కృష్ణాపత్రిక 'లో వొక దాఖలా దొరికింది. 1906 సెప్టెంబరు 15వ తేదీ కృష్ణాపత్రిక 9వ పుటలో ఈ క్రింది వార్తాంశాన్ని పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది.

మనదేశమునందు లెక్కలేని వర్ణములుండి, యొకరికొకరికి నైకమత్యముచెడి, సంఘము చీలిపోవుచుండుటచే నైకమత్యము, సోదరభావము పుట్టించుటకుగాను సెప్టెంబరు నెల 2వ తేది చెన్నపురిలో పెద్ద విందు జరిగెను. దానికి కోకా అహోబిల నరసింహరావునాయుడుగారేను రూపాయల నొసంగి, సంవత్సరమున కొక సభయైన రావింప సమకట్టిన, ప్రతిసంవత్సర మిటులనే ఇచ్చుటకును అటుగాక శాశ్వతముగా మూలధనమును జేర్చునుద్దేశమున్న నూరు రూపాయల నిచ్చెదమనియు వాగ్దానము చేసిరి. లక్ష్మినరసు నాయుడుగారును, దేవిడాశీర్వాదముగారును, అన్నాజీరావుగారును, సుబ్రహ్మణ్యభారతిగారును డెబ్బదియేనుకంటె నధికముగ బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్ర, పంచమ, క్రైస్తవ, మహమ్మదీయాది జాతులవారు వచ్చిరి.

'ప్రొఫెసరు పోకల లక్ష్మీనరసు నాయుడుగా రగ్రాసనాధిపత్యము వహించి జాతిభేదం బొకింతైన మది నంటనీక యొండొరుల కనురాగమును జూపించుచు, లోకమునందెల్లరిని బ్రేమించి వారలయందు సహోదరభావముంచి. సత్యమార్గమునం

ప్రవర్తింపవలయుననియు, ఇట్టి సభ నొకటి రావించక మరి యేవిధంబునైనను అభివృద్ధి చెందమని యత్నించిన యది సాఫల్యము గానేరదనియు, సావకాశముగ బనులు నెరవేర్చెదమనునది మిగుల నింద్యమనియు, ఒక్కొక్క దును నిజశక్తికి జాలినంతసాహాయంబు జేసెనేని మహాయద్భుతకార్యముల జేయనగుననియు, ఇట్టి సభ లల్పమాత్రంబులైనను నొండొరులకుంగల ద్వేషంబును నివారించి వారియందనురాగము గలుగజేసి జనంబుల మనంబులు రంజిల్లజేయుననియు సెలవిచ్చిరి. నాయుడుగారి యాధిపత్యము క్రింద ప్రతి సంవత్సరము నొకసభ గావించుటకు నాఱుగురు కార్యనిర్వాహకుల నేర్పరచిరి. ఇవ్విధంబున సరససల్లాపముతోడ కాలముగడపి సంతోషభరితాత్ముడగుచు..' అని వుంది – (ఆఖరు రెండులైన్లు చిరిగిపోయి వున్నాయి)

తెలుగువాడైన కోకా అహోబిల నరసింహారావునాయుడుగా రేర్పాటుచేసిన ఈ వర్ధాంతరవిందు భోజనసభలో వీరేశలింగంగార్ని గూర్చి భారతిగారు కాస్త వివరంగా విని వుంటారా? ఈ కోకా అహోబిల నరసింహారావునాయుడు గారికీ – వీరేశలింగంగారు 1901 లో మద్రాసులో చిరంజీవమ్మతో వివాహంచేసిన పిఠాపురం 2వ దివాను కోకా వెంకటసుబ్బారావు నాయుడుగారికీ (వీరేశలింగంగారు జరిపించిన 33వ వివాహం) ఏమైనా బంధుత్వం వుందా? ఈ విందు భోజనాన్ని గూర్చి భారతిగారు తమిళ 'స్వదేశమిత్రన్' లో ఏమైనా రిపోర్టు వ్రాసారా? అందులో వీరేశలింగంగారి ప్రస్తావనేమైనా చేసారా? ఇవన్నీ పరిశోధించాల్సిన అంశాలు.

1908 లో తిరునల్వేలి ఇంగ్లీష్ కలెక్టరు 'ఆష్' ను అతివాదులు కాల్చి చంపినపుడు, దానిపై తెలుగు 'స్వరాజ్య' పత్రికలో గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారి సంపాదకీయాన్ని పురస్కరించుకుని 1909 జులైలో రాజద్రోహం నేరం మోపినపుడు ఈ కేసులో ఒక ముద్దాయైన పింగళి లక్ష్మీనారాయణగారు కూడా అరెస్టు తప్పించుకుని పాండుచ్చేరి వెళ్ళారు. అంతకుముందే అక్కడకు చేరుకుని వుండిన భారతితో ఈయన పరిచయం కల్పించుకున్నారా?

ఏమైనా భారతిగారు తన స్వీయజీవితంలో పరిచయంలేని (కనీసం అంతగా పరిచయంలేని) వీరేశలింగంగార్ని తన నవలలో ఒకపాత్రగా ఎన్నుకోడానికి తోడ్పడిన శక్తులేవి? వీరేశలింగంగార్ని తప్ప ఇంకొకర్ని ఎన్నుకొనడానికి వీలులేని పరిస్థితిగనుకనే ఆయన్ను ప్రస్తావించవల్సి వచ్చింది. దక్షిణ భారతదేశంలో విధవా వివాహాలవంటి సంఘ సంస్కరణ విషయాలన్నపుడు వీరేశలింగంగారి పేరు తప్పనిచ్చి ఇంకొకరిపేరు స్ఫురించని అప్రతిహతమైనస్థానాన్ని ఆయనకొక్కరికే దక్కింది గనుక, తన నవలలో విధవా వివాహం చేయించాల్సినపుడు వీరేశలింగంగారి ప్రస్తావన తేవడం మినహా భారతిగారికి వేరే దారిలేకపోయిందని అనుకోవల్సి వుంది. ఏమైతేనేం ఆధునిక తమిళమహాకవి అనదగిన సుబ్రహ్మణ్యభారతి అంతటి వానిచేత వొక నవలలో గౌరవనీయమైన పాత్రగా మలచబడిన విశేషగౌరవం తెలుగు మహాపురుషుడైన వీరేశలింగంగారికే దక్కింది.ఒకరకంగా తెలుగుజాతికే ఆ గౌరవం దక్కిందనుకొందాం.

**ఈ నవల రచనాకాలం**

భారతిగారు ఈ నవలను ఎప్పుడు వ్రాసినట్లు? ఎంతమందిని కనుక్కున్నా ఎన్ని పుస్తకాలు చదివినా స్పష్టంగా చెప్పినవారు లేరు. కథాప్రారంభమే – 1901 సంవత్సరంలో వేలాంగుడిలో వచ్చిన భూకంపంతో. 'ఆ బీభత్సమైన భూకంప తాండవం సమసిపోయి మూడేళ్ళయింది. 1904 సంవత్సరం కడవటి భాగంలో సుబ్రహ్మణ్యయ్యర్ బొంబాయి కాంగ్రెస్కు పోదల్చి దుస్తులు, తినుబండారాలు సర్దుకుంటుండినారుః – అని రెండో అధ్యాయంలో ప్రారంభవాక్యాలివి. అంటే ఈ నవలా రచన 1905 తర్వాతనే అయివుండాల. 1905 తర్వాత ఎప్పుడు? 1905 ముందన్నే రచించాడనుకుంటే 1921లో భారతి చనిపొయ్యేంత వరకూ ఈ రచనను మధ్యలోనే ఎందుకు ఆపేసిపెట్టాడు.పూర్తిచేయకుండా?

ఈ నవలలో కొంతభాగం స్వదేశమిత్రన్ పత్రికలో సీరియల్గా ఏమైనా వచ్చిందా? 'ఇందులోని కొంతభాగం జి.సుబ్రహ్మణ్యయ్యర్ గారి స్వదేశమిత్రన్ పత్రికలో అచ్చుపడింది' – అని డా? చల్లా రాధాకృష్ణశర్మగారి పరిచయవ్యాసంలో పేర్కొనివున్నారు.ఈ నవల ఆఖరులో వున్న పబ్లిషర్స్ నోట్లో తర్వాతవచ్చే కథాభాగానికి సంబంధించి తయారుచేసి పెట్టిపోయిన చిత్తుప్రతిని భారతిగారు స్వదేశమిత్రన్ మేనేజరుకు ఇచ్చిపోయినట్లున్న వాక్యాన్నిబట్టి అంతే అన్పించవచ్చుగానీ, ఇది శర్మగారు నిక్కచ్చిగా తేల్చుకుని చెప్పినమాటగా కనపళ్ళేదు. భారతిగారికి ప్రియమిత్రుడు, సన్నిహిత సహచరుడూ అయిన కీ.శే. వి.ఒ.చిదంబరం పిళ్ళైగారి కుమారుడు శ్రీ వి.ఒ.సి.సుబ్రహ్మణ్యన్ గార్ని ఇటీవల మద్రాసు యు.ఎస్.ఐ.ఎస్. కార్యాలయం తమిళభాగంలో కల్సినపుడు అడగ్గా – ఆయన స్వదేశమిత్రన్ పాత సంచికల ఫైళ్ళన్నిట్నీ తిరగేసి పరిశోధనచేసిన 'కుమారి మలర్' సంపాదకుడు శ్రీ వి.కె.చెట్టియార్కు ఫోన్చేసి కనుక్కొంటే స్వదేశమిత్రన్లో మాత్రం సీరియల్గా పడలేదని సమాధానమిచ్చినట్లు చెప్పారు. మరి ఇంకోపత్రికలో ఏమైనా మొదట సీరియల్గా పడిందా?

ఇటీవల పక్షం రోజులక్రితం విశాఖపట్నంలో భారతి బైయాగ్రఫర్ శ్రీమతి ప్రేమానందకుమార్ గార్ని కల్సి విచారించగా – ఈ నవలను ఆయన పాండుచ్చేరిలో వుండగా వ్రాసినట్లుగా వా.రా. గారు ఎక్కడో పేర్కొనివున్నట్లు చెప్పింది. పాండుచ్చేరిలో వుండగా వ్రాసినట్లు అంటే 1908–1918 మధ్యకాలంలో ఎప్పుడైనా వుండొచ్చునన్నమాట.నా కెందుకో ఈ రచనాకాలం సరియైనదై వుండకపోవచ్చునని తోస్తున్నది. వా.రా. గారు వొకవేళ అట్లా వ్రాసేవున్నా – శ్రీ పి.మహదేవన్ గారు భారతిపై వ్రాసిన ఆంగ్లగ్రంథంలో

- ....for such details as dates and sequences Va.Ra.shows an airy disregard which though amusing in one sense is tantalising to the lover of chronology.. అని పేర్కొనబట్టి వా.రా ఇచ్చిన తేదీలను మనం అంతగా ఖాతరుచేయాల్సిన పన్లేదేమో.

నే నూహించడంలో భారతిగారు చనిపోయేదానికి కొన్ని నెలలముందు, అంటే, 1920 కొంచెం అటు ఇటుగా ఈ నవలను ప్రారంభించి కొంతవరకు సాగించి అట్టే పెట్టేసి వుంటారని తోస్తున్నది. ఈ వుహకు కొన్ని కారణాలు లేకపోలేదు. 1916లో జి.సుబ్రహ్మణ్యయ్యర్ మరణించిన మూడు సంవత్సరాలకు 1919 మే లో వీరేశలింగంగారు అస్తమించారు. ఈ మరణాన్ని పురస్కరించుకుని

అప్పటి ఇంగ్లీషు, తమిళ పత్రికల్లో వీరేశలింగంగారిపై obituary రచనలు కొన్ని వచ్చి వుండొచ్చు. సంతాపసభలు, సమావేశాలు కొన్ని మద్రాసులో జరిగుండొచ్చు. మిత్రులుకూడా వార్ని గూర్చి వారి గొప్పదనాన్ని గూర్చి చెప్పి వుండొచ్చు. ఇవి చదివి వినీ భారతిగారిలో ఈ రకం నవల వ్రాయాలనే ప్రేరణ కల్గివుండొచ్చు. అంతేగాక ఆ వ్యక్తులు బ్రతికుండగానే కన్నా చనిపోయిన తర్వాతనే వాళ్ళను పాత్రలుగా పరిచయం చేయాలనే ఆలోచన సహజంగా వుంటుంది. అప్పుడు ఈ నవల రచనకు వుపక్రమించి కొంత దూరందాకా వ్రాసిన తర్వాత కొద్దికాలానికే భారతిగారు మద్రాసు దేవళంలో ఏనుగవాతబడి ఆరోగ్యం దెబ్బతిని హఠాత్తుగా మరణించారు గనుక అక్కడితో ఇది అసంపూర్తిగా మిగిలిపోయి వుండొచ్చు. భారతిగారు చనిపోయినతర్వాత పదేళ్ళకు 1930 ప్రాంతంలో ఆ వ్రాత ప్రతుల్ని బయటకుతీసి గ్రంథరూపంలో వెలువర్చి వుండొచ్చు. ఇదీ నా వూహ. తప్పుగావచ్చు, వొప్పూ కావచ్చు.

పోతే, రమణారెడ్డిగారు తన పీఠికలో వొక చిన్న 'పాయింట్' లేవదీశారు. వీరేశలింగంగారు 1897 నుండి 1905 దాకా వున్నది మద్రాసు వెల్లాలవీధి (పరశువాకం)లో అయితే, భారతిగారు ఎళుంబూరు (ఎగ్మూరు) అని ఎందుకు పేర్కొనవల్సి వచ్చింది – అనే అంశంపై కొంత చర్చ చేసారు. ఈ విషయమై కూడా నే నీ విధంగా వూహిస్తున్నాను. భారతిగారు 'ఎగ్మూరు' అని ఎందుకు పేర్కొనవల్సి వచ్చిందంటే – 1919లో వీరేశలింగంగారు మరణించింది మద్రాసు ఎగ్మూరులోని వేదవిలాస భవనంలో మరణ మప్పటి ఈ ఎగ్మూరు భవనమే వీరేశలింగంగారి మద్రాసు నివాసస్థానమని ఆ మందట్లో నవల వ్రాసిన భారతిగారు పొరపాటు పడివుండొచ్చుననడానికి వీలుంటుంది. లేకుంటే ఎగ్మూరని భారతిగారు ఎందుకు పేర్కొనవల్సి వచ్చింది? ఎగ్మూరు – పరశువాకానికి పెద్ద దూరమేమీకాదు కాబట్టి అప్పటి మద్రాసు నగరాన్ని దృష్టిలో పెట్టుకున్నపుడు అదొక పెద్ద తేడాగా భావించుకోనక్కర్లేదని సర్ది చెప్పుకోవల్సిన అవసరంలేదు. –ఎందుకంటే వీరేశలింగంగారే తన స్వీయచరిత్రలో ఎగ్మూరు, పరశువాకం అని రెండూ వేరువేరుగా పేర్కొనివున్నారు. ఏమైనా ప్రత్యక్ష సాక్ష్యాలు కరువైనపుడు ఇట్లాంటి వూహాపోహలే మనకు శరణ్యం మరి. భవిష్యత్తులో జరిగే పరిశోధనల్లో ఈ విషయాలు తేటతెల్లం కావల్సివుంది.

**వర్ణాంతర వివాహాలు – వీరేశలింగంగారి దృక్పథం**

ఈ విషయమై పెద్ద పరిశోధనే సాగవల్సి వుందేమో ననిపిస్తున్నది. చంద్రిక కథ నవలలో భారతిగారు వీరేశలింగంగార్ని ఈ పరంగా కాస్త సంప్రదాయవాది (PURITAN) గానే చిత్రించారు. నవలలో వీరేశలింగంగారి చేత (గోపాలయ్యంగార్ విశాలాక్షిని గాక పనిమనిషిని పెండ్లి చేసుకోబోయేముందు) చెప్పించిన సంభాషణలు ఈ ప్రశ్నకు తావు కల్గిస్తున్నాయి. తన నిజజీవితంలో అన్ని అభ్యుదయ ఆధునిక సంస్కరణ భావాలుకలిగి అన్ని విధవావివాహాలు, స్త్రీ జనోద్ధరణాది కార్యక్రమాలను చేపట్టి మహావుద్యమశీలిగా విరాణ్మూర్తిగా భాసించే వీరేశలింగంగారు వర్ణాంతర వివాహాలపట్ల ఏయే భావాలు కలిగివుణ్ణారనేది మనకిక్కడ చర్చనీయాంశం.

ఆరేళ్ళక్రితం 'వీరేశలింగం – సంఘ సంస్కరణ' అనే విషయంపై అమెరికా విస్కాన్సన్ యూనివర్సిటీవారిక్రింద జాన్ లియొనార్డ్ అనే అమెరికన్ యువకుడు పిహెచ్.డి. చేస్తూ నెల్లూరు వర్ధమాన సమాజం లైబ్రరీలోని కొన్ని పాత పత్రికలు గ్రంథాలను పరిశీలించేందుకై వచ్చినపుడు నాకు పరిచయమైనారు. ఆయన నెల్లూరులో తన పరిశోధన ముగించుకుని వెళ్ళేముందు అడిగాను. 'ఇంతకూ వీరేశలింగంగారిపై మీరు పరిశోధించినంతమటుకూ ఏమంటారో చెప్పలేదు' అని ప్రశ్నించగా వొకమాటన్నట్లు జ్ఞాపకం. 'ఆయన చేసిన విధవా వివాహాలన్నీ ముఖ్యంగా కులాన్ని పాటించి చేసిన వివాహాలుగానే వున్నాయి. అంటే బ్రాహ్మలమ్మాయికి బ్రాహ్మలబ్బాయి, నాయుళ్ళబ్బాయికి నాయుళ్ళమ్మాయి, వైశ్యులమ్మాయికి వైశ్యులబ్బాయి – ఈ ధోరణి వివాహాలే చేసారు తప్ప, ఇంకొక్క అడుగు ముందుకెళ్ళి కులాంతర వర్ణాంతర వివాహాలు కూడా ఎందుకు జరిపించలేదా అనే విషయాన్ని మరికొంచెం లోతుగా తరచిచూడాల' – అని అనిపిస్తున్నదంటూ 'ఇంతకూ ఈ విషయమై మీరేమంటారు?'అని నన్ను ఎదురుప్రశ్న వేసారు.

అప్పుడు నే నన్నాను: 'ఈ రోజుల్లో మనం ఈ ప్రశ్న వేయగలగొచ్చుగానీ ఆ రోజుల్లో ఆయన అవి జరిపించడమే గొప్ప, తన వుద్యమాన్ని ఆ మేరకు కేంద్రీకృతం చేసుకుని కృషిచేయడమే వొక మహా విషయం. ప్రధానంగా వీరేశలింగంగారు వొక Brahminical reformer అని మనం ఈనాడు అంచనాకట్టి ఆయన విస్తారమైన వుద్యమ పరిధిని, సంకుచితపర్చి విలువకట్టడం వుచితం కాదు. బ్రాహ్మణులే సమాజంలో వొక ప్రధానమైన, కీలకమైన వర్ణస్తులుగా వుండిన రోజులవి, జనంలో చదువుకున్నవారు,వుద్యోగాల్లో వున్నవారు 100 కి 5, 10 శాతంకంటే బహుశా ఎక్కువలేని రోజులవి. ఈ 5.10 శాతం వారిలో కూడా ముప్పాతిక మువ్వీసం బ్రాహ్మణులుగానే వుంటూ వచ్చిన రోజులు గాబట్టి ఆ రోజుల్లో వీరేశలింగంగారు – అట్నుంచి నరుక్కురావాలని గిరీశం అన్నట్లు – తన వుద్యమాన్ని ఆ మేరకు జయప్రదంగా నిర్వహించగలగడం ఉదాత్తమైన విషయం గదా' – అన్నాను.

అప్పుడేమో ఆ మాట అన్నానుగానీ అది నాకే అంత సంతృప్తిగా అన్పించలేదు.మూడేళ్ళకు ఈ నవల నా ఎదానపడి, భారతిగారు వీరేశలింగంగారిచేత వుద్దేశ్యపూర్వకంగా నైతేనేమి, యాదృచ్ఛికంగా నైతేనేమి చెప్పించిన సంభాషణలు, ఆ రూపంగా వీరేశలింగంగారి వొక బ్రాహ్మణసంస్కర్తగాను, వొక సంప్రదాయకమైన 'స్నాబ్' గాను చిత్రించినవిధం చూచి నాలో కొత్త ఆలోచనలు రేకెత్తాయి. వర్ణాంతర వివాహాలపట్ల వీరేశలింగంగారి అభిప్రాయాలేమై వుంటాయి – అనే విషయంపై కొన్ని సందేహాలు బుర్రలో జొరబడ్డం ప్రారంభించాయి. ఈ సందేహం కల్గడానికి ఇంకో బలవత్తరమైన కారణం లేకపోలేదు. వీరేశలింగంగారు నిజానికి వొక చరిత్రాత్మకమైన వర్ణాంతర, రాష్ట్రాంతరవివాహాన్ని 1898లో తను మద్రాసులో వుండగానే తన సొంత చేతులమీదుగా జరిపించినపుడు దాని విషయమై తన స్వీయచరిత్రలో పేర్కొనకపోవడం అ సందేహాన్ని మరింత బలపర్చింది

...... తరువాయి వచ్చే సంచికలో

మధురాంతకం నరేంద్ర
9866243659

# అద్దంకి పద్యశాసనమేంచెప్తోంది?



**తెలుగులో మొదటి పద్యశాసనం ఒంగోలు జిల్లాలోని అద్దంకిలో దొరికిందని చాలా సంవత్సరాల క్రితం చదివినప్పటి నుంచీ ఆ వూరిని చూడాలనే కోరిక వెంటాడుతూనే వుంది. దాదాపు దశాబ్దం క్రితం కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్లైగారనే రచయిత ‘బోయకొట్టములు పండ్రెండు’ ఆనే నవల రాశారు. అది అద్దంకిలో దొరికిన పండరంగని శాసనం ఆధారంగా, కొంత చారిత్రిక భూమికతో రాసిన కల్పనాత్మక రచన. అందులో ఆయన అలనాటి అద్దంకిని గురించీ, అద్దంకి నుంచి కనపడే పెద్ద కొండపైనుండే పాతకాలపు ఆలయాన్ని గురించీ రాశారు. ఆ రచన చదివినప్పటినుంచీ అద్దంకిని చూడాలనే కోరిక మొదలయ్యింది. ఆయితే తీరా అద్దంకికి వెళ్ళాకగానీ, వూహకు, నిజానికీ మధ్య తేడా యేమిటో తెలియలేదు.**

అద్దంకిలో చాలా కాలంగా వుంటున్న గాడేపల్లి దివాకర దత్ అనే మిత్రుడు ‘సృజన’ అనే సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో వాళ్ల నాన్నగారు గాడేపల్లి సీతారామమూర్తిగారి పేరుపైన యిస్తున్న సాహిత్య పురస్కారసభకు ఆహ్వానించడంతో చివరకు, రెండు వారాల క్రితం అద్దంకికి వెళ్లడం సాధ్యమయింది. వేసవి తగ్గాక సభను నిర్వహించుకుందామని అనుకున్నారు గానీ, జూన్ మొదటి వారంలో అద్దంకిలో ఎండలు మండిపోతూనే వున్నాయి. కొళాయిల్లో నీళ్ళు చర్మంపైన బొబ్బలు తేలేటంత వేడిగా వస్తున్నాయి. అయితే అంతటి ఎండల్లోనూ అద్దంకి పౌరుల సాహిత్యాభిలాష మాత్రం ముచ్చటగొల్పింది.

మధ్యాహ్నం వొంగోలు నుంచే అద్దంకికి ప్రయాణం చేస్తున్నప్పుడు కూడా వెయ్యేళ్లక్రితపు తెలుగు సాహితీ సంస్కృతుల జాడలేవయినా కనబడుతాయాఅని జాగ్రత్తగా గమనిస్తూనే వున్నాను. రాష్ట్రమంతా కొత్తగా వేస్తున్న విశాలమైన రహదారులు ‘రహదారులు నాగరికతను సూచించును’ అనే పాత జాతీయాన్ని గుర్తుచేస్తూనే, రహదారుల్ని విస్తరిస్తున్న క్రమంలో ఇరువైపులా కూలిపోయిన పెనువృక్షాల అవశేషాల్ని జాలిగా చూపిస్తూనే వున్నాయి. చెట్లు కోల్పోయిన రహదారులూ, పల్లెలూ, పట్టణాలూ యెందుకో యెడారుల్లోని వూర్లను జ్ఞాపకం చేస్తున్నాయి. అద్దంకి పట్టణపు ముఖ్యరహదారుల్లోనూ పచ్చని చెట్లు కనబడలేదు.

సాయంత్రం ఆరుగంటలకంతా సభ ప్రారంభమవుతుందన్నారు. ప్రధాన రహదారి పక్కనే కాళికా సమేత కమలేశ్వర స్వామి గుడిలోనే సృజన సాహితీ సంస్థ వాళ్ల వేదిక వుందన్నారు. అయితే వేదికలోకి వెళ్లడానికి ముందే, ‘యిక్కడ కాస్సేపాగుదాం. యిక్కడో ముఖ్యమైన పని వుంది’ అన్నారు దివాకరదత్. ఆయన అగమన్నచోట, రహదారికీ, గుడికీ మధ్యలో యెత్తయిన వేదికపైన రెండు పెద్ద సిమెంటు చప్టాలున్నాయి. వొకదానిపైన అద్దంకి శాసనపు ప్రతికృతీ, యింకోదానిపైన ఎర్రాప్రగడ విగ్రహమూ వున్నాయి. ఆ సభలకు ముఖ్య అతిధులమన్న హోదాతో ఆరెండింటికీ పూలమాలలు వేసే అవకాశం నాకూ, మిత్రుడు పేట శ్రీనివాసులు రెడ్డి గారికీ దొరికింది.

యెన్నాళ్లుగానో చూడాలనుకుంటున్న పద్యశాసనాన్ని తొలిసారిగా చూడ్డంతోనే వొళ్లు పులకరించింది. అద్దంకి దగ్గర పొలంలో దొరికిన యీ రాతి శాసనం పైభాగం పగిలిపోవడంతో శాసనంలోని మొదటి రెండు పంక్తుల్లోని చాలా భాగం పోయింది. దీనిని మొదట్లో పరిశీలించి కాలనిర్ణయం చేసినవారు జయంతి రామయ్య పంతులుగారు. విపులంగా విశ్లేషించిన వారు మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు. ఆ శాసనంలో వున్నది పద్యమని మొదట గుర్తించినవారు కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు. అది తరువోజ అనే చందస్సుకు చెందిన పద్యమని క్రమంగా తెలిసివచ్చింది.

అద్దంకిలో దొరికినది మొదటి శాసనమైతే, రెండోది కందుకూరులోనూ, మూడోది ధర్మవరంలోనూ దొరికాయి. ఒకప్పటి ప్రకాశం జిల్లాకి చెందిన యీ మూడు వూర్లలోని శాసనాలను వేయించనవాడు పండరంగడు అనే గుణగ విజయాదిత్యుని సేనాని. కందుకూరు, ధర్మవరం శాసనాల్లోనివి సీసపద్యాలు.

1905లో అప్పటి బ్రిటిషు ప్రభుత్వ వుద్యోగులైన అలెన్ బటర్‌వర్త్, వేణుగోపాల శెట్టి గార్లు సేకరించిన వందల శాసనాల్లో క్రీ.శ 848 నాటి అద్దంకి శాసనం గూడా ఒకటి. 1922లో ఆ శాసనం మదరాసు మ్యూజియంను చేరిపోయింది. 1923లో కొమర్రాజు గారి దృష్టి ఆ శాసనంపై పడటంతో దాన్ని గురించి ప్రపంచానికి తెలిసి వచ్చింది. పదిహేనేళ్ల క్రితం దివాకరదత్ గారు దాన్ని వెతుక్కుంటూ మదరాసు మ్యూజియం కెళ్లారు. అక్కడి క్యూరేటర్ మొదట్లో తెల్లముఖమేశారు గానీ, వివరాలు తెలిశాక, అసలు శాసనాన్ని వెదికి పట్టి దత్ గారికి చూపెట్టారు. తరువాత దత్ గారు సృజన సాహితీ సంస్థ సభ్యుల సహకారంతో దానికో ప్రతికృతిని తయారుచేసి 2006లో అద్దంకి నగరంలో దాన్ని ప్రతిష్టింపజేశారు. అలా ఆ శాసనం తిరిగి తన జన్మభూమిని చేరింది. అదే ప్రాంతానికి చెందిన ఎర్రాప్రగ్గడ విగ్రహాన్ని గూడా తయారుచేయించి పక్కనే ప్రతిష్టించారు.

ప్రబంధపరమేశ్వరుడని ప్రసిద్ధి చెందిన ఎర్రాప్రగ్గడ విగ్రహం కింద ఆయన సరస్వతీదేవిని గురించి రాసిన పద్యాన్ని

చెక్కించారు.'అంబ నవాంబు జోజ్వల కరాంబుజ శారద చంద్రచంద్రికా
డంబర చారుమూర్తి! ప్రకటస్ఫుట భూషణరత్నరోచితచిరా
చుంబిత దిగ్విభాగ! శ్రుతమూర్తి వివిక్త నిజప్రభావ! భా
వాంబర వీథి విశ్రుత విహారి! నను గృపజూడు భారతీ'

ఎర్రనగారి యీ పద్యాన్ని పోతన యథాతథంగా తన భాగవతంలో చేర్చుకుని ఆ మహాకవికి గురుపీఠాన్నిచ్చి గౌరవించాడని కొందరు భావిస్తారు. ఎర్రనను తలచుకున్నాక, సరస్వతినీ పూజించుకోవాలని సృజనసాహితీ సంస్థ వాళ్ళు ఆలయ ముఖద్వారం దగ్గర సరస్వతి విగ్రహాన్నీ ప్రతిష్టించుకున్నారు. వేదిక దగ్గర ప్రత్యేకమైన అలమారాలో ఎర్రన రచనల్ని గూడా సేకరించి పెట్టారు.

**విదేశాల్లో, ముఖ్యంగా యింగ్లాండు, అమెరికాలకు వెళ్లినప్పుడు, ప్రతి ప్రముఖ రచయిత యింటినీ మ్యూజియంగా మార్చడం గమనించవచ్చు. ఆయా మ్యూజియాల్లో ఆ రచయితల రచనల కొత్త ముద్రణల్ని గూడా ప్రదర్శిస్తారు. అంత గొప్పగా చేయకపోవచ్చుగానీ అద్దంకి సాహితీమిత్రులు ఎర్రనకూ, ఆయన రచనలకూ ఆలా చిన్నమ్యూజియం లాంటిది తయారుచేయడం చాలా సంతోషాన్నిచ్చింది. నెల్లూరులో తిక్కనకామాత్రం గౌరవం గూడా లేదన్న విషయం గుర్తుకొచ్చి బాధ కూడా కలుగుతుంది.**

అద్దంకిలో చాలా మంది పద్యకవులుండడం కూడా యిలాంటి సాహిత్య నాగరికతకు కారణం కావచ్చు. చాలా పద్యకావ్యాల్ని రాసిన గాడేపల్లి సీతారామమూర్తిని అద్దంకి సాహిత్యాభిమానులు అభినవ సూరన అని పిలుచుకుంటారు. సీతారామమూర్తిగారి తమ్ముడు గాడేపల్లి కక్కుటేశ్వరరావుగారు గూడా ప్రసిద్ధ పద్యకవే! అచటపుట్టిన చివురు కొమ్మయిన చేవే' అన్నట్టుగా అద్దంకిలో డి.వి.ఎం.సత్యనారాయణ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి వంటి పద్యకవులు చాలా మంది కనబడతారు.

యింతకూ సృజన సాహితీ సంస్థ స్థాపకుల్లో ముఖ్యుడూ, అధ్యక్షుడూ అయిన భూసురుపల్లి వెంకటేశ్వర్లు గారిది గూడా అద్దంకి దగ్గరలోని మాగ్రామమే స్వగ్రామమని తెలిసింది. అయితే గాడేపల్లి దివాకరదత్ గారిది అద్దంకి స్వగ్రామం కాదని తెలిశాకే నాకాశ్చర్యం కలిగింది. బ్యాంకు వుద్యోగిగా మూడు దశాబ్దాల క్రితం



ఆవూరికి చేరారాయన. అంతవరకూ జిల్లా జడ్జిగా వుద్యోగం చేసన్తావున్నా గారేపల్లి సీతారామమూర్తి గారు చిత్తూరు, తిరుపతిలతో సహా చాలా వూర్లలో ఉద్యోగం చేశాక పదవీ విరమణ తర్వాత తన చిన్నకొడుకు దివాకర దత్ దగ్గరకొచ్చి దాదాపు మూడు దశాబ్దాలు అద్దంకిలోనే వుండిపోయారు. సృజన సాహితీ సంస్థను స్థాపించి, అక్కడే చాలా కావ్యాలు రాసి, అక్కడే కన్నుమూశారు.

అద్దంకిని స్వగ్రామంగా మార్చుకున్న దివాకరదత్ పండరంగని పద్యశాసనం గురించిన ప్రముఖుల రచనలనూ, ఎర్రాప్రగ్గడపైన సాహిత్య వ్యాసాలనూ సంకలనం చేసి తన వంతు బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించారు.రెండవ రోజున దివాకర్ దత్ గారు మమ్మల్ని ధర్మవరం తీసుకెళ్ళారు. అక్కడ దొరికిన శాసనానికి కూడా ప్రతికృతిని చేయించి, ఆవూర్లోని ఆలయ సమీపంలో ప్రతిష్టింపజేశారు. క్రీ.శ. 897 కు చెందిన యీ శాసనం చాలా ముఖ్యమైనది. ఆ శాసనానికి కిలోమీటరు దూరంలో పొలాల మధ్య ప్రాచీన శివాలయముంది. చాలా చారిత్రిక ప్రాముఖ్యత వున్న యీ శివాలయం యిప్పుడు కూడా శిథిలాలయంగానే వుంది. చుట్టూ పాత శివలింగాలు, పానవట్టాలు యెక్కడ పడితే అక్కడ పడివున్నాయి. మేము వెళ్లేసరికి అక్కడోపెద్ద గడ్డికోసే ట్రాక్టరుకు పూజలు చేయిస్తున్నారు.

సరిగా పన్నెండేళ్లక్రితం అదే గుడిని చూసిన మిత్రుడు పేటశ్రీ, అప్పుడక్కడ పూజలేవీ లేవని, ఆలయమంతా పిచ్చిమొక్కలుండేవనీ చెప్పారు. అయితే పక్కగ్రామంలోని పూజారొకాయన వచ్చి దానికిప్పుడు పూజలు మొదలుపెట్టారు. దాదాపు యేడడుగుల యెత్తు మాత్రమే వుంది. పైన గోపురం గూడాలేని ఆ చారిత్రిక ఆవశేషానికి భక్తి పేరుతో యిప్పుడు సిమెంటు పూతలు, యినప తలుపులూ అమర్చి, చారిత్రక సాక్ష్యాల్ని లేకుండా చేస్తున్నారని భయమేసింది. అంతేగాదు, మేము తిరిగొస్తుండగా, ఆ పూజారిగారు కేకేసి పిలిచి, ఆలయ ద్వారం కప్పులోని బొరకను చూపించి 'సుబ్రమణ్యస్వామి దర్శనం చేసుకోండి' అన్నారు వుదారంగా. అక్కడో నాగుపాము తలమాత్రం పైకి పెట్టుకుని చూస్తోంది. చారిత్రక కట్టడాలను భక్తిపేరుతో, పూజల పేరుతో కాపాడుతున్నామో, పాడుచేస్తున్నామో గమనించవలసిన అవసరం చాలా వుంది. యిటీవల కుంభకోణం దగ్గరి ఐరావతేశ్వరి ఆలయానికి వెళ్లినప్పుడు గూడా యిలాంటి అనుభవమే యెదురయ్యింది. అది ప్రపంచ ప్రసిద్ధ కట్టడాల జాబితాలోకెక్కిన గొప్ప చారిత్రిక కట్టడం. అక్కడి గర్భగుడిలోని శివలింగాన్ని చూసినప్పుడు అభిషేకాలు, పూజలు యిటీవలే మొదలయ్యాయని తెలిసిపోతుంది. చారిత్రక ప్రదేశాల సందర్శకులకూ, భక్తులకూ మధ్య చాలా తేడా వుంటుంది. భక్తులు అన్ని స్థంభాలకూ, విగ్రహాలకూ పూజలు, అభిషేకాలూ చేసి ఆకృతులను మార్చేస్తారు. యీ క్రమంలో చారిత్రక అవశేషాల అసలు రూపాలు, సాక్ష్యాలూ కనుమరుగయ్యే ప్రమాదముంది. ధర్మవరం లోని ఆ చిన్న శివాలయానికుండే చారిత్రక ప్రాముఖ్యతను పరిశోధించాల్సిన అవసరముంది. యీలోగా ఆ చారిత్రక సాక్ష్యాల్ని పోగొట్టుకోకుండా కాపాడుకోగలగాలి.

మన దేశంలో, మన రాష్ట్రంలో అడుగడుగునా చారిత్రక విశేషాలున్నాయి. వాటిని కాపాడుకోవడంలో మనంతగా వెనుకబడిన వాళ్లు యెవరూ వుండరు. చరిత్రను కాపాడుకోవడంలో అద్దంకి సృజన సాహితీ సంస్థ కృషిని అభినందించి తీరాలి. ప్రభుత్వాల్లో వుండే చారిత్రక పర్యాటకశాఖల అధికారులూ, మంత్రిపుంగవులూ తమ దగ్గరుండే ప్రజాధనాన్ని సద్వినియోగం చేసినప్పుడే మనం చరిత్రహీనులంగాకుండా, నాగరికులమని నిరూపించుకోగలుగుతాం.

– రచయిత ప్రముఖ కథా,నవలా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత

పి. శివరామకృష్ణ 'శక్తి
94414 27977

# ఉద్యోగ పర్వాలు, కథా కాలక్షేపాలు.

'బ్రిటిష్ వలసవాద విద్యావిధానంలో వృత్తివిద్యకు ప్రాధాన్యం లేదు. లోకజ్ఞాన ప్రాధాన్యం లేదు. అది ప్రధానంగా ఉద్యోగాల విద్య. వ్యక్తి వాదాన్ని పెంచే విద్య: జాతీయోద్యమ లక్ష్యాలలో ఒకటైన జాతీయవిద్యకు ఒక దృఢమైన ఆర్థిక పునాది లేదు. మొత్తంమీద విద్య ప్రజా జీవనానికి అనుగుణంగా లేదు. పుస్తకజ్ఞానం దారి పుస్తక జ్ఞానిదే. అనుభవ జ్ఞానం దారి అనుభవ జ్ఞానినిదే... ఈ ఇంగ్లీష్ చదువుద్వారా ఉద్యోగవే పరమావధిగా ఎంచుకున్న వేతనశర్మలు, కళ వ్యాపారం మారే దశలో పుట్టుకొచ్చిన కొత్తరకం వృత్తి, ఔత్సాహిక కళాకారుల పెత్తనం పెరిగింది




'కొడవటిగంటి కుటుంబరావు (కొకు) 'చదువు' నవల భూమికలో ఆ నవల కథాకాలం 1940 నాటి పరిస్థితులను, ఇటీవల స్వర్గస్తులైన కేతు విశ్వనాథరెడ్డి వివరిస్తారు. (విశాలాంధ్ర ప్రచురణాలయం 1982 పుట ix)

చదువులు, సాహిత్యం, సినిమాలు వ్యక్తివాదాన్ని పెంచి పోషిస్తూ వికృతరూపం దాల్చిన నేటితరుణంలో, తరువాత కొకు. కు ఎదురైన పరిణామాలు ఆయన మాటలలోనే తెలుసుకోటం అవసరం. 'సాహిత్యం నుంచి విప్లవం పుట్టదు. సాహిత్యమూ జీవితమూ కూడా జీవితం అట్టడుగున ఉన్న ప్రజలనుంచి పుడతాయి. ఈ రెండూ కలిసే కేంద్రం ప్రజాజీవితం. ఈ కలయిక సంభవించని నాడు రెంటికి సంపర్కం ఉండదు' 'మధ్యతరగతి జడ్డి మనస్తత్వాన్ని అంటి పెట్టుకున్న విప్లవ విముఖతను వదిలించుకోటానికి కృషి చేయటం అవసరం' (విప్లవవాదం కడియాల రామమోహనరావు ప్రపంచ తెలుగు మహాసభలు. 2012 పుట 63 లో విప్లవ కథ సాహిత్యం సృజన ఫిబ్రవరి 71)

అయితే మార్క్సిజంలాగే, విప్లవం అంటే ఎవరి భాష్యాలు వారికి ఉన్నాయి. 'ప్రజలను తిట్టి, భయపెట్టి జుగుప్స కలిగించే 'దిగంబర కవిత్వం' గూర్చి 'కొకు' వ్యవస్థను మార్చాలంటే దాన్ని అసహ్యించుకోటం మార్గం కాదు. 'వాంతి చేసుకునే వాడ్ని చూసి ఎవరూ వాంతి చేసుకోరు. సమాజం మారాలనే ఆవేశం లోపలనుంచి రావాలని, ప్రజలకు ఆ ఆవేశం కలిగించటం మంచిది' అని కొకు హితవు చెపితే, (పైపుట 37), 'శక్తులన్నీ సమీకృతం చేసి ప్రజలను సిద్ధం చేస్తే మంచిదే కాని, 'ఉన్నట్టుండి గొప్ప ఆదర్శంకోసం ప్రాణత్యాగం చేస్తే, ఆ త్యాగాన్ని మెచ్చుకుంటారే కాని, ఫలితం ప్రజలకు దక్కదేమోనని నా భయం" అని సంశయం వ్యక్తం చేస్తారు కే.వి. రమణారెడ్డి. (పై పుట 51)

ఉద్యమకారులు రాసిన కథాసంకలనం 'అడవిలో వెన్నెల' (1985) ముందు మాట 'వేడి వెన్నెల'లో 'మార్క్సిస్ట్ లెనినిస్ట్ (మాలె) సిద్ధాంతాలను మక్కికి మక్కీ అనుసరించే మందమతి ఎవరూ లేరు' కే.వి. ఆర్ అన్నారు. ఆ ఉద్యమంమీద రాసిన మొదటి సిద్ధాంత గ్రంథంలో శాంతా సిన్హా సాయుధపోరాటం ఒకటే ప్రత్యామ్నాయం కాదు అన్నారు కాని వ్యక్తి వాదాన్ని ప్రోత్సహించే విద్యావ్యాప్తికే కృషి చేస్తున్నారు.




'మొదట్లో బ్రాహ్మణ్యాన్ని కనీసం సంస్కరిచటానికి పూనుకున్న బ్రిటిష్ పాలకులు, పోను పోను ఆ సంస్కరణ వైయక్తిక చొరవకు వదిలిపెట్టి బ్రాహ్మణ్యంతో సమైక్య సహజీవనం చేయసాగారు. వాళ్ళు చేసే చట్టాలకు కరణీకపు తెలివి తేటలకు సరిగ్గా అతికింది' 'అటువంటి రాజ్యం ఈ నాటికీ మనల్ని ఏలుతోంది' (మరపురాని లోకసంచారి బాలగోపాల్‌పై నివాళి వ్యాసాలు. 2009 పుట 137) అంటూ వెటకారంతో దాటేశారు. విద్యార్థి నాయకుడు జార్జిరెడ్డి తమ్ముడు సిరిల్ రెడ్డి ఈ కరణం లెక్కల మతలబు పట్టుకుని ఇబ్రహీంపట్నంలో కొంతకాలం ఉద్యమం నడిపారు. బాలగోపాల్: సన్నిహితుడు నరేంద్రనాథ్ ఆ పద్ధతిలో చిత్తూరు జిల్లాలో పనిచేసాడు. కాని లెక్కల మాస్టారు బాలగోపాల్ విశ్వవిద్యాలయాలలో సాంఘిక శాస్త్ర పరిశోధనల నమూనాలో నిజనిర్ధారణ నివేదికలను తీర్చిదిద్దటంలో మునిగి పోయాడు. పౌర హక్కుల పాఠం పెట్టించటానికి కృషి చేసాడు.

గ్రామస్థాయి పాలనకు ఆధారమైన కరణం, ఫారెస్ట్ రికార్డులు పరిశోధనలో విశ్వవిద్యాలయాలు వాడవు. వాటి మీద పాఠాలు ఎక్కడా చెప్పరు. బాలగోపాల్ అన్నట్లు, ప్రభుత్వానికి బ్రాహ్మలకు మధ్య పొత్తులాగే, విద్యారంగానికి ప్రభుత్వానికి మధ్య, ఒకరిజోలికి మరొకరు పోకుండా, ఈ పొత్తు నేటికీ కొనసాగుతూనే ఉంది. ఉత్పత్తిసాధనాలైన భూమి అడవి, నీరు కూలిలో కష్టజీవులు తమ వాటా అడిగినప్పుడే అణగదొక్కటం మొదలౌతుంది. అణగతొక్కడాన్ని ఎండగట్టటంలో మునిగిపోతే, చాటుమాటున రికార్డుల సర్దుబాటు జరుగుతుంది. పోలీసు కేసులతో విసిగిపోయిన జనం ఏదో విధంగా రాజీ కొస్తారు.

పర్యావరణ ఉద్యమాల పరిస్థితి అంతే. పర్యావరణ వేత్తగా పేరుపొందిన మాధవ్ గాడ్గిల్ బెంగళూరులో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో ఆచార్యులు. ఆయన 'ఉత్తర కన్నడ జిల్లామీద అటవీ పరిశ్రమల ప్రభావం' నివేదికను, కళాశాల ప్రిన్సిపాల్ వర్తక్ బృందంతో కలిసి 1989లో తయారు చేసారు.' పశ్చిమ కనుమల పరిరక్షణ అనే ఉద్యమం చిప్కో లాగే అపికో గా కొనసాగింది. అయితే రెండేళ్ళ ముందే

**మిగతా 45వ పుటలో...**

ధారావాహిక

ఈమని శివనాగిరెడ్డి-స్థపతి
98485 98446

# అడుగుజాడలు-ఆనవాళ్ళు: 24
# సంగనకల్లు-ముడుమాల యాత్ర

ముడుమాలలోని ఇనుప యుగపు నిలువురాళ్ల వరసలు ప్రపంచ స్థాయి వారసత్వస్థలాలు, కట్టడాల జాబితాలో చోటుదక్కించుకోవటానికి తహతహలాడుతున్నాయని ఇటీవల వార్తల్లో చదివాను. నేను మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి వద్ద గల పురావస్తు శాఖ కార్యాలయంలో సాంకేతిక సహాయకునిగా పని చేసేప్పుడు 1988లో ముడుమాలలోని క్రీ.పూ.1500 సం.ల నాటి నిలువు రాళ్లను చూశాను. మునుపటి మహబూబ్ నగర్‌జిల్లా, మక్తల్ తాలూకాలోని ముడుమాల, మురారి దొడ్డి అనే గ్రామాలు కృష్ణానది ఎడమ ఒడ్డునున్నాయి. ఒకే చోట 30 ఎకరాలకు పైగా నిలువురాళ్ల వరుసలున్నాయి. పురావస్తు ప్రాధాన్యత కల వీటిని రక్షిత కట్టడాలుగా ప్రకటించారు.

ఇంతకీ అసలు ఈ నిలువురాళ్ల కథేమిటంటే, క్రీ.పూ. 2000-500 మధ్యకాలంలో, ఇనుమును కనుగొని సమాజంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఆనాటి మానవులు, తమ నివాసాలకంటే మరణించిన వారిని స్మరించుకోవటానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. చనిపోయిన వాటిని భూమిలో పాతిపెట్టి, మట్టిలో పూడ్చే వారు. ఒక్కోసారి రాతి పలకల్ని ఒక గదిలా అమర్చి, మరణించినవారి శవాన్ని ఉత్తర దక్షిణాలుగా పడుకోబెట్టి, వారు వాడిన పనిముట్లు, కుండలు, ధరించిన ఆభరణాలను కూడా వారితో పాటే నిక్షిప్తం చేసేవారు. మరి కొందరు, భూమిపైన, ఒక గదిలా ఏర్పరచి, అందులో ఒక రాతి తొట్టిని పెట్టి, ఆ తొట్టిలో చనిపోయిన వారి ఎముకల్ని నిక్షిప్తంచేసే వారు. వీటిని డాల్మెన్‌లు అంటారు. ఇంకో తెగవారు మరణించిన వారిని, గుంట సమాధుల్లో పూడ్చి, వారికి గుర్తుగా పక్కనే ఒక నిలువు రాతిని పాతి పెడతారు. అలా భూమి లోపల 5.0 అడుగులు, భూమిపైన 8.0 నుంచి 15.0 అడుగుల ఎత్తు, 2.0 నుంచి 5.0 అడుగుల మందంతో ఉంటాయి. ఇవి ఒక్కోచోట ఒక్కటిగాని, లేక 2,3 గానీ ఉంటాయి. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రధాన ప్రవేశద్వారం కుడివైపున ఒక నిలువురాయి ఉంది. దీన్ని లింగంపల్లి మెన్‌హిర్ అంటారు. ఖమ్మం జిల్లా జానంపేట, మహబూబ్‌నగర్‌జిల్లా ముడుమాలలో ఈ నిలువు రాళ్లు వందల సంఖ్యలో ఉన్నాయి. వీటిని ఎవెన్యూలంటారు.

ముడుమాల దగ్గరున్నన్ని నిలువురాళ్ల వరుసలు, ఇంత సంఖ్యలో మన దేశంలో ఎక్కడా లేవు పైగా, అక్కడ, నక్షత్ర గమనాన్ని తెలిపే గుర్తులు ఒక రాతిపై చెక్కిఉన్నాయి. అవి సప్తర్షి మండలాన్ని పోలి, ఆకాశంలో అదే ఆకారంలో అమరి ఉన్నట్లుగానే, రాతిపైన చెక్కబడి ఉన్నాయి. అలనాటి కట్టడ కౌశలంతోపాటు, ఖగోళ విజ్ఞానాన్ని కూడా తెలిపే ఈ నిలువురాళ్ల వరుసలు, ప్రాధాన్యతను దక్కించుకున్నాయి. హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయ చరిత్ర అధ్యాపకులు ఆచార్య కె.పి.రావు, వీటిని గురించి విశేష పరిశోధనలు జరిపి, అంతర్జాతీయ సదస్సుల్లో ప్రసంగించి, ప్రపంచ దృష్టికితీసుకెళ్లారు. వారసత్వ తెలంగాణా శాఖ రక్షిత స్థావరమైన ముడుమాల నిలువురాళ్ల సముదాయానికి యునెస్కో గుర్తింపు తేవడానికి ఆచార్య కె.పి.రావు, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ, ఛైర్మన్, ఎం. వేదకుమార్‌లు ప్రయత్నాలు చేస్తున్నారు.

వాటిని ఒక్కసారి చూడాలనిపించింది. అదే గ్రామానికి చెందిన భాస్కర్‌గౌడ్ అనే కుర్రాడికి ఫోన్ చేశాను. మీ రాకకోసం ఎదురుచూస్తున్నానన్నాడు. రెండు మూడుసార్లు అనుకోవటం, కుదరక పోవడం. అయితే, పట్టువదలని ఒక విక్రమార్క మిత్రుడు ఏమైనాసరే వాటిని చూడాల్సిందే నన్నాడు. ఆయన ఎవరో కాదు, సాయిపాపినేని.

దక్షిణ భారతదేశపు తొట్ట తొలి పాతరాతి యుగపు పని ముట్టును, మద్రాస్ దగ్గరి పల్లవరంలో క్రీ.శ.1854 ప్రాంతంలో



గుర్తించి, మనదేశాన్ని ఆదిమ మానవుని అడుగుజాడలకు ఆనవాలుగా నున్న ఆఫ్రికా సరసన చేర్చి, భారత రాతియుగపరిశోధక పితామహుడుగా పేరు గాంచిన వ్యక్తి రాబర్ట్ బ్రూస్‌ఫుటే. ఆయన పేరు మీదుగా బళ్లారిలో, ఆచార్య రవి కోరిశెట్టారు, ఒక మ్యూజియాన్ని నెలకొల్పి, నన్నూ, సాయి పాపినేని గారిని ఆహ్వానించి, ఆహ్వానించి అలసిపోయారు. ఒకానొక పర్వదినాన కాలికి బలపం కట్టుకొని, బళ్లారి వెళ్లాం. వెళుతూ వెళుతూ, అనంతపురంలో 'శప్తభూమి' నవలా రచయిత బండి నారాయణ స్వామిగారిని ఆయన పొలంలో కలుసుకొని, జొన్నరొట్టెలు, వంకాయ కూర, కాకరకాయ పులుసు, కోడికూర, చిక్కటి పెరుగుతో ఆయన, ఆయన కుమారుడు అందించిన ఆతిథ్యాన్ని స్వీకరించి, రాత్రికిరాత్రే బళ్లారికి చేరుకొని బసచేశాం.

మరుసటి ఉదయం, నేను, సాయిపాపినేని, స్థానిక పురావస్తు పరిశోధకుడు లింగన్నస్వామి కలసి, సంగనకల్లు కొండదగ్గర కెళ్లాం. ఆ కొండ పురామానవునికి స్వర్గసీమ. ఇప్పటి పరిశోధకులకు ఒక ప్రయోగశాల. పాత, కొత్త రాతియుగాలతోపాటు ఇనుప యుగంలో కూడా అదొక నిరంతర నివాస స్థావరంగా ఉండేది. కొండ నిండా పురాతన ఆనవాళ్లే. ప్రతిబండకూ అలనాటి మానవులు రాళ్లతో చెక్కుకున్న జంతువులు, మానవుల బొమ్మలే. వీటిని

రాక్‌బ్రూజింగ్స్‌అంటారు. 400 అడుగుల ఎత్తున్న ఆ కొండను 70 ఏళ్ల వయసులో కుర్ర సింద్‌బాద్‌లా ఎక్కాను. కొన్నివేల పురాచిత్ర శిల్పాల్ని చూచి, తరించిపోయాను. నేను ఇక ఎపుడు చనిపోయినా, దిగులులేదను కున్నాను. చూడకుండా చనిపోతే వెలితితో చనిపోయానన్న బాధేసేదేమోననిపించింది. సంగనకల్లు మ్యూజియంని చూచి, రవికోరిశెట్టార్ గారి కృషిని అభినందించి, అటునుంచి, సమీపంలోనే ఉన్న కొత్త రాతియుగపు బూదిగడ్డ కుడితిని అనే ప్రదేశాన్ని చూశాం. అది దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బూడిదగడ్డ స్థావరం. బళ్లారిలో రాత్రికి బస. సాయిపాపినేని, రవికోరిశెట్టారు, మరో ఇద్దరు మిత్రులతో కొద్దిపాటి నిషా.

మరుసటిరోజు ఉదయాన్నే కన్నడ దేశపు బిసిబేళబాత్‌ను ఆరగించి, రాగిమాల్ట్ తాగి కారెక్కాము. ఆదోని మీదుగా వెళ్తుంటే ఆ కొండలు, కొండల మీదున్న కోట, శాతవాహన రాజు మేకదోని శాసనం, కొండ గుహల్లో కళ్యాణ చాళుక్యుల కాలపు జైన తీర్థం కరుల విగ్రహాలు కళ్లముందు కదలాడుతూ ఉంటే, ఆగిచూస్తే బాగుంటుందనిపించింది. కారు కదులుతూనే ఉంది. ఇంతలో పెదతుంబళం వచ్చింది. అక్కడ ఆలయాలు గుర్తొచ్చాయి. సాయిగార్ని అడిగితే, రామాలయానికి తీసుకెళ్లాడు. అద్భుతమైన దేవాలయాలు, ఎత్తైన నక్షత్రాకారపు అడుగుపైన, మేరు శిఖరాన్ని బోలిన, భూమిజ ఆలయం, ముందు మండపం కూలిపోయి బోసిబోయినా, ఆలయ వాస్తు, శిల్పాలు మమ్మల్ని కట్టిపడేశాయి.



షరా మామూలే. ఇక్కడ కూడా నిర్లక్ష్యపు నీడలే. చుట్టూ చిందరవందరగా శిల్పాలు, ఆలయ విడిభాగాలు, ఉన్నదాంట్లో ఏదో మేలన్నట్లు ఒక రాజ్య సభసభ్యుడు, రు.1.00 కోటితో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపే శిలాఫలకం వరుస తప్పుతున్న వారసత్వానికి ప్రతీకగా ఉంది. ఆలయ ప్రవేశం దగ్గర పీకల దాకా కూరుకుపోయిన ఏనుగు శిల్పం, మండపస్థంభ ఫలకం, చారిత్రక విషయాలను నిక్షిప్తం చేసుకొన్న ఒక శాసనాన్ని శని పట్టుకొంది. రోజు రోజుకూ భూమిలోకి కూరుకుపోతుంది. పట్టించుకోకుండా, మెట్లపైనుంచి పోతున్న నన్ను మొట్టికాయేసి కూర్చో పెట్టింది. ఆ శాసనం దగ్గర కూర్చొని అక్షరాల్ని తడిమి చూశాను. నరాల్లోకి చరిత్ర ప్రవహించింది. అది క్రీ.శ. 1094వ సం. ఏప్రిల్ 17వ తేదీ, సోమవారంనాడు, కర్ణాటకలోని కళ్యాణ కటకం నుండి పాలిస్తున్న కళ్యాణ చాళుక్య చక్రవర్తి ఆరో విక్రమాదిత్య బిరుదాంకితుడు, త్రిభువనమల్ల దేవునిది. చూడండి, ఈయనకు వాళ్ల నాయన ఎలాంటి అర్థవంతమైన పేరు పెట్టాడో. చక్రవర్తి అదే శిలపై స్థానిక వడ్డరావళ సుంక అధికారి, సూర్యగ్రహణ సందర్భంగా కొంత ఆదాయాన్ని స్థానిక కీర్తినారాయణ దేవరకు నైవేద్యం నిమిత్తం దానం చేసిన వివరముంది. ఈ శాసనంలో ఒక తప్పు దొర్లింది. క్రీ.శ. 1094, ఏప్రిల్ 17న సూర్యగ్రహణం నాడు దానం చేసినట్లుంది. నిజానికి ఆ సంవత్సర సూర్యగ్రహణం, క్రీ.శ. 1094, మార్చి, 19వ తేదీనే వచ్చింది. ఇలా అపుడపుడూ, అక్కడక్కడా శాసనాల్లో అచ్చుతప్పులు దొర్లుతుంటూనే ఉంటాయి. ఆలయ నిర్వహణ లేమిని చూచి బాధ పడటం కంటే ఏమీ చేయలేక మళ్లీ కారెక్కాము.





కారెక్కే ముందు, ఎందుకైనా మంచిదని, గుడిచుట్టూ ఒకసారి తిరిగాను. నగీషీగా చెక్కిన గోడలపై నున్న వాస్తువిన్యాసం, అలనాటి సుందరీమణుల రూపలావణ్యం నన్ను ముందుకు కదలనివ్వటంలేదు. ఇంతలో సాయిపాపినేని కార్లోంచి ఒకటే హార్న్‌మోత గబగబా గుడి చుట్టూ తిరుగుతున్న నాకు, ఆలయం మీద చెక్కిఉన్న క్రీ.శ. 1132 సం. మార్చి 23వ తేదీ, బుధవారం నాడు కళ్యాణ చాళుక్య చక్రవర్తి మూడో సోమేశ్వర (భూలోకమల్ల)ని తెలుగు-కన్నడ శాసనం కనిపించింది. చక్రవర్తి కొడుకు యువరాజైన తైలపదేవుని సామంతుడైన సింద వంశపు బాచరస, స్థానిక కరెకంటేశ్వరదేవుని అంగరంగ భోగాలకు, సత్రనిర్వహణకు ఇత్తిగె అనే గ్రామాన్ని దానం చేసిన వివరాలున్నాయి. ఈ గ్రామం, సింధవాడి-1000, ఆదవాని- 500, గురిజ-70 భూభాగానికి చెందిందని, అప్పటి రెవెన్యూ వ్యవస్థను తెలియ జేస్తుంది. మళ్ళీ మోగుతూనే ఉన్న హారన్‌కు భయపడి ఆలయం అరుగు మీదనుంచి దూకి, కార్లోకి దూరాను. సాయిపాపినేని కోపం చల్లారింది.

కారు కదులుతూకదులుతూ, తుంగభద్రానదిపై కట్టిన అందమైన ఇనుప చట్రపు వంతెనను దాటుతున్నాం. నాకు ఈ తుంగభద్రానదిని, గతంలో దాటిన రాజులు, రాణులు, సేనాపతులు, చివరికి శ్రీకృష్ణదేవరాయలు గుర్తుకు వచ్చారు. ఇంతలో రాయచూరు రానే వచ్చింది. కోటను, కోట గోడల్ని కోట గుమ్మాన్ని చూస్తుంటే క్రీ.శ. 1520లో శ్రీకృష్ణదేవరాయలకు, బహుమనీ సుల్తాన్‌కు మధ్య జరిగిన హోరాహోరీ పోరు, మదగజాల ఘీంకారాలు, యుద్ధభేరీలు, అశ్వపదఘట్టనలు, పదాతిదళ పౌరుష ప్రదర్శనలు ఒక్కొక్కటిగా కనిపిస్తూనే ఉన్నాయి. ఆగితే సాగదు ప్రయాణం అని, రాయచూరు

కోట గుమ్మం పక్కనే క్రీ.శ. 1294లో గోన విఠలరెడ్డి చెక్కించిన శాసనాన్ని దాని పక్కనే ఒక పొడవాటి రాతిని బండిపై తరలించే దృశ్యమున్న రేఖాశిల్ప చిత్రాన్ని చూడలేకపోయానన్న దిగులును దిగమింగుకొని రాయచూరు సందర్శనకు గుర్తుగా ఒక గోలీసోడా తాగి, తుర్రుపిట్టలా జారుకొని కృష్ణానదిని దాటి తెలంగాణ మాగాణంలో అడుగుబెట్టాం. అమ్మయ్య... తెలుగు గాలిని పీల్చుకుంటున్నాం అని ఆనందించాం. ఇంతలో మక్తల్ చెందిన భాస్కరుగౌడ్ ఫోను. ఎంతదాకా వచ్చారని. ముదుమాల పోవటానికి మీరు ఫలానా చోట రోడ్డుకు కుడి వైపున ఆగమని చెప్పాడు. మరోపది నిమిషాల్లో వచ్చాడు. అందరం కలసి అరగంట ఆహ్లాదకర ప్రయాణం తరువాత, 'ముదుమాలలోని ఇనుప యుగపు నిలువు రాళ్ల వరుసలు ఇవే సారు' అనటంతో కారుదిగాం.

ఎదురుగా ఒకపుడు ఠీవిగా బతికిన రాజులు, యుద్ధంలో ఓడిపోయి, తలదించుకున్నట్లుగా వంగిపోయిన నిలువురాళ్లు కొన్ని వరుసలో, మరికొన్ని వరుసదప్పి, కొన్ని పడిపోతూ, మరికొన్ని పడిపోయి, ఇంకొన్ని తలలు తెగి నేలకొరిగిన సైనికుల్లా, రాలిపోయి కనిపించాయి. క్రీ.పూ. 2000 సం.ల నాడు, ఆనాటి జన సమూహపు కలసికట్టు జీవన విధానానికి నిలువుటద్దాల్లా ఓపిక లేకపోయినా ఇంకా నిలబడే ఉన్నాయి ఆ నిలువురాళ్లు. తెలుగు వారి చరిత్రలో మైలురాళ్లు.



భాస్కర్‌గౌడ, ఆయన మిత్రుడు ముదుమాల వి.ఆర్.వో యాదవరాజులు ఆస్థారమంతా చూపించారు. అప్పటి కలెక్టరు రొనాల్డ్‌రోస్, చుట్టూకంచె పాతించటాన, ఈ చారిత్రక ఆనవాళ్లు ఇంకా మిగిలి ఉన్నాయి సార్ అని చెప్పారు. అంతే కాదు, కలెక్టరుగారి భార్య విశాలాక్షి అప్పుడు తెలంగాణ రాష్ట్ర వారసత్వ (పురావస్తు) శాఖ, డైరెక్టరుగా ఉండేదనీ, వాళ్లిద్దరూ ఈ స్థావరాన్ని కాపాడారని కూడా చెప్పినప్పుడు వాళ్లిద్దరికీ చేతులెత్తి మొక్కాను.

ముదుమాల ఇనుపయుగపు నిలువురాళ్ల స్థావరమంతా కలియదిరిగాం సాయిపాపినేని బ్రిటన్‌లోని స్టోన్‌హెంజ్ గురించి వారికి వివరించాడు. ఒక అరుదైన కట్టడం కూలిపోయిందనీ మిగిలిన వాటిని రైతులు జేసీబీలతో లేపేస్తున్నారని వాళ్లిద్దరూ వాపోయారు. మేమిద్దరమూ నిలువు రాళ్ల పక్కన కొన్ని ఫొటోలు దిగి, అలనాటి మృతవీరుల స్మారకవనానికి వందనాలనర్పించి బాధతో బరువెక్కిన గుండెల్ని అదిమిపట్టుకొని తిరుగు ముఖం పట్టాం..

**42వ పుట తరువాయి.....**

## కథాకాలక్షేపాలు.

87లో చిప్కో నాయకుడు చండిప్రసాద్ భట్, తీవ్రంగా వరదల పాలయిన గోదావరి పరివాహక ప్రాంతంలో పర్యటించారు. ఆ స్ఫూర్తితో అక్కడ అడవులు నరుకుతున్న రంపచోడవరంలో ప్లైవుడ్ ఫాక్టరీమీద కేసు వేసారు. కోర్టు నరుకు నిలుపు చేసింది.( మామిళ్ళు కొట్టొద్దు, మా పొట్ట కొట్టొద్దు. నడుస్తున్న చరిత్ర జూన్ 2005) ఆ సమయంలో ఉద్యమాలఖిల్లా వరంగల్ జిల్లా అడవుల్లో కమలాపురం రేయాన్ ఫాక్టరీ ఉండి దాని జోలికి ఎవరూ పోలేదు. మాధవ గాడ్గిల్-రామచంద్రగుహా పుంఖానుపుంఖాలుగా పుస్తకాలు రాస్తుంటారు. వాటిలో (The fissured land oxford) 1992 లో గాడ్గిల్ అధ్యయనం ఉంది. ఉత్తర కన్నడలో 17 ప్లయ్ వుడ్ ఫ్యాక్టరీలు ఉండేవి. అవి తర్వాత ఏమైనవో తెలియదు. జీవ వైవిధ్య చట్టం ప్రకారం పంచాయతీల వారీగా రిజిస్టర్‌లు తయారు చేయటానికి మాధవ్ గాడ్గిల్ కృషి కారణం. అయితే అటవీ, పర్యావరణ శాఖల పెత్తనంలోనే ఈ చట్టం, రిజిస్టర్ల తయారీ జరుగుతుంది. ఈ చట్టంలో లోటును సరిద్దుతూ అటవీ హక్కుల గుర్తింపు చట్టం వచ్చింది. అయితే దీన్ని ఖాతరు చేయకుండా, తన పద్ధతి మార్చుకోకుండా అటవీ శాఖ తన అటవీ, వన్యప్రాణి సంరక్షణ చట్టాలను అమలు చేసుకుంటూ పోతుంది. దానితో పోడు పట్టాలిస్తే చాలునని రాజకీయపక్షాలు రాజీ పడుతుంటే, ఉమ్మడి వాడుకకోసం ఏదో కొంత అడవి కేటాయిస్తే చాలునని స్వచ్ఛంద, పరిశోధనా సంస్థలు సరిపెట్టుకుంటున్నాయి. గాడ్గిల్ '89 అధ్యయనంలో అటవీశాఖ రోజువారీగా చేసే అక్రమాలు, ప్రాథమిక స్థాయిలో పాఠాలుగా వస్తే, ప్రజలకు అప్పుడే అక్కడే ఎలా నిలేయాలో అర్థమయ్యేది. 'తోటకూర దొంగతనం చేసిన నాడే బుద్ధి చెపితే ఇంతదాకా రాకపోను' అనే మందలింపును గుర్తు తెస్తున్నాయి. పౌర హక్కుల ఉద్యమాలలాగే పర్యావరణ ఉద్యమాలుగూడా ఒక వెలుగు వెలిగి మలిగి, సాహిత్యాన్ని మాత్రం దండిగా మిగిల్చి పోతున్నాయి.




అ

*" మాతృభాష ఆ భాషీయుడి సంప్రదాయ, సంస్కార మూలాల్ని నిత్యం తడుపుతూ, శుభ్రపరుస్తూ నవనవోన్మేషంగా పల్లవింపజేసే అంతఃస్రోతస్విని. అది జలజలా నిత్యం పారుతుండకపోతే ఆ భాషీయుడి జీవనం శుష్కించిపోవటమే కాదు, ఏ చిన్న జీవన విషాదానికైనా గజగజ వణికి కుప్పకూలుతుంది. అట్లాంటి అంతశ్శక్తినిచ్చే సహజ పౌష్టికాహారం తల్లిభాష!"*

**-సి.ధర్మారావు**

పుస్తక సమీక్ష

# నగ్నముని 'బహిరంగ ప్రకటన' విలోమ కథలు




ఆధునిక తెలుగు సాహిత్యంలో నగ్నముని గారిది విశిష్ట స్థానం. సాహిత్యంలో ఆయన ప్రయోగాలకు పెట్టింది పేరు. ఆయన పేరు వింటే దిగంబర కవిత్వం గుర్తుకు రావాలి. అంతకుమించి' కొయ్య గుర్రం' గుర్తుకొస్తుంది. ఎమర్జెన్సీని చూసిన కళ్ళతో, అనుభవించిన హృదయంతో, ఒక తీవ్రమైన ఆలోచనతో ఆయన విలోమ కథలు రాశారు.'సాహిత్యం దేశ జీవితానికి దర్పణం అయితే పాలకుల అసమర్ధ పాలన వలన కూడు గూడు గుడ్డా లేని పౌర హక్కుల సైతం లేని కోట్లాది జనం, నరలోకంలోకి తోయబడుతుంటే ఈ అద్దంలో దేశ జీవితం తలకిందులుగా కనబడే తీరాలి. అంతా సక్రమంగా సుఖంగా సజావుగా ఉన్నట్లు చూపుతుంటే ఆ అద్దం అబద్ధమాడుతున్నదన్నమాట, దాన్ని బద్దలు కొట్టాలన్నమాట నాడు నేడు ఏనాడైనా సరే ఈ మాటలు నగ్నముని గారివి. ఈ మాటలు ప్రాతిపదికగా, ఈ మాటలే ఆత్మగా వెలువడిన కథలు విలోమ కథలు.

ఈ కథలు సమస్య పరిష్కారం కథలు కాదు. ప్రత్యామ్నాయ అవసరం వైపుకు కదిలిన కథలు. రచయిత నీతి సూత్రాలు వల్లించడు. సాహిత్య, సామాజిక ప్రయోజనాలు జమిలిగా ఉన్న కథలివి. తన చుట్టూ ఉన్న ప్రపంచం, ఆ ప్రపంచంలోనే మానవ స్వభావాలు చర్య, ప్రతి చర్యలు అనేకనేక సంఘర్షణలు రచయితను కదిపేసినప్పుడు, కుదిపేసినప్పుడు పుట్టిన కథలివి.

రాజకీయ దురహంకారం సామాన్యులును గాలివానలా చుట్టుమట్టినప్పుడు రచయిత ఏ వైపు నుండి మాట్లాడాలో జరుగుతున్న పరిణామాలను ధైర్యంగా ఎలా చెప్పాలో ఈ కథలు నమూనాగా నిలబడతాయి. చాలామంది పెన్ను మూసుకున్న సందర్భంలో ఈ రచయిత విలోమ కథలు ప్రకటించాడు.

ఇక్కడి మనుషులు చూస్తూ చూస్తూనే రాజకీయ నాయకులు తీసుకునే నిర్ణయాలకు అలవాటు పడిపోయారు. ఎలాంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, చట్టాలు వచ్చినా వ్యతిరేకించడం మానేశారు. పేరుకే ప్రజాస్వామ్యం అయినా అంతా నాయక స్వామ్యం, అధినాయక స్వామ్యం. నిర్బంధాలు ఇప్పుడూ ఉన్నాయి. నిషేధాలు ఉన్నాయి. జీవితంలో రాజీపడి బతకడం ఉంది. అణచివేతలు ఉన్నాయి. అందువల్ల విలోమ కథలు ఇప్పటికీ సార్వజనీనతను కోల్పోలేదు.

తలకిందులైన రాజకీయ విలువలను గుర్తించడం మానేశాం. మనమంతా ఒక్కటే అంటూనే విభజన రేఖలు గీస్తారు. కుల, మత, ఆర్థిక విద్వేషాలు ఏపుగా పెరుగుతున్నాయి. ప్రజలు అంటే కేవలం ఓట్లుగా పరిగణన చేస్తున్నారు. సంక్షేమం వల విసిరి పాలకపక్షం అరాచకాలు చేస్తూ ఉంటుంది. ఈ విలోమ కథలు ఎప్పటి కథలో కాదు ఇప్పటి కథలు. వాస్తవానికి కథలో వస్తువు పాతబడిపోతూ ఉంటుంది. కానీ ఈ విలోమ కథల్లో తీసుకున్న వస్తువు ఇప్పటికీ తాజాగా ఉండడం, వ్యవస్థ ఎలా ఉందో తెలుసుకోవడానికి నిదర్శనం.

ఈ కథలు రాసిన కాలం 1975 జూన్ 25 అర్ధరాత్రి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ ప్రజల మీద, న్యాయస్థానాల మీద అన్ని వ్యవస్థల మీద కుట్రపన్ని విధించిన క్రూరమైన ఎమర్జెన్సీ. ఆ కాలంలో దేశం ఒక జైలుగా మారిపోయింది.

ఆ సమయంలో పాలకులలోఉన్న అరాచక ప్రవృత్తి బయటపడింది. పత్రికల్ని గొంతునులిమారు. ప్రజల కోసం నిలబడిన వారిని, సమాజంలో శాంతి కోరుకున్న వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టారు. దేశం మొత్తం ఒక స్మశానంగా మారుతున్న పరిణామంలో ఈ రచయిత విలోమ కథలు ప్రకటిస్తూ వచ్చారు.

ఇందులో మొదటి కథ పెద్ద శీర్షికతో ఉంటుంది. బహుశా తెలుగులో పెద్ద శీర్షికతో ఉన్న కథ ఇదే అయి ఉంటుంది. అంటే రచయిత శీర్షిక దగ్గర నుండే కథల్లో ప్రయోగం చేయడం మొదలుపెట్టారు. ఈ శీర్షికను గట్టిగా చదివితే ఒక అప్రమత్తత వినిపిస్తుంది. ఎవరో నిర్ణయాలు తీసుకుంటారు. ఎక్కడో నిర్ణయాలు తీసుకుంటారు. కానీ ఆ నిర్ణయాలు ఆలోచనలతో మనలాంటి సామాన్యులు బతకాల్సిన దౌర్భాగ్య స్థితిని ఆయన చిత్రీకరించారు. తలలు మారిపోవడం ఇందులో ప్రతీక .పులి బెబ్బులి కథలో సమస్త జీవితంలో వ్యాపార విలువల ఆక్రమణ, రాజ్యం వ్యాపారి కావడం, మనిషి సరుకైపోవడం అలాంటి సందర్భంలో మనిషిలోని జంతువు బయటకు వచ్చి చుట్టూ ఉన్నవారి జీవితాన్ని నాశనం చేయడం కేంద్రంగా ఈ కథ సాగుతుంది.

ఒక మూడవ కథ శిశు హత్య. ఈ కథలో గర్భంలో ఉన్న శిశువు మాట్లాడటం అనే ఆలోచన ద్వారా రచయిత ఓ ప్రయోగం చేశాడు. గర్భంలో ఉన్న శిశువు మాట్లాడడం అసాధ్యం కావచ్చు. అసంబద్ధం కూడా కావచ్చు. కానీ అస్తవ్యస్తమైనటువంటి వ్యవస్థలో ఇలాంటి అసంబద్ధత ఉంటుందని నిరూపించడం కోసమే రచయిత కథను అలా నడిపారు. లైకా మజ్ను ప్రళయగాధ ఈ కథ పూర్తిగా అధిక్షేపరచన. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వారు మనుషుల్ని, దుర్మార్గులుగా మార్చి పీడన చేయడం ఇందులో ఇతివృత్తంగా కనిపిస్తుంది. ఈ కథలో రచయిత మొసలి, కుక్క లను ప్రతీకలుగా, సంకేతాలుగా సమర్థవంతంగా ఉపయోగించుకున్నారు.

**మిగతా 49వ పుటలో...**

పుస్తక పరిచయం

## వందేళ్ళ కిందట తెలంగాణా జనజీవితాన్ని ఇతిహాసంగా నమోదు చేసిన

# రాఘవపట్టణం రామసింహకవి ఆత్మకథ




**రాఘవపట్టణం రామసింహకవి ఆత్మకథ**
రచన:వేముల ప్రభాకర్
వెల:రూ. 200
ప్రతులకు:
నవోదయ బుక్ హౌస్
కాచిగూడ క్రాస్ రోడ్స్
హైదరాబాద్ -27
ఫోన్: 93986 61025

ప్రత్యేక తెలంగాణా స్థానీయ చరిత్ర, సాహిత్యాలపై అధ్యయనం, పరిశోధనలు వివిధ కోణాల్లో జరుగుతున్నాయి.ఓ నూటాయాభై ఏళ్ళ కాలం నాటి ఒక కవి ఆత్మకథ ఇటీవల వెలుగు లోకి వచ్చింది. అలాంటి ఒక ఆత్మకథ పుస్తకం ప్రముఖ పరిశోధక కవి వేముల ప్రభాకర్ గారి సంపాదకత్వంలో ఇటీవల 240 పేజీలలో ఒక గ్రంథంగా వెలువడింది. కవి గారి ముని మనువడు సర్దార్ గురుదేవ్ సింగ్ గారు ఇచ్చిన ఈ వ్రాతప్రతులను ఒక సంవత్సర కాలం పాటు పరిశీలించి, పరిష్కరించి ఒక పుస్తకరూపంలోకి తెచ్చిన ఘనతను సంపాదించుకొన్నారు, సంపాదకులు వేముల పభాకర్. ఉమ్మడి కరీంనగరం జిల్లా లోని జగిత్యాల సమీపంలోని రాఘవపట్నం నివాసి, రామసింహకవి రాసుకొన్న ఆత్మకథ ఇది.. వీరు ప్రధానంగా పద్యకవి, నాటకాలు, శతకాలు, హరికథలు, భజనలు, కీర్తనలు వంటి ప్రక్రియల్లో ఓ 30 వరకు పుస్తకాలు రాశారు. సహేతుకతతో యదార్థ భారత, రామాయణ, భాగవత కావ్యాలను సమీక్షించి తిరిగి రాసి ముద్రించారు. అయినా వీరు నాస్తికులు కాదు. ఈ కావ్యాలలోని అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సరిచేస్తూ రచనలు చేశారు. ఆ కాలంలో పుస్తకాలు రాయడం ఒక ఎత్తయితే, అచ్చొత్తించడం మహా పెద్ద కార్యం. 106 సంవత్సరాలు సుదీర్ఘ కాలంగా బతికిన ఈ కవి, సుమారు 14 ఏండ్ల జైల్ జీవితం మినహా, తన యవ్వనారంభం నుండి వృద్ధుడయ్యేంతవరకు రచనలు చేస్తూ, ఇందులకు కావాల్సిన ద్రవ్యం కోసం వదాన్యుల వద్దకు వెళ్ళి, వారిని కలుసుకోవడం, ఎన్ని అడ్డంకులైనప్పటికినీ తన రచనలను అచ్చులోకి తేవడం ప్రాధాన్యతను సంతరించుకొన్నది. రామసింహకవి నివసించిన రాఘవపట్నం ఇల్లు, ఆంజనేయస్వామి గుడుల ఫోటోలను, కవి గారి వారసుల ఫోటోలను, కవి గారి కుటుంబ ఫోటోలను లోపలి ముఖపత్రాలలో చేర్చారు.

రామసింహ కవి గారు సిక్కు జాతీయులు. వీరు 1857-1963 మధ్యకాలంలో సుమారు 106 సంవత్సరాలపాటు నిండుగా జీవించి, 30 కి పైగా రచనలు చేశారు. ఇందులో కొన్ని అముద్రితాలు, పునర్ముద్రితాలు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాంతంలో కొంత మంది సిక్కు జాతీయుల కుటుంబాలు నైజాం నాటి కాలం నుండి స్థిరపడ్డాయి. వీరి ఆత్మకథ చదివితే సుమారు 150 సంవత్సరాల నాటి సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, పాలనా రంగాలు వివరాలు కొంతవరకైనా తెలిసి వస్తాయి. రామసింహకవి మునిమనువడైన సర్దార్ గురుదేవ్ సింగ్ (76)ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్డై హైదరాబాద్ లో స్థిరపడ్డారు. వేముల ప్రభాకర్ 2017లో రామసింహ కవి గారి ఊరైన రాఘవపట్టణాన్ని సందర్శించారు. వారి మునిమనువడు గురుదేవ్ సింగ్ దాచి ఉంచిన తమ ముత్తాత గారి కొన్ని ముద్రిత రచనలను, అముద్రిత వ్రాత ప్రతులను ఇవ్వడంతో, రామసింహ కవి గారి ఆత్మకథ ఇలా వెలుగులోకి వచ్చింది. రామసింహకవి గారి అత్మకథ పుస్తకంలో ఒక వ్రాత ప్రతి ఫోటోను ఒకటి శాంపుల్ గా వేశారు. కవి గారు తెలుగులో స్వదస్తూరీతో రాసిన వ్రాతప్రతులను, పరిశోధించి. శ్రమకోర్చి ముద్రిత ప్రతిని ప్రచురణకి వేముల ప్రభాకర్ సిద్ధం చేశారు.

తెలంగాణాలో స్థిరపడి తెలుగు సాహిత్యంతో మక్కువ పెంచుకొని పలు రచనలు చేశారు. వీరు తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, పార్సీ భాషలలో సిద్ధహస్తులు. ప్రాచీన తెలుగు పద్య సాహిత్యాన్ని వడబోసి లోతుగా అధ్యయనం చేసి, పలు రచనలు చేశారు. ఆంధ్రాప్రాంతంలోని అవధానులను, పండితులను కూడా తన పద్య పాండిత్యంతో మెప్పించి, ఎన్నో సన్మానాలు పొందారు. తాను రాసిన పుస్తకాలను అచ్చులోకి తేవడానికి ఉత్తర తెలంగాణా జిల్లాలతో పాటుగా హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలు పర్యటించి దాతలను కలుసుకొని ఆర్థిక సాయాన్ని పొందారు. రామసింహం కవి గారు హేతువాదంతో రచనలు ఉన్నప్పటికినీ, ఆయన పలు దైవతాలపై రచనలు చేశారు. రామసింహకవి గారు తాను ఒక క్షణికావేశ నేరానికి లోనై ఒక హత్యా నేరంలో నేరస్తుడిగా ముద్ర పడి, 14 ఏళ్ళ పాటు వివిధ ప్రాంతాలలో జైల్ జీవితాన్ని అనుభవించాడు. నిజాం రాజ్యంలోని ఒక బ్రిటన్ పోలీస్ అధికారి కెంటన్ దయవల్ల గుల్బర్గా జైల్ నుండి విడుదలై, తదుపరి సామాన్య స్వేచ్ఛా జీవితాన్ని పొందారు.

కవిగారి పాండితీ ప్రతిభ గూర్చి చెప్పనక్కరనే లేదు. వీరి పద్యాలు 77 ఏండ్ల వయస్సులో ఉన్నపుడు రాసిన విశ్వకర్మ శతకంలోని నాలుగు పద్యాలు 1934 నాటి సురవరం ప్రతాపరెడ్డి గారి గొల్కొండ కవుల సంచికలో, వచ్చాయి. కరీంనగర్ సాహితీవేత్త డా. మలయశ్రీ గారు మూడు దశాబ్దాల కిందట వెలువరించిన వెయ్యేళ్ళ కరీంనగర్ జిల్లా సాహిత్యం అనే గ్రంథంలో వీరి సమాచారం, పరిచయం ప్రస్తావనలు ఉన్నాయి.

-సంకేపల్లి నాగేంద్రశర్మ, కరీంనగర్,
చరవాణి: 80748 26371

జి.వి.పూర్ణచందు
9440172642

# ఎమ్డెన్

1953 లో శ్రీ గణేష్ వాసుదేవ్ మావలాంకర్ మరణానంతరం లోక్‌సభ స్పీకర్ పదవికి శ్రీ మాడభూషి అనంతశయనం అయ్యంగార్ పేరును ప్రతిపాదించి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా నెహ్రూ తోడ్పడ్డారు. మాడభూషివారు భారత లోకసభకు తొలి ఉపసభాపతి. తర్వాత సభాపతి అయ్యారు. బీహారు గవర్నరుగా కూడా పనిచేశారు. పదారణాల తెలుగువాడు. తిరుచానూరులో పుట్టాడు. తిరుపతి, మద్రాసుల్లో చదువుకున్నాడు. లెక్కలమాష్టారుగా, లాయరుగా చేసి, రాజకీయాల్లోకి వచ్చి సభాపతి స్థానానికి ఎదిగారు.

"సున్నితమయిన హాస్యంతో సభను అలరించేవారు. మాటల కెన్నడూ తడబడని వారి 'వాగరి'కి ముగ్ధులయిన హెచ్. వి. కామత్, మాడభూషి వారిని "అనంతవచనం అయ్యంగార్" అనేవారు. నిమిషానికి 180 పదాలు చకచకా వరదలా వెలువడే వాగ్ధోరణికి చకితులయిన సభ్యులు వారిని 'ఎమ్డెన్' తో పోల్చేవారు" అని శ్రీ కోసూరి హనుమంతు 'తిరుపతి పట్టణ ప్రముఖులు' గ్రంథంలో వ్రాశారు.

## ఎమ్డెన్ అంటే?

మా చిన్ననాటి వరకూ అంటే షుమారుగా 1970ల వరకూ చురుకైన వాళ్లని "గొప్పగా చేశావురా...ఎమ్డెన్ లాగా" లాంటి ప్రశంసల్తో ఈ పదాన్ని బాగా వాడేవాళ్లు. ఎమ్డెన్ లాంటి వాడంటే ఆషామాషీ రకమో, కంకురుకుంకో కాదని అర్థం.

ఎమ్డెన్ అనేది ఒక జర్మనీ యుద్ధనౌక. తూర్పుహంస (swan



ఎమ్డెన్ యుద్ధనౌక

of the east) అని దీని ముద్దుపేరు. వాయువ్య జెర్మనీలో ఏమ్స్ నదికి సమీపాన ఎమ్డెన్ పారిశ్రామికనగరం ఉంది. ఓక్స్ వాగేన్ కంపెనీ అక్కడిదే! మొదటి ప్రపంచ యుద్ధం కోసం ఇక్కడ తయారైన యుద్ధ నౌకకు ఎస్ ఎమ్ ఎస్ ఎమ్డెన్ అనిపేరుపెట్టి, 28 జులై, 1914న మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం కాగానే రహస్యంగా సముద్రంలోకి వదిలారు. కెప్టెన్ కార్ల్ వాన్ ముల్లర్ అనే దయాహీనుడు దీని కెప్టెను. సముద్రంలో శత్రునౌక ఏదీ లేకుండా చేయటం ఎమ్డెన్ కర్తవ్యం. ఎమ్డెన్ అనేది ఒకటి ఉందని ప్రపంచ దేశాలు తెలుసుకునే సరికే,మొదటి 3 నెలలలోపే అది శత్రువుల 20నౌకల్ని ముంచేసింది. 22 ఫిరంగుల్తో దూసుకొచ్చి శత్రునౌకల పైన, నౌకాస్థావరాల పైన నిప్పులు కురిపించేది.

ఆనాడు జర్మనీ, ఆస్ట్రియా హంగరీ, టర్కీలకు వ్యతిరేంగా జట్టు కట్టిన మిత్రదేశాల కూటమిలో ఫ్రాన్స్, బ్రిటన్, రష్యా, ఇటలీ, జపానూ ఉన్నాయి. బ్రిటన్ మనల్ని పాలిస్తోంది కాబట్టి మనం కూడా జెర్మనీ శత్రువులయ్యాం.

## మద్రాస్ హార్బర్‘పై దాడి

యుద్ధ వ్యూహాలన్నీ మధ్య ఆసియా, యూరోపులకు మాత్రమే పరిమితంగా ఉన్నాయి. భారతదేశం వైపు దాడి ఊహే ఎవరికీ లేదు. మద్రాస్ హార్బర్ కాపలాదారు ల్లేకుండా హాయిగా నిద్రపోతోంది.

1914 సెప్టెంబర్ 22 అర్ధరాత్రి అది రాజహంసలాగా బంగాళాఖాతంలోకి నిశ్శబ్దంగా వచ్చి, మద్రాస్ హార్బర్ వైపు దూసుకొచ్చింది. 125 మిలియన్ టన్నుల కిరోసిన్ నిండి ఉన్న బర్మా ఆయిల్ కంపెనీ టాంకర్లమీద ఎడాపెడా నిప్పులు కురిపించింది. హార్బర్ దాటి ఊళ్లో జనావాసాల మీద కూడా గుళ్లు వచ్చి పడసాగాయి. మద్రాస్ హైకోర్టు క్కూడా ఫిరంగి గుళ్ళు తగిలాయి. ఊరు ఊరంతా భయభ్రాంతులకు లోనయ్యింది. జనం హాహాకారలు చేస్తూ సముద్రానికి దూరంగా పరువులెత్తారు. అదొక బీభత్స భయానక అనుభవం.

## శృంగభంగం

9 నవంబర్ 1914న ఒక రష్యన్ ప్రయాణీకుల నౌకని,



మద్రాస్ హార్బర్ పైన తగలబడ్తున్న
బర్మా ఆయిల్ టాంకులు

ఒక ఫ్రెంచి వారి పడవని ముంచేసి ఎమ్డెన్ విజయగర్వంలో ఉంది.

దాని విషపు చూపు కోకోస్ దీపం దగ్గరున్న ఆస్ట్రేలియా వారి సిడ్నీ నౌకమీద పడి అటువైపుకు ప్రయాణం దౌడు తీసింది. నవంబర్ 23న బ్రిటిష్ ప్రభుత్వం అధికారికంగా ఎమ్డెన్ నౌకని కూల్చిన తీరుని వివరిస్తూ విడుదలచేసిన కథనాన్ని ఆంధ్రపత్రిక ప్రచురించింది.

ఎమ్డెన్ నౌక కోకో ద్వీపాన్ని సమీపిస్తోందని నవంబరు 9 ఉదయం 7 గంటలకి తీగలేని టెల్లిగ్రాం ద్వారా సిడ్నీనావకు బ్రిటన్

వెంట రాక్షసిబొగ్గును వేసుకొని తిరుగుతూ వుండే బురెమ్మ అనే స్టీమర్ అక్కడకొచ్చింది. సిడ్నీ వేసిన రెండు ఫరంగి గుండ్లకు ఈ స్టీమరు కుప్పకూలింది. మునిగిపోతున్న బురెన్కులో కళాసీల్ని తన ఒడలోకి తీసుకుపోయి రక్షించింది.

తప్పుకుపోవాలని చూసిన ఎమ్డెన్ లోతులేని ప్రాంతంలోకి పోయి ఇసుకలో ఇరుక్కుంది. అయినా సిడ్నీ మీద పోరు ఆపలేదు. సాయంత్రం నాలుగున్నరకు ఎమ్డెన్ని ముంచివేసే కార్యక్రమం మొదలై 4-35 నిమిషాల్లో పూర్తయిపోయింది. ఎమ్డెన్లో బతికున్న నావికుల్ని బంధించారు, గాయపడ్డవాళ్లని కొలంబోఆసుపత్రిలోచేర్పించారు. అలా శృంగభంగమై ముగిసింది ఎమ్డెన్ కథ.

## ఎమ్డెన్ ప్రభావం నేటికీ

ఎమ్డెన్ మద్రాస్ మీదకొచ్చి 110 యేళ్లు గడుస్తున్నాయి. ఇప్పటికీ ఆ పీడకలని తమిళులు, మళయాళీలు మరిచిపోలేదు. ఎమ్డెన్ అంటే వారి దృష్టిలో యమదూత అని! "యమ అండన్" అని వాళ్లు దాన్ని ఇప్పటికీ పిలుస్తారట.

చడీ చప్పుడూ లేకుండా వచ్చి కావాల్సిన పని సాధించుకునిపోయేవాణ్ణి ఎమ్డెన్ అని తెలుగువాళ్లు వ్యవహరించారు. క్రమేణా జనవ్యవహారంలో ఈ పదం అద్భుతానికి పర్యాయపదం అయ్యింది. ఒకప్పుడు జనం బాగానే ఈ పదాన్ని వాడారు. కానీ, రచయితలు రచనల్లో ప్రజలభాషను ప్రతిబింబించకపోవటం వలన, నిఘంటు కర్తలు పట్టించుకోకపోవటం వలన తెలుగు భాషలో కొత్తగా ప్రవేశించిన ఈ పదం నిలవకుండా వెలిసిపోయింది. పరభాషాపదమైనా, తెలుగులో ఒకప్పుడు రాణించిన ఈ పదం తిరిగి వాడకంలోకి తేదగినదే!

కత్తిలా ఉంది, అదిరింది, సోపు, మస్త్ మస్త్ లాంటి అతిశయోక్తులకు బదులుగా ఎమ్డెన్ చక్కగా అతికినట్టు సరిపోయే పదం! అ

## విలోమ కథలు 46వ పుట తరువాయి.....

ఈ విలోమ కథలలో అనేకమంది విమర్శకులు గొప్ప కథగా భావించిన కథ సిమెంటు సంతతి. రాజకీయ నాయకులు చనిపోయిన సరే, విగ్రహాలుగా మారిన తర్వాత కూడా ప్రజల జీవితాలతో ఎలా చెలగాటమాడుకుంటారో తమ సంతతిని ఎలా పెంచుకుంటూ వెళ్తారో తెలియజేసిన కథ. చివరి కథ అతి పెద్ద కథ నరగ్రహణం. ఈ కథ ఎమర్జెన్సీ విధించిన అర్ధరాత్రి నుండే మొదలవుతుంది. ఎమర్జెన్సీ కాలంలో ఓ నాయకురాలి క్రూర స్వభావాన్ని ప్రతీకాత్మకంగా శక్తిమంతంగా చెప్పిన కథ నరగ్రహణం. అవయవాల వ్యాపారం ఈ కథలో రచయిత ప్రస్తావించడం ఆయన దూరదృష్టికి ఉదాహరణగా చెప్పవచ్చు.

చుట్టూ ఉన్న వ్యవస్థ మొత్తం విలోమంగా సాగుతున్నప్పుడు కథ సాఫీగా ఎలా సాగుతుంది అందుకే ఈ కథలు కాళ్లు చేతులు లేకుండానే, ఉన్నా సరే తలకిందులు గానే నడవడం అనే ప్రయోగం ద్వారా రచయిత నడిపాడు .

రాజ్యం అమానుష అమానవీయ స్వభావాన్ని చిత్రించిన కథలు ఇవి. ఏ సమయంలో అయితే ఇలాంటి ఆలోచనలు వ్యవస్థలో చేశారో, అలాంటి ఆలోచనలు సమాజాన్ని ఇబ్బంది పెడుతున్న కాలంలో చాలా సహజంగా ఇవి రాసినట్టే అనిపిస్తాయి. ఆ పరిస్థితులే ఆయన్ని ఆ కథలనిర్మాణాన్ని అలా చేసేలా చేశాయి. రచయిత ఎంచుకున్న భాష, చెప్పే తీరు, కథా సంవిధానం కథ చదువుతున్నంత సేపు ఆనాటి వాతావరణం ఆ నేపథ్యం అలా తిరుగుతూ ఉంటుంది. విలోమ కథలు ఇప్పుడు మూడవ ముద్రణ పొందాయి. మరో ముద్రణ పొంద కూడదు అంటే వ్యవస్థ మారాలి .పాలకులు మారాలి. ప్రజా కంటక నిర్ణయాలకు ప్రతిఘటనల జెండాలు ఎగరాలి.

–డాక్టర్ సుంకర గోపాలయ్య
9492638547

## బడిలో తెలుగు నేర్చుకోనందుకే నాకు ఈ సమస్య! - లోకేష్

యువగళం పాదయాత్ర సందర్భంగా ఒక విందు సమయంలో మాట్లాడుతూ తనకు తెలుగు ధారాళంగా రాదని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి లోకేష్ అన్నారు. తెలుగు బాగా వచ్చి ఉంటే ప్రజలకు మరింత దగ్గరయ్యేవాడినని అన్నారు. బడిలో తెలుగు నేర్చుకోకపోవటం వలనే ఆ సమస్య వచ్చిందని, అందుకని తన కొడుకు దేవాంశ్‌కు బడిలో కనీసం ఒక విషయంగా తెలుగు ఉండేలా జాగ్రత్త తీసుకుంటున్నట్టు ఆయన అన్నారు.

## పాత సినిమాపాటల వల్లే తెలుగుకు ప్రోత్సాహం

⦿ జూన్ 21న ప్రపంచ సంగీత దినోత్సవాచరణలో భాగంగా విశాఖపట్నంలో యూట్యూబ్‌లో తెలుగు పాత సినిమా పాటలు పాడే యూట్యూబ్ చానల్ నిర్వాహకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలుగు భాషా పరిరక్షణకు, పాత సినిమా పాటలు కూడా దోహదం చేస్తాయని. పదే పదే పాత పాటలు వింటూ తెలుగును మర్చిపోకుండా కొనసాగించే అవకాశముందని నిర్వాహకులు అన్నారు.

## జొన్నవిత్తుల కొత్త రాజకీయ పార్టీ 'జై తెలుగు'

జై తెలుగు పేరుతో తెలుగు సినిమా పాటల రచయిత, పారడీ కవి, రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు జై తెలుగు పేరుతో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించబోతున్నారని దినపత్రికల్లో వార్త వచ్చింది. తెలుగు భాషపై రాజకీయ నాయకులకు అవగాహన కల్పించేందుకు పార్టీ పెట్టినట్టు ఆయన తెలియజేశారట. రామలింగేశ్వరరావు గారికి అభినందనలు.

# ఆలోచన అంటే ఏమిటి!

ఉపాధ్యాయుడు : విద్యార్థీ ఏమి చేస్తున్నావు?
విద్యార్థి : ఆలోచిస్తున్నాను.
ఉ.: ఆలోచన అంటే ఏమిటి?
వి.: ఆలోచన అంటే ఏమిటో నాకు తెలియడం లేదు మీరు చెప్పండి? ఆలోచన అంటే ఏమిటి?
ఉ.: ఆలోచన అంటే ఏమిటో నాకు కూడా తెలియదు. ఇద్దరం కలిసి తెలుసుకుందాం. ఈ గదిలో ఏదైనా ఒక వస్తువు గురించి ఆలోచించు
వి.: ఆలోచించాను
ఉ.:ఏమి ఆలోచించావు? వివరించి చెప్పు.
వి.: గదిలో తిరుగుతున్న ఫ్యాను గురించి ఆలోచించాను. ఫ్యాను ఎలా తిరుగుతున్నదని ఆలోచించాను. ఈ ఫ్యాను ఊడి కింద పడితే ఏ వైపు ఎంతదూరంలో పడుతుంది? దీనికి మూడురెక్కలే ఎందుకున్నాయి? అనే సందేహాలు వచ్చాయి.
ఉ.: అంటే నిన్ను నువ్వే ప్రశ్నించుకొన్నావు "ఇప్పుడు చెప్పు ఆలోచించడం అంటే ఏమిటి?
వి.:ఆలోచించడం అంటే ప్రశ్నించడం
ఉ.: నీ ప్రశ్నలకు సమాధానాలు ఎలా సంపాదిస్తావు?
వి.:బాగాఆలోచిస్తాను.తెలియకపోతే పుస్తకాల్లో వెతుకుతాను.గూగుల్‌లో వెదుకుతాను. స్నేహితుల్ని అడుగుతాను తమ లాంటి ఉపాధ్యాయుల్ని అడిగి తెలుసుకుంటాను
ఉ.: వెదికేటప్పుడు ఏమి ఆలోచిస్తావు?
వి.: సమాధానం సరైనదా కాదా అని సందేహిస్తాను.
ఉ.:ఇక్కడ కూడా ప్రశ్నిస్తూనే వున్నావుకదా? ఇప్పుడు చెప్పు ఆలోచించడం అంటే ఏమిటి?
వి.:ప్రశ్నించడం అన్వేషించడం
ఉ.: మొదట ఎందుకు తెలియదన్నావు?
వి.:అవును ఆలోచించకుండానే తెలియదన్నాను.
ఉ.:ప్రశ్నించడం లేదంటే ఏమిటి అర్థం?
వి.: ప్రశ్నించడం లేదంటే ఆలోచించడం లేదని అర్థం.
ఉ.:ఆలోచించడం అంటే ప్రశ్నించడం అనే సంగతి ఎలా తెలుసుకొన్నాం.
వి.: ప్రశ్నించడం ద్వారానే తెలుసుకొన్నాం.
ఉ.: ఇదంతా నేను చెప్పానా? స్వయంగా నీకు నువ్వు తెలుసుకొన్నావా?
వి : నేను సరిగ్గా ఆలోచించేటట్లు మీరు సరైన ప్రశ్నలు అడిగారు. ఇద్దరం కలిసి తెలుసుకొన్నాం.

ఈ పద్ధతే పాచీన కాలంలో మొదట సాగిన బోధనా పద్ధతి. గురువు బోధించేవాడు విద్యార్థి నేర్చుకోనేవాడు కాదు. ఇద్దరూ జ్ఞానసంపాదనలో కలిసి ప్రయాణం సాగించారు.

2400 సంవత్సరాల కిందట గ్రీకు తత్వవేత్త సోక్రటీసు ఈ పద్ధతినే అవలంభించాడు. ప్రశ్నించిప్రశ్నించి ప్రాణం మీదకు తెచ్చుకొన్నాడు. మరణ శిక్షనుండి తప్పించుకోడానికి క్షమాభిక్ష కోరుకోమన్నారు. మరణం నుంచి తప్పించుకోడానికి మానవులు ఎందుకింత తాపత్రయపడతారు? సత్యాన్వేషణ లేని జీవితం ఎందుకు? అని ప్రశ్నిస్తూనే మరణాన్ని ఆహ్వానించాడు. దేవతల్ని అవమానించాడని, యువకుల్ని చెడగొడుతున్నాడని అతని మీద అభియోగాలు మోపి మరణ శిక్ష విధించారు.ఇప్పటికీ పాలకులు ప్రశ్నిస్తే భయపడుతున్నారు.ప్రశ్నించిన వారిని జైళ్ళకు పంపుతున్నారు

అరిస్టాటిల్ గురువు ప్లేటో సోక్రటీసు శిష్యుడే. ఆరిస్టాటిల్ శిష్యుడే విశ్వవిజేత అలెగ్జాండర్. అంత గొప్పగురువులు,ఆంత గొప్ప శిష్యులు అంతగొప్ప చక్రవర్తి ప్రశ్నలనుండి పుట్టినవారే.

- ప్రశ్నకు గల శక్తిని తక్కువ అంచనా వేయకు.అది అణుశక్తి అంత బలమైనది.
- నేనేవరికీ ఏమీ నేర్పను. ఆలోచించేట్లు చేయగలను అంతే 'సోక్రటీసు'

ప్రశ్న గురించి' టెడ్ ఆగాన్' ఇంగ్లీషులో రచించిన 'ద హ్యూమన్ కీ' అనే పుస్తకాన్ని డా.పి.హరిపద్మరాణి,పెద్ది సాంబశివరావుగారు తెలుగులోకి 'ప్రశ్న ఎందుకు' అనే పేరుతో అనువదించారు..తప్పక చదవండి.

సి.వి.కృష్ణయ్య, 9396514551

## గ్రంథాలయం



**దయాశోకం** (దీర్ఘ కవిత్వం)
రచన: **డా.మాటూరి శ్రీనివాస్**
పుటలు: 144, వెల 150/-
ప్రతులకు:అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో
ఫోన్:98499 08929

**చివరిదాక** (కవితలు)
రచన: **కమ్ముల నర్సిములు**
పుటలు: 67, వెల 100/-
ప్రతులకు: కె.రవీందర్,ఇంటి నెం.3-188/7, టైలర్స్ కాలనీ,ఆదిలాబాద్
ఫోన్: 9490561727



Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362




## అమ్మనుడి సంపాదకీయాల సమాహారం
(రాష్ట్రీయం- జాతీయం, రాజకీయం - సిద్ధాంతం)

**అమ్మనుడి** పత్రికలో 'సంపాదక హృదయం' శీర్షికను పాఠకులు ప్రత్యేక శ్రద్ధతో చదువుతారు. మాతృభాషల కోసం దేశంలో నడుస్తున్న ఉద్యమాల గురించీ, ప్రభుత్వాలతో సాగుతున్న సంఘర్షణ గురించీ ఆ సంపాదకీయాలు అవగాహన కల్పిస్తాయి. ముఖ్యంగా తెలుగురాష్ట్రాలలో నడుస్తున్న తెలుగు భాషోద్యమ ధోరణులకు అద్దం పడుతాయి. ఆయా అంశాలపై చదవరులకు స్పష్టత కలిగించేందుకు 2015 మార్చి నుండి 2023 ఫిబ్రవరి వరకు 'అమ్మనుడి' మాసపత్రిక సంపాదకీయాలను 5 విభాగాలలో ఇచ్చాము. ఈ వ్యాసాలు భాషోద్యమకారులకు దిశాదర్శనం చేస్తాయి. తెలుగు ప్రజలకు ఈ సమస్యల లోతుపాతులను తెలియజేస్తాయి.

**300 పుటల పుస్తకం వెల రూ. 200/-**

## నడుస్తున్న చరిత్ర, అమ్మనుడి మాస పత్రికలలో ప్రముఖ కార్టూనిస్ట్




సరసి

తెలుగు భాషోద్యమంలో భాగంగా
అమ్మనుడి కోసం వేసిన
200 వ్యంగ్యచిత్రాలను
పుస్తకంగా వెలువరించాము.

వెల: 200/-

Telugu Jaathi
+91 94929 80244

9492980244@okbizaxis

**బ్యాంక్‌ఖాతా వివరాలు**

ఆన్‌లైన్ ద్వారా పంపేవారు NEFT / RTGS ద్వారా
**'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.
TELUGU JAATHI - AXIS BANK, TENALI
అకౌంట్ నెం. **91402002038788 0**
**IFSC Code : UTIB0000556**
ఈ QRకోడ్‌ను స్కాన్ చేసి లేదా QRకోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు పంపవచ్చును.

పుస్తకాల ధరను 'తెలుగుజాతి' ట్రస్ట్ ఖాతాకు పంపించి వివరాలు
9440448244 లేదా
9492980244 కు
తెలిపితే కొరియర్ / రిజిష్టర్డ్ పోస్టు ద్వారా పుస్తకాలను పంపిస్తాము
హైదరాబాద్‌లో "నవోదయ బుక్ హౌస్"
కాచిగూడ, ఫోన్:040 - 24652387,లో
కూడా లభిస్తాయి.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
JULY 2023 Vol :9, Issue 5

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

అభినందనలతో...

# బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ గుంటూరు

బి.టి.సి. హౌస్,
5వ వీధి, చంద్రమౌళి నగర్,
గుంటూరు - 522 007
ఫోన్ : 91-863 - 2357615
2357616
ఫ్యాక్స్ : 91-863-2351343

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244